సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 249

బుధవారం 24-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



అవకాశాలను సృష్టించుకోవాలి

సిలికాన్ వ్యాలీలో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్న వీణపై కథనం - 11లో



చెన్నై 'విజిల్ పోడు'

ఐపీఎల్ ఫైనల్‌లోకి సూపర్‌కింగ్స్.. గుజరాత్‌పై ఘన విజయం - 12లో



కేంద్రంపై పోరులో మీ వెంటే మేం

పరిపాలన సర్వీసులపై కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ మీద పోరులో కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని బెంగాల్ సీఎం మమత చెప్పారు.

వివరాలు 6లో ▸



సిసోడియా పట్ల అనుచిత ప్రవర్తన

కోర్టుకు హాజరైన సిసోడియా మీడియాతో మాట్లాడబోగా, పోలీసులు ఆయన్ను మెడపట్టి లాగడం వివాదాస్పదమైంది.

వివరాలు 6లో ▸



తొలిసారి రజత, కాంస్య పతకాలు

ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీ మహిళల స్కీట్ విభాగంలో భారత్‌కు తొలిసారి రజత, కాంస్య పతకాలు లభించాయి.

వివరాలు 12లో ▸



మూడో రోజూ ముందుకే..

స్టాక్ మార్కెట్‌లు వరుసగా మూడు రోజూ బలపడ్డాయి. సెన్సెక్స్ 18 పాయింట్లు, నిఫ్టీ 34 పాయింట్లు లాభపడ్డాయి.

వివరాలు 13లో ▸

ఇదిగో మార్పు..

ఇదివరకెన్నడూ లేని విధంగా సామాజిక మౌలిక వసతులకు భారీగా వ్యయం

రాష్ట్రంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో పెద్ద ఎత్తున వెచ్చింపు

బ్రాండ్ ఏపీ

- ఈ రంగాల్లో సామాజిక ఆస్తుల కల్పనకు ఏకంగా రూ.55,597 కోట్లు
- ఇప్పుడు ఏ గ్రామం వెళ్లినా కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్న మార్పు
- సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే, డిజిటల్ లైబ్రరీ, ఇంగ్లిష్ మీడియం స్కూలు
- విద్యా రంగంలో నాడు–నేడుతో మౌలిక వసతులకు రూ.16,450.69 కోట్లు
- తొలి దశలో రూ.3,669 కోట్లతో 15,715 స్కూళ్లు సర్వాంగ సుందరం
- రెండో దశలో రూ.8,000 కోట్లతో 22,344 స్కూళ్లలో కొనసాగుతున్న పనులు
- వైద్య రంగంలో మౌలిక వసతుల కల్పనకు రూ.16,822 కోట్లు
- 17 కొత్త మెడికల్ కాలేజీలు.. అదనంగా మరో 2,100 సీట్లు
- ఈ ఏడాది నుంచి ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు
- ఇప్పటికే ఉన్న 11 మెడికల్ కాలేజీల్లో రిపేర్లు, మౌలిక సదుపాయాల కల్పన
- 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్.. 528 వార్డు హెల్త్ క్లినిక్స్ నిర్మాణం ముమ్మరం
- కొత్తగా 150 పీహెచ్‌సీలు.. 992 పీహెచ్‌సీల ఆధునికీకరణ
- వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలకు రూ.17,000 కోట్లు
- 10,893 గ్రామ సచివాలయాలు, 10,216 రైతు భరోసా కేంద్రాలు
- అభివృద్ధి, సామాజిక రంగం వ్యయం పెరుగుతోందని ఆర్‌బీఐ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో తొలిసారిగా విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టపీట వేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అవసరమైన కనీస సామాజిక మౌలిక వసతులను ప్రభుత్వ రంగంలో కల్పిస్తోంది. ఇందుకు ఏకంగా రూ.55,597 కోట్లు వ్యయం చేస్తోంది. తద్వారా గ్రామీణ ముఖ చిత్రంలో సమూల మార్పులు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఒక పక్క దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని గత చంద్రబాబు సర్కారు

మిగతా 2వ పేజీలో ▶

రెవెన్యూ లోటు భర్తీని సాధించిన సీఎం జగన్

కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నా, తేలేకపోయిన గత చంద్రబాబు సర్కారు

సీఎం విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి రూ.10,461 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

3లో



సిడ్నీ ఇండోర్ స్టేడియంలో జరిగిన సభకు హాజరైన వారికి అభివాదం చేస్తున్న భారత్, ఆస్ట్రేలియా ప్రధానులు

నమ్మకమే పునాది

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం: ప్రధాని నరేంద్ర మోదీ

కిక్కిరిసిన సిడ్నీ ఇండోర్ స్టేడియం 20 వేల మందికి పైగా హాజరు.. ఆద్యంతం మోదీ నినాదాలే



ఆస్ట్రేలియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం నానాటికీ బలోపేతమవుతోంది. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపునకు మించి పెరుగుతుంది. భారత్ నేడు ప్రపంచమంతటికీ ఓ సానుకూల శక్తిగా ఎదిగింది. ఎక్కడ ఎలాంటి విపత్తు జరిగినా సాయానికి అందరికంటే ముందు నిలుస్తూ వస్తోంది. ప్రపంచ మాంద్యం పరిస్థితులను సమర్థంగా తట్టుకుంటున్న దేశమేదైనా ఉందంటే అది భారతేనని ప్రపంచ బ్యాంకు కూడా చెప్పింది.

– ప్రధాని మోదీ

ప్రపంచంలో ఎక్కడికెళ్లినా రాక్‌స్టార్ తరహాలో అపూర్వ స్వాగతం పొందే అత్యంత పాపులర్ నాయకుడు మోదీ. ఇంత భారీ సంఖ్యలో భారతీయులు ఆస్ట్రేలియాను తమ సొంతిల్లుగా మార్చుకున్నందుకు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. వారిని చూసి గర్వపడుతున్నా.

– ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

6లో

న్యూస్‌రీల్

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై నిర్ణయానికి ఇన్ని రోజులా!



ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా? అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని సూచించింది.

వివరాలు 14లో ▸

ఆందోళనకరంగానే అవినాశ్ తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్యం



ఎంపీ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. అవినాశ్ తన తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్నారు. మరోవైపు ఎల్లో మీడియా దుష్ప్రచారం కొనసాగిస్తోంది.

వివరాలు 14లో ▸


టీచర్ల బదిలీలకు షెడ్యూల్ విడుదల



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల విభాగాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్‌ల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది.

వివరాలు 14లో ▸

ఏపీఈఏపీ సెట్‌కు 93.38 శాతం హాజరు



ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు 93.38 శాతం మంది హాజరయ్యారని సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన తెలిపారు. ఇంజినీరింగ్ ప్రాథమిక 'కీ'ని వెబ్‌సైట్‌లో పెట్టామని.. అగ్రికల్చర్, ఫార్మసీ 'కీ' బుధవారం విడుదల చేస్తామని చెప్పారు.

వివరాలు 14లో ▸

నీతి ఆయోగ్ వేదికపై రాష్ట్ర ప్రగతి చిత్రం

27న న్యూఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం.. హాజరుకానున్న సీఎం వైఎస్ జగన్

- ఆ సమావేశంలో చర్చించనున్న అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష
- నాలుగేళ్లలో వివిధ రంగాల్లో రాష్ట్రం గణనీయమైన పురోగతి
- ఆరోగ్యం, పౌష్టికాహారం రంగాల్లో చరిత్రాత్మక మార్పులు
- ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సీడీఎస్‌ల నియంత్రణ, ఆరోగ్యశ్రీ, ఆస్పత్రుల్లో నాడు–నేడుతో సత్ఫలితాలు
- తల్లులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది నియామకం
- మహిళా సాధికారిత కోసం విప్లవాత్మక కార్యక్రమాలు
- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి
- మరింత ప్రగతి సాధించేందుకు ఊతమందించాలి



సాక్షి, అమరావతి: గత నాలుగేళ్లలో వివిధ అంశాలు, పలు రంగాల్లో సాధించిన ప్రగతిని నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో వివరించడంతోపాటు కేంద్రం నుంచి సహాయాన్ని కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కీలక రంగాలకు సంబంధించి కొన్ని సూచనలు కూడా చేయనుంది. ఈనెల 27న న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆ సమావేశంలో చర్చించనున్న

మిగతా 2వ పేజీలో ▶

సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

- తెలుగు యువతి ఉమాహారతికి 3వ ర్యాంకు
- అన్నమయ్య జిల్లాకు చెందిన పవన్ దత్తాకు 22వ ర్యాంక్
- రాజమండ్రికి చెందిన తరుణ్‌కు 33వ ర్యాంక్.. ఎమ్మిగనూరుకు చెందిన అంబికా జైన్‌కు 69వ ర్యాంక్
- టాప్ ర్యాంకుల్లో ఏపీ, తెలంగాణ నుంచి పలువురు అభ్యర్థులు
- సివిల్స్ – 2022 తుది ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ
- మొత్తం 933 మంది ఎంపిక
- టాప్ ర్యాంకుల్లో నిలిచి దుమ్ము లేపేసిన అమ్మాయిలు
- తొలి 4 ర్యాంకులు వారివే

1వ ర్యాంకు సాధించిన ఇషితా కిశోర్

- తెలుగు రాష్ట్రాల నుంచి 50 మంది వరకు అభ్యర్థుల ఎంపిక



ఇషితా కిశోర్ (1వ ర్యాంకు)



ఉమా హారతి (3వ ర్యాంకు)

సాక్షి, అమరావతి: ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్స్–2022 పరీక్షల తుది ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు సత్తా చాటారు. జాతీయస్థాయిలో మూడో ర్యాంకుతో పాటు 50 వరకు ర్యాంకులు సాధించి రికార్డు సృష్టించారు. సివిల్స్–2022 తుది ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, తదితర సర్వీసుల పోస్టులకు సంబంధించి మొత్తం 933 మందిని ఎంపిక చేసినట్లు తెలిపింది. జనరల్ – 345, ఈడబ్ల్యూఎస్ – 99, ఓబీసీ – 263, ఎస్సీ – 154, ఎస్టీ – 72 మంది ఎంపికయ్యారు. వీరితో పాటు కన్సాలిడేటెడ్ రిజర్వు లిస్టులో ఆయా కేటగిరీల నుంచి 178 మంది ఎంపికైనట్లు యూపీఎస్సీ వెల్లడించింది. మొత్తంగా 1,022 మందిని ఆయా పోస్టులకు ఎంపిక చేసినట్లు తెలిపింది. వీరిలో ఐఏఎస్‌కు 180 మంది, ఐఎఫ్ఎస్‌కు 38 మంది, ఐపీఎస్‌కు 200 మందిని కేటాయించారు. ఇతర కేంద్ర సర్వీసెస్‌లకు సంబంధించి

మిగతా 3వ పేజీలో ▶



అనారోగ్యంపై విష కథనాలా?

- ఎల్లో మీడియాపై మాజీ మంత్రి పేర్ని నాని ఆగ్రహం
- అవినాశ్ విచారణపై ఎందుకీ అత్యుత్సాహం?
- చంద్రబాబు స్టేలు.. రామోజీ డ్రామాలు కనపడవా?
- సీబీఐకి నాడు ఎర్రజెండా.. నేడు బ్రహ్మరథమా?

14లో




పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించనున్న విపక్షాలు!

పార్లమెంట్ నూతన భవనాన్ని రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ ప్రధాని మోదీ ప్రారంభిస్తే ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

6లో

రూ.2,000 నోటు.. సవాలక్ష ప్రశ్నలు



- ఒక్కో బ్యాంకులో ఒక్కో రకంగా..
- మార్పిడి, డిజిటల్ నిబంధనల విషయంలో గందరగోళం
- నోట్ల మార్పిడి ప్రక్రియ ప్రారంభం

13లో

ఇదం జగత్



విపక్షాల భేటీలో మనదే పై'చేయి' ఉండే విధంగా కీలకంగా వ్యవహరించాలి

పేదలకు పెద్ద చదువులే లక్ష్యంగా..

నేడు జనవరి-మార్చి 2023 త్రైమాసికం 'జగనన్న విద్యా దీవెన' నిధులు జమ

- గత ప్రభుత్వం కంటే భిన్నంగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు
- క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజు ఆ త్రైమాసికం అయిన వెంటనే ఇస్తున్న ప్రభుత్వం
- గత త్రైమాసికానికి సంబంధించి 9.95 లక్షల మంది విద్యార్థులకు రూ.703 కోట్ల లబ్ధి
- ఇప్పటివరకు 26,98,728 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కింద రూ.10,636.67 కోట్లు అందజేత
- తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో బటన్‌నొక్కి జమ చేయనున్న సీఎం



సాక్షి, అమరావతి: పేద విద్యార్థులను కూడా పెద్ద చదువులు చదివించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా జనవరి–ఫిబ్రవరి–మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన నిధులను బుధవారం సీఎం లబ్ధిదారులకు జమచేయనున్నారు. ఈ పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం అయిన వెంటనే చెల్లిస్తోంది. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో జనవరి–మార్చి 2023 త్రైమాసికానికి 9.95 లక్షల మంది విద్యార్థులకు లబ్ధిచేకూరుస్తూ రూ.703 కోట్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సందర్భంగా కొవ్వూరులో జరగనున్న బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారు. పేద విద్యార్థులకు వైఎస్ జగన్ సర్కారు చేస్తున్న మేలును ఒకసారి పరిశీలిస్తే..

'జగనన్న విద్యా దీవెన'..

పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న ఆశయంతో.. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

175 స్థానాలు గెలిచేలా అడుగులు వేస్తున్నాం

నాలుగేళ్ల క్రితం గొప్ప విజయం అందించిన ప్రజలకు సీఎం జగన్ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: నాలుగేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి గొప్ప విజయం అందించిన ప్రజలకు సీఎం జగన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సీఎం జగన్ మంగళవారం ట్వీట్ చేశారు. 'దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలతో నాలుగేళ్ల క్రితం మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మీరు అప్పగించిన బాధ్యతను మీకు సేవ చేసే అవకాశంగా భావించి.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మన ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా అమలు చేశాం. మరోసారి మీకు సేవ చేసే అవకాశం లభించేందుకు వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో గెలుపొందేలా అడుగులు వేస్తున్నాం' అని ముఖ్యమంత్రి జగన్ ట్వీట్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సంబరాలు

సాక్షి, అమరావతి: అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కేక్ కట్ చేశారు. వీరు మాట్లాడుతూ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

'కిడ్నీ' బాధితుడికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

సీఎం ఆదేశాల మేరకు చెక్కు అందజేసిన కలెక్టర్ రాజాబాబు, మాజీ మంత్రి పేర్ని నాని



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్, డీఆర్వో వెంకటేశ్వర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): క్యాన్సర్ కణితి వల్ల ఒక కిడ్నీని కోల్పోయిన వ్యక్తికి 24 గంటల్లోనే ఆర్థిక సాయం అందజేయడం ద్వారా సీఎం జగన్ అండగా నిలిచారు. వివరాలు.. సోమవారం బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వచ్చిన సీఎం జగన్‌ను.. మచిలీపట్నంలోని వల్రైగూడెంకు చెందిన గోపాల నాగవెంకట చంద్రబాబు కలిశాడు. తనకు కొంతకాలం క్రితం క్యాన్సర్ కణితి వచ్చిందని.. అది శరీరంలో వేగంగా వ్యాపించడంతో వైద్యులు ఒక కిడ్నీని తొలగించారని చెప్పాడు. తనను, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. చంద్రబాబు దీన స్థితిని చూసి చలించిన సీఎం జగన్ వెంటనే ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో మంగళవారం చంద్రబాబుకు కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని నాని రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

గోడు విన్నారు.. ఆదుకున్నారు

సీఎం వైఎస్ జగన్‌కు సమస్యలు చెప్పుకున్న ప్రజలు ■ వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి జగన్



తమ కుమారుడి సమస్యను సీఎం జగన్‌కు విన్నవిస్తున్న చిన్నారి నవీన్ తల్లిదండ్రులు



థలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వీర్ల నవీన్‌కు ఇంటి స్థలం పట్టాను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన దాతృత్వాన్ని కొనసాగిస్తూ గుంటూరులో కొందరు పేదలకు వరాల జల్లు కురిపించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తల్లి శివపార్వతి మరణించడంతో గిరిధర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరులోని శ్యామలా నగర్ వచ్చారు. పరామర్శ అనంతరం తిరుగు ప్రయాణంలో కొందరు తమ గోడు వెళ్లబోసుకుని సాయం చేయమని వేడుకున్నారు. వారందరినీ పోలీస్ పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్ వద్దకు తీసుకురమ్మని అధికారులకు ఆదేశించారు.

అక్కడికక్కడే ఆదేశాలు

అధికారుల సాయంతో హెలిప్యాడ్‌కు చేరుకున్న వి.మరియమ్మ, కోటేశ్వరరావు దంపతులు తమ గోడును వివరిస్తూ.. తమ రెండో కుమారుడు నవీన్ థలసీమియా వ్యాధితో బాధపడుతున్నాడని, దీనికి రూ.26 లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. ఇంటిస్థలం కూడా లేదని వాపోయారు. వెంటనే సర్జరీకి ఏర్పాటు చేసి.. ఇంటి పట్టా ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. జె.బాబు, శివలక్ష్మి దంపతులు మాట్లాడుతూ మునిసిపాలిటీలో ఉద్యోగం తీసేశారని, ఆ ఉద్యోగం తమ కుమారుడికి ఇప్పించాలని వేడుకున్నారు. వెంటనే సీఎం జగన్ అందుకు తగిన ఆదేశాలిచ్చారు. బి.పేరిరెడ్డి అనే వ్యక్తి గోడు చెప్పుకుంటూ.. గతంలో కిడ్నీ వ్యాధికి సర్జరీ చేయించుకున్నానని కొంత ఆర్థిక సాయం చేయాలని కోరగా.. ఆయనకు రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని, వైద్యం అవసరమైతే తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. కాగా, కె.పుష్ప జైన్ మాట్లాడుతూ తమ జైన్ సొసైటీకి కల్యాణ మండపం ఏర్పాటు చేయమని కోరగా పరిశీలించి తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆగమేఘాల మీద సీఎం ఆదేశాలను సాయంత్రానికల్లా అమలు చేశారు. అప్పటికప్పుడే తమ కోర్కెలను మన్నించి న్యాయం చేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల పక్షాన ప్రభుత్వం: కలెక్టర్

గుంటూరులోని కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడి, జేసీ జి.రాజకుమారి బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి హామీలను నెరవేర్చడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు.





కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పేరిరెడ్డి సమస్యను వింటున్న సీఎం జగన్. పేరిరెడ్డికి రూ.లక్ష చెక్కును అందిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి,ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి





సీఎంకు తన సమస్యను వివరిస్తున్న శివకుమారి. శివకుమారికి ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

మద్దాళి గిరికి సీఎం జగన్ పరామర్శ

ఎమ్మెల్యే గిరి మాతృమూర్తి శివపార్వతికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి



శివపార్వతి చిత్రపటానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పట్నంబజారు (గుంటూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి శివపార్వతి(67) సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మంగళవారం గుంటూరు శ్యామలానగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అన్నివేళలా అండగా ఉంటానని.. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. శివపార్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు విడదల రజిని, మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేశ్, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, కిలారి రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్, వెలంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాల్‌పురం రాము తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' సత్కారం వాయిదా

- తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు జూన్ 12 తర్వాత వేడుక
- తోటి విద్యార్థుల సమక్షంలో సన్మాన కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల 'జగనన్న ఆణిముత్యాలు' సత్కార వేడుకను ప్రభుత్వం వాయిదా వేసింది. వేసవి సెలవుల అనంతరం విద్యా సంస్థలు తిరిగి ప్రారంభమైన తర్వాత ఎక్కువ మంది విద్యార్థుల సమక్షంలో ఈ వేడుక నిర్వహించాలని నిర్ణయించినట్లు పాఠశాల విద్య ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 25న నియోజకవర్గం స్థాయిలో, 27న జిల్లా, 31న రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులైన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించాల్సి ఉంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్‌ను కూడా సన్మానించాలని నిర్ణయించారు. అయితే, ఈ వేడుకల్లో టాపర్స్‌తో పాటు తోటి విద్యార్థులు కూడా పాల్గొంటే స్ఫూర్తిదాయకంగా ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యర్థించారు. వారి అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మాన కార్యక్రమం వాయిదా వేసినట్టు ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత ఈ కార్యక్రమం మూడు స్థాయిల్లో నిర్వహిస్తామని, వాటి తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ వేదికపై రాష్ట్ర ప్రగతి చిత్రం

▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్యం, పౌష్టికాహారం రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు.. ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సీడీసీఎస్‌ల నియంత్రణ, ఆరోగ్యశ్రీ, ఆస్పత్రుల్లో నాడు–నేడు, తల్లులు, పిల్లలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది నియామకం.. తదితర అంశాలను స్పష్టంగా వివరించేలా సన్నద్ధం కావాలన్నారు. 104 వాహనాల ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను వివరించడంతో పాటు పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల మధ్య అనుసంధానం ద్వారా కార్యక్రమం ఎలా విజయవంతంగా సాగుతుందో తెలియజేయాలని నిర్ణయించారు. సమీక్షలో చర్చించిన అంశాలు ఇవీ..

మహిళా సాధికారత దిశగా అడుగులు

- మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. దీంతోపాటు బహుళజాతి కంపెనీలతో కలిసి చేయూత పథకాన్ని అమలు చేస్తోంది. తద్వారా ఆయా కుటుంబాల్లో జీవన ప్రమాణాలు పెరిగేందుకు, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు తోడ్పాటు అందించింది.
- మహిళా సాధికారత దిశగా చేయూతతో పాటు, ఆసరా, సున్నా వడ్డీ రుణాలు కీలక పాత్ర పోషించాయి. 'దిశ' కింద చేపట్టిన కార్యక్రమాలు.. సత్వరమే స్పందించిన తీరు వల్ల వేలాది మంది బాలికలు, మహిళలకు రక్షణ లభించింది.
- మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యా శాఖ.. ఈ మూడు విభాగాలు కలిసి డేటాను సమ్మిళితం చేయాలి. తల్లి గర్భం దాల్చి, కాన్పు పూర్తి కాగానే శిశువుకు ఆధార్ నంబరు కేటాయింపు జరిగేలా చూడాలి.
- ఆ తర్వాత పిల్లలకు పౌష్టికాహారం అందించడం దగ్గర నుంచి, అంగన్వాడీల్లో చేరిక, తర్వాత స్కూల్లో చేరిక వరకూ వారిని ట్రాక్ చేయడానికి సులభతరం అవుతుంది. పిల్లల ఆరోగ్యం, వ్యాక్సినేషన్, చదువులు తదితర అంశాలన్నింటినీ ట్రాక్ చేయొచ్చు.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్‌లో కీలక ప్రగతి

- రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో త్వరితగతిన గణనీయమైన ప్రగతి సాధ్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం వల్ల ఎంఎస్‌ఎంఈలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా మద్దతు కావాలి.
- రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లతో తీర ప్రాంతంలో మౌలిక సదుపాయాలు బాగా పెరగనున్నాయి.
- కడప, కర్నూలు ఎయిర్‌పోర్టులకు నిధులు పూర్తి స్థాయిలో వెచ్చించి వాటిని సంపూర్ణ వినియోగంలోకి తీసుకొచ్చాం. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. నెల్లూరు సమీపంలోని తెట్టువద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణం ముందుకు సాగేలా అడుగులు వేస్తున్నాం

పరిశ్రమల నుంచి నిరంతరం ఫీడ్ బ్యాక్

- పరిశ్రమల నుంచి క్రమం తప్పకుండా ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలి.
- ఫ్యామిలీ డాక్టర్ విధానంలో హైపర్ టెన్షన్, డయాబెటిస్.. రెండూ ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వీరికి వైద్యం అందించడం, ఫాలోఅప్ చేయడం చాలా ముఖ్యం. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న బోధనాస్పత్రులు, కొత్తగా నిర్మించనున్న బోధనాస్పత్రుల్లో తప్పనిసరిగా క్యాన్సర్‌కు సంబంధించిన ల్యాబ్‌లు, కాథ్ ల్యాబ్స్ తప్పనిసరిగా పెట్టాలి. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలి.

స్కిల్ కార్యక్రమాల్లో వేగం పెరగాలి

- స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో కార్యక్రమాల వేగం పెంచాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గానికి ఒక హబ్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రతి జిల్లా కేంద్రంలో కూడా ఒక స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఇదివరకే డిగ్రీలు సాధించిన వారు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు ఈ స్కిల్ సెంటర్లు ఉపయోగపడతాయి.
- నియోజకవర్గాలలో హబ్స్, జిల్లాల వారీగా సెంటర్లలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల రూపకల్పనకు ఒక వర్సిటీని ఏర్పాటు చేయాలి. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఈ కోర్సులను సంబంధిత యూనివర్సిటీ ద్వారా రూపొందించాలి.
- స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు గతంలో అవినీతిమయం అయ్యాయి. రూ.371 కోట్లు దోచుకున్నారు. అలాంటి పరిస్థితులకు ఆస్కారం ఉండకూడదు. నిధుల వినియోగంలో జవాబుదారీతనం ఉండాలి. ప్రభుత్వ రంగంలో స్కిల్ కాలేజీలు, వీటికి సంబంధించి ప్రభుత్వం అమలు చేయనున్న ప్రణాళికతో.. మంచి వ్యవస్థలు ఏర్పడతాయి. తద్వారా నిరంతరాయంగా పిల్లలకు నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

ఇదిగో మార్పు..

▶ మొదటి పేజీ తరువాయి

విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను నిర్లక్ష్యం చేయడమే కాకుండా, ఆ రంగాల్లో ప్రైవేట్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కనీస సామాజిక బాధ్యతగా ఆయా రంగాల్లో ప్రజలకు అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఒక పక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే ప్రజలకు అవసరమైన విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దఎత్తున వ్యయం చేస్తోంది. ప్రతి గ్రామంలోనూ ఇప్పుడు సచివాలయం కనిపిస్తోంది. అక్కడి నుంచి నాలుగు అడుగులు వేస్తే వైఎస్సార్ హెల్త్ క్లినిక్.. ఇంకో నాలుగు అడుగులు వేస్తే వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం కనిపిస్తోంది. మరో నాలుగు అడుగులు వేస్తే డిజిటల్ లైబ్రరీ.. ఇంకో నాలుగు అడుగులు వేస్తే సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దిన ఇంగ్లిష్ మీడియం స్కూల్ సాక్షాత్కరిస్తోంది. ఇప్పుడు ఏ గ్రామం వెళ్లినా ఈ స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

విద్యా రంగంలో భారీ వ్యయం

మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 61,661 స్కూళ్ల రూపు రేఖలు మార్చేందుకు ఏకంగా రూ.16,450.69 కోట్లు వ్యయం చేసేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. ఇప్పటికే తొలి దశలో 15,713 స్కూళ్లలో రూ.3,697.86 కోట్లతో పనులు పూర్తి చేశారు. ఈ స్కూళ్లన్నీ 10 రకాల వసతులతో కార్పొరేట్ స్కూళ్లను మించి సర్వాంగ సుందరంగా దర్శనమిస్తున్నాయి. నాడు–నేడు రెండో దశలో 22,344 స్కూళ్లలో రూ.8,000 కోట్లతో పనులు చేపట్టారు. విద్యార్థులకు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. తొలి దశలో ఆయా గ్రామాల్లో రూపురేఖలు మారిన స్కూళ్లను చూస్తే.. గతానికి, ఇప్పటికి మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సకల మౌలిక వసతులు సమకూర్చిన స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్నారు. దశల వారీగా గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీల నిర్మి స్తున్నారు. తొలి దశలో రూ.575 కోట్లతో 3,589 డిజిటల్ లైబ్రరీలను వేగంగా నిర్మిస్తున్నారు. పట్టణాల నుంచి సొంతూరు వెళ్లినా, అక్కడి నుంచే పనిచేసేలా డిజిటల్ లైబ్రరీలను చేపడుతున్నారు.

చూడ ముచ్చటగా స్కూళ్లు

చంద్రబాబు హయాంలో ప్రభుత్వ స్కూళ్లలో మరుగుదొడ్లు లేక ఆడ పిల్లలు అనేక అవస్థలు పడ్డారు. రేకులు, దుప్పట్లు అడ్డు పెట్టుకునే పరిస్థితులుండేవి. శిథిలమైన బడులు ఆ బడులను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, సురక్షిత మంచినీటి వసతి, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, లైట్లు, గ్రీన్ చాక్ బోర్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ఫర్నీచర్‌తో పాటు ప్రహరీ.. తదితర మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ బడులు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. తొలి దశ స్కూళ్లలో వచ్చే జూన్‌లో స్కూళ్లు తెరిచే నాటికి స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో పూర్తిగా డిజిటల్ క్లాసు రూములుగా దర్శనమివ్వనున్నాయి. నాడు–నేడు పేరుతో విద్యా సంస్థల్లో చేపట్టిన పనుల వ్యయం సామాజిక పెట్టుబడిగా.. ప్రజల ఆస్తులుగా పరిగణించాలని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ చర్యలు ఫలితాలు ఇస్తున్నాయనడానికి పెరిగిన చేరికలే నిదర్శనం. ప్రభుత్వ స్కూళ్లను సీబీఎస్ఈ ఇంగ్లిష్ మీడియంతో తీర్చిదిద్దుతున్నారు. ఇవి వచ్చే తరం పిల్లల భవిష్యత్ కోసం మన ప్రభుత్వం తీసుకువస్తున్న గొప్ప మార్పుగా విద్యా వేత్తలు అభివర్ణిస్తున్నారు.

బ్రాండ్ ఏపీ

ప్రజారోగ్యంలో భారీ మౌలిక సౌకర్యాలు

- నాడు–నేడు పేరుతో వైద్య రంగంలోనూ కొత్తగా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, ప్రస్తుతం ఉన్న మెడికల్ కాలేజీల ఆధునికీకరణ, విలేజ్, వార్డు క్లినిక్స్ నిర్మాణం, స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.16,822 కోట్లు వ్యయం చేస్తోంది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టింది. ఇందులో 5 కాలేజీల నిర్మాణం 90% పైగా పూర్తయింది. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఏపీలో 2,185 ఎంబీబీఎస్ సీట్లు (ప్రభుత్వ కళాశాలల్లో) ఉంటే కొత్తగా నిర్మిస్తున్న 17 మెడికల్ కాలేజీల ద్వారా మరో 2,100 సీట్లు అందుబాటులోకి రానున్నాయి.
- ఇప్పటికే ఉన్న మెడికల్ కాలేజీల ఆధునికీకరణతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వ రంగంలో గతంలో ఏ సర్కారు కూడా ఇన్ని మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిన దాఖలాలు లేవు.





తుది దశకు చేరుకున్న మచిలీపట్నం, ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

రాష్ట్ర ప్రధాన ఆర్థిక సూచికలు (శాతం)

ఆర్థిక ఏడాది	అభివృద్ధి వ్యయం	అభివృద్ధియేతర వ్యయం
2020-21	63.0	29.7
2021-22	68.7	24.3
2022-23	72.0	21.6

మొత్తం వ్యయంలో సామాజిక రంగం వ్యయం

ఆర్థిక ఏడాది	శాతం
2020-21	46.4
2021-22	48.7
2022-23	53.2

అభివృద్ధి వ్యయం పెరుగుదల

ఆర్థిక ఏడాది	రూ.కోట్లలో
2020-21 (అకౌంట్స్)	1,17,831.9
2021-22 (సవరించిన)	1,42,975.4
2022-23 (అంచనా)	1,84,525.9

10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్

- గ్రామ, వార్డు స్థాయిలో క్లినిక్స్ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్, 528 వార్డు హెల్త్ క్లినిక్స్ నిర్మాణం కొనసాగుతోంది. కొత్తగా 150 పీ హెచ్‌సీలతో పాటు 992 పీహెచ్‌సీలు ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. గత చంద్రబాబు సర్కారు వైద్య విద్యా రంగాలల్లో ప్రైవేట్‌ను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటే ఇప్పుడు జగన్ సర్కారు ప్రభుత్వ రంగంలోనే విద్య, వైద్య సదుపాయాలను కల్పిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తోంది.

రూ.17 వేల కోట్లతో వ్యవ'సాయం'

- గ్రామాల్లోని అత్యధిక ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయ రంగమే. అలాంటి రైతులకు గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోంది. విత్తనం నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు రైతులకు అండగా ఉండేందుకు సీఎం జగన్ 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. రూ.2269.30 కోట్లతో ఆర్బీకేలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ఇప్పటికే 4095 పూర్తయ్యాయి. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి అన్ని మౌలిక వసతుల కల్పనకు ఏకంగా రూ.17 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులను చేపడుతున్నారు. మొత్తం 30 రకాల పనులు చేపడుతున్నారు.
- 4,200 ప్రాంతాల్లో గోదాములు, కోల్డ్ రూమ్‌లు, డ్రైయింగ్ ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపడుతున్నారు. డ్రై స్టోరేజీ- డ్రైయింగ్ ప్లాట్ ఫామ్స్, గోడౌన్లు, హార్టికల్చర్‌లో మౌలిక సదుపాయాలు, ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు, అసేయింగ్ ఎక్విప్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు, ఈ–మార్కెటింగ్, మెగా కస్టం హైరింగ్ హబ్స్, ఆర్బీకేల స్థాయిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, వరి పండిస్తున్న జిల్లాల్లో కంబైన్డ్ హార్వెస్టర్లు, ఏఎంసీలు–బీఎంసీలు, ఆక్వా ఇన్‌ఫ్రా, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్‌ల్యాండింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. పాడి రైతుల కోసం ఇప్పటికే తొలి దశలో రూ.399.01 కోట్లతో 2,535 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టారు. అమూల్‌తో ఒప్పందం ద్వారా పాడి రైతులు పోసే పాల ధరను ఎప్పటికప్పుడు పెంచుతున్నారు. తద్వారా ప్రైవేట్ డెయిరీలు కూడా పెంచాల్సిన పరిస్థితిని తీసుకువచ్చారు. వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున మౌలిక వసతులకు ఇంత వ్యయం చేయడం దేశ చరిత్రలోనే తొలిసారి.

అభివృద్ధి వ్యయం రయ్.. రయ్..

రాష్ట్రంలో అభివృద్ధి వ్యయం గత మూడేళ్లుగా ఏటేటా పెరుగుతోంది. అభివృద్ధియేతర వ్యయం ఏటేటా తగ్గుతోంది. సామాజిక, కమ్యూనిటీ సేవలు, ఆర్థిక సేవల వ్యయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నేరుగా సంబంధించిన కార్యకలాపాలపై చేసే వ్యయమే అభివృద్ధి వ్యయం. ఉదాహరణకు వ్యవసాయం, ఆరోగ్యం, విద్యపై చేసే ఖర్చు అభివృద్ధి వ్యయమే. రాష్ట్రంలో 3 ఆర్థిక సంవత్సరాల నుంచి సామాజిక రంగ వ్యయం పెరుగుతోంది. సామాజిక సేవలు, గ్రామీణాభివృద్ధి, ఆహార నిల్వల గిడ్డంగులు సామాజిక రంగ సేవల కిందకు వస్తాయి. రాష్ట్రంలో వైద్యం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, పారిశుధ్య రంగాల వ్యయం పెరుగుతోంది.

– 2020-21 ఆర్థిక ఏడాది నుంచి 2022-23 ఆర్థిక ఏడాది వరకు ఆర్థిక సూచికలపై ఆర్బీఐ అధ్యయన నివేదిక

మన బడి నాడు-నేడు కింద స్కూళ్లు, వ్యయం

స్కూల్స్ కేటగిరి	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
ప్రైమరీ స్కూళ్లు	37,218	7,526.14
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	5,556	1,291.96
హైస్కూళ్లు	7,766	4,962.12
జూనియర్ కాలేజీలు	473	472.80
హాస్టళ్లు	1,668	834.00
భవిత కేంద్రాలు	446	66.90
డైట్స్	17	19.22
శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు	8,517	1,277.55
మొత్తం	61,661	16,450.69

వైద్య రంగంలో నాడు-నేడు కింద పనులు, ప్రాజెక్టులు

కేటగిరి	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతులు	11	3,820
కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం	17	8,480
గిరిజన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి	1	246
కడప స్పెషాలిటీ ఆస్పత్రి	1	272
పలాస సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి	1	50
వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	10,032	1,692
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	1,142	665
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	528	374
ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు	168	1,223
మొత్తం		16,822

సచివాలయాలు సామాజిక ఆస్తి

- గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించేందుకు రూ.4,750 కోట్ల వ్యయంతో 10,893 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టారు. ఇందులో ఇప్పటికే 5,926 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇవన్నీ కూడా ఆయా గ్రామాల ప్రజల సామాజిక ఆస్తిగా నిలిచిపోనున్నాయి.
- రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఆయా గ్రామాల్లోని 1.34 లక్షల మంది యువతీ యువకులు శాశ్వత ఉద్యోగులుగా కనిపిస్తున్నారు. ప్రతి సచివాలయంలోనూ గ్రామ స్థాయిలోనే దాదాపు 600 పౌర సేవలు ఎటువంటి లంచాలు, వివక్షకు తావులేకుండా అందుతున్నాయి.

క్లుప్తంగా...

హజ్ యాత్ర విజయవంతం చేయండి

అధికారులకు ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా సూచన



సమావేశంలో అంజాద్ బాషా తదితరులు

సాక్షి, అమరావతి: హజ్–2023 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని పలు శాఖల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలోని సీసీఎల్ఏ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో ఉపముఖ్యమంత్రి బీఎస్ అంజాద్‌బాషా మంగళవారం సన్నాహకసమావేశం నిర్వహించారు. ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రం నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు అత్యంత మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హజ్ యాత్రికులు జిల్లాల నుంచి విజయవాడకు వచ్చిన దగ్గర్నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరే వరకు వారికి అవసరమైన సేవలు అందించాలని చెప్పారు. మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్, హజ్ కమిటీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్, మదనపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ నవాజ్ బాషా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్థికవ్యయ అధికారాల పరిమితి పెంపుపై కమిటీ

సాక్షి, అమరావతి: వివిధ శాఖలు, విభాగాధిపతులు, విభాగాలు, ప్రాంతీయ అధికారులు, జిల్లా అధికారులు, యూనిట్ అధికారులకు సంబంధించి ఆర్థికవ్యయ అధికారాల సీలింగ్ పరిమితులను పెంచేందుకు ఆరుగురు ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. కొన్ని సాధారణ వ్యయాలపై ఆయా అధికారుల స్థాయి ఆధారంగా సీలింగ్ పరిమితులుంటాయి. ఆ పరిమితులను పెంచుతూ సీలింగ్‌ను నిర్ధారిస్తూ సిఫార్సులు చేయడానికి రెవెన్యూ (ల్యాండ్ రెవెన్యూ) ప్రత్యేక సీఎస్ అధ్యక్షతన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోం, ప్రణాళిక, సాధారణ పరిపాలన (రాజకీయ) శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా, ఆర్థికశాఖ ప్రత్యేక సీఎస్ సభ్య కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సిఫార్సులతో కూడిన నివేదికను సాధారణ పరిపాలనశాఖకు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

డీవోపీగా సుదర్శన్‌రెడ్డి

సాక్షి అమరావతి: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీవోపీ)గా వైఎస్సార్ జిల్లాకు చెందిన న్యాయవాది జల్లా సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నిబంధనల ప్రకారం డీవోపీ నియామకానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతి తప్పనిసరి. దీంతో ప్రభుత్వం సీజే సమ్మతి కోసం ఫైల్‌ను హైకోర్టుకి పంపింది. డీవోపీగా సుదర్శన్‌రెడ్డి నియామకానికి సీజే సమ్మతి తెలపడంతో ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీచేసింది. కింది కోర్టుల్లో ప్రాసిక్యూషన్స్‌ను డీవోపీ పర్యవేక్షిస్తారు.

రెవెన్యూ లోటు భర్తీని సాధించిన సీఎం జగన్

- కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండీ తేలేకపోయిన గత చంద్రబాబు సర్కారు
- 2014-15 రెవెన్యూ లోటు భర్తీపై సీఎం జగన్ కేంద్రానికి పదే పదే విజ్ఞప్తి
- సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి, నీతి ఆయోగ్‌కు వినతులు
- సానుకూలంగా స్పందించి రూ.10,461 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

- రాష్ట్రానికి ఆర్థికంగా మేలు జరుగుతుంటే 'ఈనాడు'కు కడుపు మంట
- బాబు అడిగితే ఇవ్వకుండా ఇప్పుడు ఇవ్వడం తప్పనేలా రోత రాతలు
- జగన్ ఢిల్లీ పర్యటనలన్నీ రాష్ట్ర ప్రయోజనాలకేనని తేటతెల్లం
- ఎల్లో మీడియా, టీడీపీ ఆరోపణలకు ఇది చెంపపెట్టు



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలోని ముఖ్యమైన హామీ అయిన 2014–15 ఆర్థిక ఏడాది రెవెన్యూ లోటు భర్తీని గత చంద్రబాబు ప్రభుత్వం సాధించలేకపోయింది. అప్పటి కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రెవెన్యూ లోటును పూర్తి స్థాయిలో సాధించలేక చేతులెత్తేసింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి నుంచీ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయాల్సిందిగా కేంద్రాన్ని కోరుతూ వస్తున్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రితో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి, నీతి ఆయోగ్ అధికారులను కలిసినప్పుడల్లా రెవెన్యూ లోటు భర్తీ గురించి ప్రస్తావిస్తూ వచ్చారు. దాని ఫలితమే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రెవెన్యూ లోటు భర్తీ కింద ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయంగా రూ.10,461 కోట్లు మంజూరు చేసింది. దీన్ని ఈనాడు పచ్చ మీడియా జీర్ణించుకోలేక చంద్రబాబు ఎన్నిసార్లు గింజుకున్నా విదల్చని కేంద్రం ఇప్పుడు రెవెన్యూ లోటు భర్తీ కింద డబ్బులు మంజూరు చేయడం తప్పనేలా రోత రాతలు రాసింది. రాష్ట్రానికి ఆర్థికంగా ప్రయోజనం జరగడం కూడా పచ్చ మీడియా జీర్ణించుకోలేకపోవడం శోచనీయం. రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ.16,078 కోట్లుగా కాగ్ తేల్చింది. ఆ మేరకు భర్తీ చేయాల్సిందిగా గత చంద్రబాబు కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా రూ.4,000 కోట్లు మాత్రమే ఇచ్చింది. అయితే ముఖ్యమంత్రి జగన్ సర్కారు చట్ట ప్రకారం రావాల్సిన రెవెన్యూ లోటు భర్తీ గ్రాంటు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే ఉంది. అందుకు సహేతుక కారణాలను నీతి ఆయోగ్‌తోపాటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులకు వివరించడంతో పాటు స్వయంగా ప్రధాన మంత్రి దృష్టికి కూడా ముఖ్యమంత్రి పలుసార్లు తీసుకెళ్లారు. దాని ఫలితంగానే ప్రస్తుతం నిధులు విడుదలయ్యాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలపై ఆరోపణలు చేస్తున్న పచ్చ మీడియా, టీడీపీ నేతలకు ఇది చెంపపెట్టే. సీఎం ఢిల్లీ పర్యటనలన్నీ రాష్ట్ర ప్రయోజనాలకోసమేనని రెవెన్యూ లోటు భర్తీ సాధనతో స్పష్టమైంది.

సీఎం జగన్ విజయమిది..

విభజన నాటి నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పరిష్కరించుకుంటోంది. సంక్షేమాభివృద్ధిలో దూసుకుపోతున్న ఏపీ సర్కారుకు ప్రస్తుత రెవెన్యూ లోటు భర్తీ నిధుల విడుదల భారీ ఊరట కలిగించనుంది. తాజాగా విడుదల చేసిన రూ.10,460.87 కోట్ల నిధులను 2014–15 ఆర్థిక ఏడాది రెవెన్యూ లోటు కింద చూపిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహేంద్ర చండేలియా ఆదేశాలిచ్చారు. సీఎం గత నెల ఢిల్లీ పర్యటనలో భాగంగా జరిగిన చర్చలు కొలిక్కి వచ్చి నిధుల విడుదలకు ఈ నెల 19వ తేదీన ఆదేశాలు వెలవడగా తాజాగా నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభించాలని ఆర్థిక శాఖను కేంద్రం ఆదేశించింది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి కేంద్రం నుంచి ఏకమొత్తంలో విడుదలైన భారీ నిధులు ఇవే కావడం గమనార్హం. చంద్రబాబుతో కానిది సీఎం జగన్ వల్ల సాధ్యమైందని, ఇది ముఖ్యమంత్రి విజయమని అధికార వర్గాలు వ్యాఖ్యానించాయి.

సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

▶ మొదటి పేజీ తరువాయి

గ్రూప్–ఏ కేటగిరీలో 473 మంది, గ్రూప్–బి సర్వీసెస్‌లో 131 మంది ఎంపికైనట్టు యూపీఎస్సీ పేర్కొంది.

తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు అధిక ర్యాంకులు

సివిల్స్ ఫలితాల్లో టాప్ ర్యాంకుల్లో తొలి 4 ర్యాంకులు అమ్మాయిలే కైవసం చేసుకున్నారు. ఆలిండియా ఫస్ట్ ర్యాంకును ఇషితా కిషోర్ సాధించగా గరిమ లోహియా, నూకల ఉమాహారతి, స్మృతి మిశ్రాలు వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంకులు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి దాదాపు 50 మందికి ర్యాంకులు వచ్చినట్టు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు.. జీవీఎస్ పవన్ దత్తా 22, తరుణ్ పట్నాయక్ 33, అజ్మీరా సంకేత్‌కుమార్ 35, శ్రీసాయి ఆశ్రిత్ శాఖమూరి 40, హెచ్ఎస్ భావన 55, శ్రీప్రణవ్ 60, ఆవుల సాయికృష్ణకు 94వ ర్యాంకు దక్కాయి. వీరితోపాటు నిధిపాయ్ 110, అనుగు శివమారుతీరెడ్డి 132, వసంత్‌కుమార్ 157, కమతం మహేశ్‌కుమార్ 200, రావుల జయసింహారెడ్డి 217, సాహిత్య 243, అంకుర్ కుమార్ 257, బొల్లం మహేశ్వర్‌రెడ్డి 270, చల్లా కళ్యాణి 285, పాలువాయి విష్ణువర్ధన్‌రెడ్డి 292, సాయికృష్ణకు 293వ ర్యాంకు వచ్చాయి.

11.35 లక్షల మంది దరఖాస్తు

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు 11.35 లక్షల మంది దరఖాస్తు చేయగా వారిలో 5.73 లక్షల మంది (50.51 శాతం) మంది మాత్రమే గతేడాది జూన్ 5న జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యారు. వారిలో 130,90 మంది మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. వీరికి సెప్టెంబర్ 16 నుంచి 25 వరకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 2,529 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించగా చివరకు 933 మంది ఎంపికయ్యారు. కాగా సివిల్స్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి 80,707 మంది హాజరయ్యారు. వారిలో 500 మంది వరకు మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇంటర్వ్యూలకు 100 మంది వరకు ఎంపికవ్వగా వారిలో 50 మంది వరకు ర్యాంకులు సాధించగలిగారని ఆయా కోచింగ్ సంస్థల నిర్వాహకులు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ అభినందనలు

సివిల్స్ పరీక్షల్లో 200లోపు ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల ప్రతిభావంతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. 933 మందితో కూడిన తుది జాబితాలో చోటు దక్కించుకున్న తెలుగు అభ్యర్థులందరికీ సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు. వారు కెరీర్‌లో ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

33తో మెరిసిన తరుణ్



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోడల్ కాలనీకి చెందిన తరుణ్ పట్నాయక్ 33వ ర్యాంకుతో సత్తా చాటాడు. ఐఐటీ గౌహతిలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన తరుణ్ సివిల్స్‌కు సొంతంగా సిద్ధమయ్యాడు. తరుణ్ తండ్రి రవికుమార్ ఎల్ఐసీ రూరల్ బ్రాంచ్‌లో క్లరికల్ స్టాఫ్‌గా పనిచేస్తుండగా తల్లి శారదా రాజ్యలక్ష్మి గృహిణి. గతేడాది 99వ ర్యాంకు సాధించిన తరుణ్ ఈసారి 33వ ర్యాంకుతో మెరిశాడు. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని తరుణ్ తెలిపాడు.

అంబికాకు 69వ ర్యాంక్



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన అంబికా జైన్ సివిల్స్‌లో 69వ ర్యాంక్ సాధించారు. పట్టణానికి చెందిన జైన్ ఎలక్ట్రికల్ షాపు యజమాని లలిత్‌కుమార్, అనితల కుమార్తె అంబికా జైన్ అత్యుత్తమ ర్యాంకుతో మెరిసింది. అంబిక.. ఢిల్లీ సౌత్ ఏషియన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో ఎంఏ చేశారు. గతేడాది మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో 128వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అయినా ఐఏఎస్ కావాలనే పట్టుదలతో ఈ ఏడాది మళ్లీ ప్రయత్నించి 69వ ర్యాంక్‌తో లక్ష్యాన్ని చేరుకున్నారు.

దత్తా.. సత్తా



అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన డాక్టర్ పవన్ దత్తా సివిల్స్‌లో 22వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. దత్తా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు. ఎంబీబీఎస్ చదివిన పవన్ దత్తా హైదరాబాద్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా పవన్ దత్తా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉన్నత ఆరోగ్య సేవలు, పేద విద్యార్థులకు సాంకేతిక సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని తెలిపాడు.

వసంత్‌కు 157వ ర్యాంకు



ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన రాళ్లపల్లి వసంతకుమార్ 157వ ర్యాంకుతో మెరిశాడు. సివిల్స్ 2021 పరీక్షల్లో 170వ ర్యాంకు సాధించిన వసంతకుమార్ అప్పట్లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. ఐఏఎస్ సాధించాలన్న సంకల్పంతో మరోసారి ప్రయత్నం చేయగా 157వ ర్యాంకు సొంతం చేసుకున్నారు. వసంత్ అన్న జగన్‌సాయి ప్రస్తుతం ఐఏఎస్‌కు ఎంపికై శిక్షణలో ఉన్నారు. వసంతకుమార్ తండ్రి భీమేశ్వరరావు విద్యుత్ శాఖ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి అనసూయ గృహిణి.

ర్యాంకుల వారీగా తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు

3	ఎన్. ఉమా హారతి
22	జీవీఎస్ పవన్ దత్తా
33	తరుణ్ పట్నాయక్ మాదల
35	అజ్మీరా సంకేత్
40	సాయి ఆశ్రిత్ శాఖమూరి
54	రిచా కులకర్ణి
55	హెచ్ఎస్ భావన
60	శ్రీప్రణవ్
69	అంబికా జైన్
78	ఉత్కర్ష్ కుమార్
87	అయాన్ జైన్
94	ఆవుల సాయికృష్ణ
110	నిధి పాయ్
132	అనుగు శివమారుతిరెడ్డి
157	రాళ్లపల్లి వసంత కుమార్
189	షేక్ హబీబుల్లా
200	కమతం మహేశ్ కుమార్
217	రావుల జయసింహారెడ్డి
243	కాసిరాజు పవన సాయి సాహిత్య
257	అంకుర్ కుమార్
270	బొల్లం ఉమామహేశ్వరరెడ్డి
285	చల్లా కల్యాణి
292	పాలువాయి విష్ణువర్థన్‌రెడ్డి
293	గ్రంధి సాయికృష్ణ
297	షివిన్ చౌదరి
311	వీరగంధం లక్ష్మీ సుజిత
313	కె.ఎన్.చందనజాహ్నవి
346	ఎన్.చేతనారెడ్డి
384	ఇప్పలపల్లి సుస్మిత
409	ఇషాన్ అగర్వాల్
410	దొంగ్రె రేవయ్య
414	చంద్రేశ్‌కుమార్ శంకల
426	సీహెచ్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి
459	చాణక్య ఉదయగిరి
464	సి.సమీరారాజా
469	బొడ్డు హేమంత్
480	గోపీకృష్ణ. బి
510	భువన ప్రణీత్ పప్పుల
548	దామెర హిమవంశీ
558	రుత్విక్ సాయి కొట్టే
559	డి.మనోజ్
583	యర్రంశెట్టి ఉషారమణి
630	ఎస్.దీప్తి చౌహాన్
640	తుమ్మల సాయికృష్ణారెడ్డి
742	రామ్‌దేని సాయినాథ్
759	జి.అక్షయ్ దీపక్
805	మన్నం సుజిత్ సంపత్
817	సోహిల్ మీనా
846	బెండుకూరి మౌర్యతేజ్
866	నాగుల కృపాకర్

వైఎస్సార్‌ఏఎఫ్‌యూకి ఏపీఎండీసీ బస్సు విరాళం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (వైఎస్సార్‌ఏఎఫ్‌యూ)కి ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) ఫౌండేషన్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా బస్సును విరాళంగా అందించింది. ఏపీఎండీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి మంగళవారం విద్యార్థుల కోసం సిద్ధం చేసిన బస్సును యూనివర్సిటీ అధికారులకు అందచేశారు. జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థుల కోసం కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు సీఎస్ఆర్ నిధుల నుంచి ఈ బస్సు ఇచ్చినట్టు చెప్పారు. ఏపీఎండీసీ వైస్ ప్రెసిడెంట్లు బిపిన్‌కుమార్, రామ్‌నారాయణన్, జీఎంలు టి.నతానియేల్, ఆళ్ళ నాగేశ్వరరెడ్డి, గనులశాఖ జేడీ శ్రీనివాస్, మంగంపేట సీపీవో సుదర్శన్‌రెడ్డి, హెచ్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ కళావతి పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కింద కోరుకున్న పోస్టు రాదు

- డిగ్రీ లేని వ్యక్తి జూనియర్ అసిస్టెంట్ పోస్టు కోరడానికి వీల్లేదు
- వీఆర్వో పోస్టుకు అర్హత లేనప్పుడు దాన్నీ కోరలేరు
- జస్టిస్ రాయ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీర్పు
- ట్రిబ్యునల్ తీర్పునకు సమర్థన

సాక్షి, అమరావతి: నిర్దేశిత విద్యార్హతలు లేని వ్యక్తి కారుణ్య నియామకం కింద తనకు ఫలానా పోస్టే కావాలని కోరలేరని హైకోర్టు స్పష్టం చేసింది. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కనీస విద్యార్హత అయిన డిగ్రీ పూర్తి చేయని వ్యక్తి ఆ పోస్టును కోరడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అలాగే విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో)గా పనిచేస్తూ మరణించిన ఉద్యోగి భార్య లేదా పిల్లలకు మాత్రమే ఆ పోస్టు ఇస్తారని, సీనియర్ అసిస్టెంట్ పిల్లలు వీఆర్వో పోస్టుకు అర్హులు కారని తెలిపింది. కారుణ్య నియామకం కింద కలెక్టర్ ఇచ్చిన ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో చేరకుండా, వీఆర్వో లేదా జూనియర్ అసిస్టెంట్ పోస్టు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిపాలన ట్రిబ్యునల్ కొట్టేయడాన్ని హైకోర్టు సమర్థించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమంది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ వెణుతురుమిల్లి వేణుగోపాలరావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. జి.మధుసూదన్‌రావు చిత్తూరు జిల్లా తంబాళపల్లె తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మరణించారు. ఆయన కుమారుడు రాఘవేంద్రరావు ఇంటర్ మాత్రమే పాస్ అవడంతో కలెక్టర్ అతనికి కారుణ్య నియామకం కింద జిల్లా పంచాయతీ ఆఫీస్‌లో ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఇస్తూ 2014లో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. రాఘవేంద్రరావు ఆ పోస్టులో చేరలేదు. దీంతో ఆ ఉద్యోగాన్ని కోల్పోయాడు. నెల తరువాత తనకు వీఆర్వో లేదా జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. డిగ్రీ లేని కారణంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వలేమని, వీఆర్వోగా పనిచేస్తూ మరణించిన ఉద్యోగి భార్య, పిల్లలు మాత్రమే ఆ పోస్టుకు అర్హులంటూ కలెక్టర్ 2015లో ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీంతో రాఘవేంద్రరావు పరిపాలన ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ట్రిబ్యునల్ 2018లో కొట్టేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ 2019లో అతను హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది.

పేదలకు పెద్ద చదువులే లక్ష్యంగా..

▶ మొదటి పేజీ తరువాయి

కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇచ్చేలా, వారి తల్లుల ఖాతాల్లో జగనన్న ప్రభుత్వం నేరుగా జమచేస్తోంది.

'జగనన్న వసతి దీవెన'..

అలాగే, ఉన్నత చదువులు చదివే ఈ పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బందిపడకుండా ఉండేందుకు వీలుగా ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు అయితే రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. కుటుంబంలో ఎంతమంది చదువుతుంటే అంతమందికీ.. వారి తల్లుల ఖాతాల్లో సంవత్సరానికి రెండు దఫాల్లో ప్రభుత్వం నేరుగా జమచేస్తోంది. అలాగే..

- ఇప్పటివరకు 26,98,728 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యాదీవెన కింద రూ.10,636.67 కోట్లను ప్రభుత్వం జమచేసింది.
- గత ప్రభుత్వం అరకొరగా ఇచ్చే ఫీజుల్లో సైతం బకాయిలు పెట్టింది. ఇలా 2017 నుంచి పెట్టిన బాకీలు రూ.1,778 కోట్లతో కలిపి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన కింద ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.14,912.43 కోట్లు.
- ఇలా జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 47 నెలల కాలంలో విద్యారంగం మీద చేసిన ఖర్చు మొత్తం అక్షరాల రూ.59,331.22 కోట్లు.

నేడు సీఎం కొవ్వూరు పర్యటన

సాక్షి, అమరావతి/కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం (నేడు) తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో పర్యటించనున్నారు. అక్కడ జరిగే కార్యక్రమంలో ఆయన జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తారు. ఉ.8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి కొవ్వూరు చేరుకుంటారు. అక్కడ సత్యవతినగర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం జగన్ నగదు జమచేస్తారు. అనంతరం కొవ్వూరు నుంచి బయల్దేరి మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఉత్పత్తిలో 'కోత' లేదు


సాక్షి, అమరావతి: థర్మల్ విద్యుదుత్పత్తిని సామర్థ్యంలో 50 శాతానికి తగ్గించాలని ఇండియన్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్ కోడ్ (ఐఈజీసీ) నిబంధనలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల అవసరాల మేరకు థర్మల్ పవర్ స్టేషన్లు సగటున 73 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 240 నుంచి 255 మిలియన్ యూనిట్లు ఉంది. ఇందులో ఏపీ జెన్‌కో రోజుకు సమారు 100 నుంచి 105 మిలియన్ యూనిట్లను గ్రిడ్‌కు సరఫరా చేస్తోంది. అంటే రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో దాదాపు 40 నుంచి 45 శాతం వరకు ఏపీ జెన్‌కో నుంచే సమకూరుతోంది. అలాగని సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించడానికి లేదు. దీంతో పర్యావరణ హితం కోరి పవన, సౌరవిద్యుత్ వినియోగానికి 'మస్ట్ రన్ స్టేటస్' కింద అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది.

ఇష్టానుసారం ఆపలేం

సాధారణంగా లోడ్ డిస్పాచ్ సెంటర్ ఫ్రీక్వెన్సీని బట్టి గ్రిడ్‌కు విద్యుత్‌ను సరఫరా, స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. గ్రిడ్‌కు మనం ఎంత విద్యుత్ సరఫరా చేస్తామో అంత తీసుకోవచ్చు. ఎక్కువ తీసుకుంటే ఆ మేరకు చెల్లించాలి. అపరాధరుసుం భరించాలి. తక్కువ ఇచ్చి ఎక్కువ తీసుకుంటే దక్షణాది రాష్ట్రాల రీజనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ హెచ్చరిస్తుంది. తరచూ ఇలా చేస్తే గ్రిడ్ కనెక్షన్ తప్పిస్తుంది. మన అవసరాలకు మించి గ్రిడ్‌కు సరఫరా చేస్తే డిమాండు లేనప్పుడు అదనపు విద్యుత్‌కు పైసా రాదు. దీంతో విద్యుత్ డిమాండు ఎప్పుడు ఎలా ఉంటుందో స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) ద్వారా అధికారులు నిత్యం పరిశీలిస్తుంటారు. డిమాండుకు తగ్గట్టు సరఫరా పెంచాలో, తగ్గించాలో వారు సూచిస్తారు. అయితే డిమాండు లేని సమయాల్లో థర్మల్ ప్లాంట్లను షట్‌డౌన్ చేసి డిమాండు పెరగ్గానే లైటప్ చేయడం వీలుకాదు. అందువల్ల ప్లాంట్లను ఆన్‌లోనే ఉంచాలి. అందుకే 55 శాతం సామర్థ్యంతో పనిచేసేలా ప్లాంట్లను సిద్ధంగా ఉంచడానికి ఏయే చర్యలు తీసుకోవాలో సూచనలు, సలహాలు, సాంకేతిక సహకారం ఇచ్చే సంస్థలను ఆహ్వానిస్తూ ఏపీ జెన్‌కో ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) దరఖాస్తులు ఆహ్వానించింది.

దృష్టి మళ్లించేందుకే దుష్ప్రచారం

- ఎల్లో మీడియా రోత రాతలను ఖండించాలి: సజ్జల రామకృష్ణారెడ్డి
- తల్లి ఆరోగ్యం విషమంగా ఉన్నందువల్లే ఎంపీ అవినాష్ సీబీఐని సమయం కోరారు
- కర్నూలు ఎస్పీ సహకరించడం లేదని ఎల్లో మీడియాకు సీబీఐ అధికారులు చెప్పారా?
- వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయని ప్రజలు గ్రహించారు
- సీఎం జగన్ కృషి చేసి రూ.10,461 కోట్ల రెవెన్యూ లోటు భర్తీ నిధులను సాధించారు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అభివృద్ధికి తలమానికంగా నిలిచే మచిలీపట్నం పోర్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన నేపథ్యంలో జనరంజక పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎంపీ అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేస్తోందంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారాలకు తెగబడుతోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి ఇప్పటికే ఆరేడు సార్లు సీబీఐ విచారణకు హాజరయ్యారని, విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారని గుర్తు చేశారు. ఆయన మాతృమూర్తి ఆరోగ్యం విషమంగా ఉండటం, తండ్రి జైల్లో ఉన్నందున తల్లిని చూసుకునేందుకు సమయం కావాలని కోరుతూ సీబీఐకి లేఖ రాశారన్నారు. అవినాష్‌ను అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు కర్నూలుకు చేరుకున్నారని, ఎస్పీతో చర్చించారని, సీబీఐకి సహకరించడం లేదంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 దుష్ప్రచారం చేశాయని మండిపడ్డారు. కర్నూలు ఎస్పీ సహకరించలేదని సీబీఐ అధికారులు ఎవరైనా చెప్పారా? అని నిలదీశారు. ఒకవైపు కర్నూలుకు కేంద్ర బలగాలు దిగుతున్నాయంటూ ప్రచారం చేస్తూ మరోవైపు ప్రభుత్వం నిరోధించిందంటూ బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఈటీవీ, ఏబీఎన్, టీవీ 5 ఛానళ్లు ఇదే అంశంపై ఇష్టారీతిన చర్చలు నిర్వహించి అవినాష్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. 'ఆ చర్చల్లో ఒకాయన రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి అంటాడు. వాళ్లని చూస్తుంటే ప్రపంచ యుద్ధాన్ని కూడా సృష్టించగల శక్తి ఉన్నట్లుగా ఉంది' అని వ్యాఖ్యానించారు. 'తల్లి ఆరోగ్యం బాగోలేదని, నాటకాలు ఆడుతున్నారంటూ తప్పుడు రాతలు రాస్తే ఎవరికైనా కడుపు మండదా? వైఎస్సార్‌సీపీని, అవినాష్‌రెడ్డిని అభిమానించే వారికి బాధ కలగదా?' అని నిలదీశారు. ఆ ఆక్రోశంతోనే ఒకరో ఇద్దరో ఎల్లో మీడియాపై దాడి చేశారని, నిజమైన మీడియాపై ఎవరిమీదైనా దాడి జరిగిందా? అని ప్రశ్నించారు. ఎల్లో మీడియాపై దాడి జరిగినా తాము ఖండిస్తామని, అదేవిధంగా ఎల్లో మీడియా రోత రాతలను కూడా ఖండించాలని సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సజ్జల మీడియాతో మాట్లాడారు.

రామోజీ, అవినాష్‌కు చెరో న్యాయమా?

ఎంపీ అవినాష్‌రెడ్డి తనకున్న హక్కు ప్రకారం సీబీఐ విచారణకు మరికొద్ది సమయం కోరారు. ఆయనకు ఉన్న హక్కుల ప్రకారం కోర్టులకు వెళ్లవచ్చు. రామోజీరావు మార్గదర్శి కేసు విచారణను ఆపేందుకు తట్టని కోర్టు తలుపులు లేవు. ఆయన చేస్తే న్యాయం? అవినాష్‌రెడ్డి కోర్టుకు వెళితే అన్యాయమా? చంద్రబాబు అధికారంలో ఉండగా సీబీఐ రాష్ట్రంలో అడుగు పెట్టకుండా జీవో ఇచ్చారు. ఈనాడులో అప్పుడు కుక్క తోక కత్తిరించినట్లు పెద్ద కార్టూన్ కూడా వేశారు. మళ్లీ ఇప్పుడు వారికి అదే సీబీఐపై ప్రేమ పుట్టుకొచ్చింది.

రాష్ట్రాన్ని దిక్సూచిలా నిలిపారు

వైఎస్సార్‌సీపీని స్థాపించిన 8 ఏళ్లలోనే సరిగ్గా నాలుగేళ్ల క్రితం 151 స్థానాల్లో ఘన విజయం సాధించాం. ముందుగా తయారు చేసుకున్న బ్లూ ప్రింట్ ప్రకారం సీఎం జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ వస్తున్నారు. నాలుగేళ్లలో 98.5 శాతానికిపైగా హామీలను నెరవేర్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో మమేకం అయిన పార్టీ పనితీరు ఎలా ఉంటుంది? అలాంటి పార్టీపై ఆశలు పెట్టుకుంటే ఎంత సక్రమంగా అమలు చేసి చూపుతారనేది ఈ నాలుగేళ్లలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఏపీని దేశానికి దిక్సూచిలా నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. ఇప్పటికే రూ.2.10 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా ప్రజలకు అందించాం. వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయని ప్రజలు గ్రహించారు. 2019 ఎన్నికల కంటే అద్భుత విజయాన్ని 2024లో సాధిస్తాం.

సీఎం జగన్ కేంద్రంతో చర్చించి రాబట్టారు

కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తోంది. రెవెన్యూ లోటు కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను హక్కుగా రాబట్టుకుంది. రాష్ట్రానికి నిధులు రావడాన్ని ఎల్లో మీడియా ఓర్చుకోలేక పోతోంది. రామోజీరావు కడుపు మంటతో ఈనాడులో విషప్రచారం చేస్తున్నారు. ఎల్లో మీడియా కడుపు మంటకు మందు లేదని మరోసారి స్పష్టమైంది. టీడీపీ హయాంలో నిధులు తేలేకపోవడం చంద్రబాబు అసమర్థతకు నిదర్శనం. కేంద్రంలో భాగస్వామిగా కొనసాగి కూడా నిధులు సాధించకుండా చంద్రబాబు సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారు. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన నిధులను కేంద్రంతో చర్చించి రాబట్టుకుంటున్నారు. ఆ క్రమంలోనే 2014-15 రెవెన్యూ లోటు కింద రూ.10,461 కోట్లను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్రానికి మంచి జరిగితే ఓర్చుకోలేని ఎల్లో మీడియా నాన్ రెసిడెంట్ ఆంధ్రా మాదిరిగా వ్యవహరిస్తూ విషం చిమ్ముతున్నాయి.



ఈ ప్రపంచాన్ని మృత్యువు, క్షయము పీడిస్తున్నాయి.
కానీ ప్రపంచ తత్వం ఎరిగిన వివేకి వీటికి దుఃఖించడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 24 మే 2023

అయిదేళ్ళలో ఉష్ణగుండమేనా?

అంచనాలు నిజమవుతాయా, లేదా అంటే... ఎవరి విశ్లేషణ వారికి ఉండవచ్చు. కానీ, అంచనాలు అప్రమత్తం కావడానికి పనికొస్తాయనడంలో మాత్రం ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండే అవకాశమే లేదు. ఐరాస ప్రపంచ వాతావరణసంస్థ తాజా అంచనాలు అప్రమత్తం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితిని తలపిస్తున్నాయి. ఉష్ణతాపాన్ని ఒడిసిపట్టుకొనే గ్రీన్‌హౌస్ వాయువులు, ఎల్‌నినో ఫలితంగా అయిదేళ్ళలో ప్రపంచ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకొనే అవకాశం ఎక్కువుందన్న తాజా అంచనా అలాంటి ప్రమాద ఘంటికే. మన భూగోళ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరిగే అవకాశం మూడింట రెండొంతులుందని ఆ అంచనా సారాంశం. ఈ బీభత్స ప్రభావం భవిష్యత్తులో ఆర్థికంగానూ అపారంగా ఉంటుందని సోమవారం ఆ సంస్థ చేసిన హెచ్చరిక తీవ్రమైనదే.

కొన్నేళ్ళ క్రితం ఊహించినదాని కన్నా పరిస్థితి దిగజారింది. గత శతాబ్దిన్నరలో పర్యావరణానికి మనం చేసిన నష్టం అలాంటిది. పారిశ్రామికీకరణ కాలాని కన్నా ముందు (1850–1900 మధ్య) సగటు ఉష్ణోగ్రతతో పోలిస్తే, 1.5 డిగ్రీల గరిష్ఠ భూతాపోన్నతిని చరమావధిగా పెట్టుకున్నారు. ఆ లక్ష్మణరేఖ దాటితే ఉత్పాతం తప్పదని శాస్త్రవేత్తలు చాలా కాలంగా హెచ్చరిస్తున్నారు. 1.5 డిగ్రీలనే గరిష్ఠంగా ఎందుకు పెట్టుకున్నారంటే, అది దాటితే ఈ అదనపు ఉష్ణం కారణంగా జీవావరణ దుష్ప్రభావం శరవేగంగా వ్యాపిస్తుంది. తారాజువ్వలా దూసుకుపోతుంది. అందుకే, భూతాపోన్నతిని ఆ గీత దాటకుండా నియంత్రించాలని 2015 నాటి ప్యారిస్ ఒప్పందంలోనే తీర్మానించారు. ఈ గీతను చేరే అవకాశం తక్కువని 2015లో అనుకున్నారు. తీరా 2020కి వచ్చేసరికి అయిదింట ఒక వంతు ఛాన్సుందని తేలింది. నిరుడు ఆ ముప్పు 50 శాతం ఉండేది. ఇప్పుడు పరిమితిని దాటేసే ప్రమాదం 66 శాతానికి పెరిగిపోయింది. అంటే వచ్చే 2027 రెడ్ ఎలర్ట్ నామవత్సరం. ప్రపంచం ఉష్ణగుండమే.

ఇప్పటి వరకు ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత 2016లో రికార్డయింది. ప్రాతిపదికగా తీసుకున్న 1900 నాటి ముందు కాలంతో పోలిస్తే, ఆ ఏటి సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.3 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. ఆ ఉష్ణరికార్డును దాటేరోజు ఎంతో దూరంలో లేదన్నదే ఇప్పుడున్న ఆందోళన. పర్యావరణ మార్పుతో పాటు చక్రభ్రమణమైన ఎల్‌నినో ప్రభావమూ అగ్నికి ఆజ్యం పోస్తోంది. ఈ ఏడాది ఆసియా ప్రాంతాన్ని సాధారణంగా అధికంగా ఈ సెగ వేగిస్తుందని అంచనా. నిజానికి 1970 నుంచి 2021 మధ్య దుర్భర వాతావరణ మార్పులతో దాదాపు 12 వేల ఉత్పాతాలు జరిగాయని లెక్క. వాటి వల్ల 20 లక్షల మందికి పైగా మరణిస్తే, 4.3 లక్షల కోట్ల డాలర్ల మేర ఆర్థిక నష్టాలు జరిగాయి. మరోలా చెప్పాలంటే, ఆ మొత్తం నష్టాలు భారతదేశ జీడీపీలో 25 శాతానికి పైమాటే!

మన దేశం సంగతికొస్తే.. వార్షిక సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. 1901 నుంచి ప్రతి రెండు దశాబ్దాల కాలాన్ని పోల్చి చూస్తే, గత 20 ఏళ్ళ కాలంలో ఎన్నడూ లేనంతగా హెచ్చాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ తాజా పరిశోధనా పత్రమే ఆ సంగతి వెల్లడించింది. 1975 నుంచి తుపానులు, వరదలు అధికమయ్యేసరికి వ్యవసాయ ఉత్పత్తి, దరిమిలా ఆహార ధరలు విపరీతంగా ప్రభావితమయ్యాయి. వాతావరణ ఉత్పాతాలకు ప్రభావితమయ్యే దేశాల జాబితా వేస్తే... 'ప్రపంచ పర్యావరణ మార్పు ప్రమాద సూచి 2021'లో భారత్ 7వ స్థానంలో ఉంది. స్వాతంత్ర్య కాలంతో పోలిస్తే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ, అనుబంధ రంగాల కన్నా సేవారంగం పాలు గణనీయంగా పెరిగినా, ఉష్ణతాపంతో అన్ని రంగాలకూ తిప్పలు తప్పవు. వచ్చే 2030 నాటికి ఎండ వేడిమికి ప్రపంచ వ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాల్ని నష్టపోవాల్సి వస్తుందట. అందులో 3.4 కోట్లు భారత్‌లోనే సంభవిస్తాయని 2020లోనే ప్రపంచ బ్యాంక్ మాట.

అలాగే, పెరిగే సముద్రమట్టంతో ప్రపంచంలో అత్యధికంగా చిక్కుల్లో పడేదీ మన దేశమే! 'పర్యావరణ మార్పుపై ఏర్పాటైన అంతర్ ప్రభుత్వ సంఘం' (ఐపీసీసీ) నిరుడు ఆ సంగతి కుండబద్దలు కొట్టింది. ఈ శతాబ్ది మధ్యకల్లా 3.5 కోట్ల భారతీయులు ఏటా సముద్రతీర ముంపు బారిన పడతారు. ఈ శతాబ్దాంతానికి ఆ సంఖ్య 4.5 నుంచి 5 కోట్లవుతుందని అంచనా. అందుకే, పర్యావరణంపై అంతంత మాత్రపు విధానాలనే అనుసరిస్తే కష్టమే. 2070 నాటికి 'నెట్ జీరో' లక్ష్య సాధన పెట్టుకున్నప్పటికీ 2050 కల్లా భారత జీడీపీ 8.5 నుంచి 10 శాతం దాకా తగ్గే ముప్పుంది. విధానపరమైన లోచూపును అందించే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ ఎకనామెట్రిక్ మోడల్ వేసిన లెక్క ఇది.

ఈ లెక్కలు, చెబుతున్న మాటలు అంచనాలే కదా అని అలక్ష్యం చేస్తే కష్టమే. పర్యావరణ విశ్లేషణకు దీర్ఘకాలాల్ని ఎంచుకోవాలి గనక, ప్యారిస్‌లో చేసుకున్న బాసల్ని నిలిపామా, చెరిపామా అన్నది 2040కి కానీ నిర్ధరించలేం. అప్పటికి తెలిసినా పుణ్యకాలం గడిచిపోతుంది. అందుకే దేశాలన్నీ చేతులు కలిపి, ప్రమాద నివారణకు ప్రయత్నించడమే ఏకైక మార్గం. తక్షణమే హరిత ఇంధనం వైపు మరలాలి. భావి బాధితులకు సురక్షిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలి. అలా చేయాలంటే ధనిక దేశాలు తమ కర్బన ఉద్గారాల పాపాల శాపాలను అనుభవిస్తున్న అమాయక వర్ధమాన దేశాలకు నష్టపరిహారం చేయాలి. మునుపు మాట ఇచ్చిన వందల కోట్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని అందించాలి. పాశ్చాత్య ప్రపంచం పర్యావరణ మార్పులకు అడ్డుకట్ట వేస్తే సరిపోదు. సత్వరమే ఆ మార్పుల నుంచి వెనక్కుమళ్ళి యథాపూర్వ స్థితికి వాతావరణం వచ్చేలా కృషిచేయాలి. ఉష్ణోగ్రతనూ, తద్వారా పర్యావరణ ఉత్పాతాన్నీ, ఆర్థికనష్టాలనూ తగ్గించడమే ఇక కర్తవ్యం.

ఆర్థిక వ్యవస్థకు జీవం పోసేనా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

బ్రిటిష్ వలస పాలకులు కూడా పేద వర్గాల ఉద్ధరణ కోసం చేయవలసిందంతా చేస్తున్నామని కోతలు కోసేవారు. అవే మాటల్ని దేశ స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన దేశీయ ప్రభుత్వం కూడా చెప్పింది. అవే ఇప్పటికీ కేంద్ర పాలకులు చెబుతారు. ప్రపంచ బ్యాంకు విధాన ఒరవడిలో పెట్టుబడి విధానాల్ని ఆశ్రయించే దేశాల పాలకులందరిదీ ఇదే తంతు. కానీ ఈ రాజకీయవేత్తలకు తమ 'అమాయక మనస్తత్వం' నుంచి బయటపడటం ఇష్టం ఉండదు. అది రోగ నివారణకు అందనంత పెద్ద జబ్బు. ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థకు 'జీవం పోసే' పేరిట 2000 నోట్ల కట్టల ఉపసంహరణ తతంగానికి తెరలేపారు. రూ. 2 కూడా చేతిలో ఆడని అసంఖ్యాక కష్టజీవులకు దీనివల్ల కలిగే ప్రత్యేక లాభం ఏముంటుంది?

"ఈ దేశ ప్రజలందరినీ సుఖశాంతులతో ఉంచగల సర్వ సంపదలూ దేశంలోనే ఉన్నాయి. కానీ అవి అందరికీ సమస్థాయిలో అందుబాటులోకి రాకపోవడానికి కారణం – ఈ సంపదంతా తమ హక్కు భుక్తం కావాలన్న కొలదిమంది సంపన్న స్వార్థపరుల అవధులు లేని గొంతెమ్మ కోరికలేనని మరచిపోరాదు.... దేశ స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన దేశీయ ప్రభుత్వం కూడా తాను పేద వర్గాల ఉద్ధరణ కోసం చేయవలసిందంతా చేస్తున్నానని బీరాలు పలకవచ్చు. కానీ, బ్రిటిష్ వలస పాలకులు కూడా అలాంటి కోతలే కోసేవారు. కానీ అసలు రహస్యం – పేద ప్రజల ప్రయోజనాలు మాత్రం నెరవేరక పోవడం. ఈ సత్యాన్ని స్వతంత్ర భారత పాలకులు వినమ్రతతో అంగీకరించి తీరాలి."
– జాతిపిత గాంధీజీ (1947 డిసెంబర్ 11); 'ది హిందూ' ప్రచురించిన 'మహాత్మాగాంధీ: ది లాస్ట్ 200 డేస్' నుంచి.

"సంపన్నుల చేతిలో అంత అధికారం ఎలా గూడు కట్టుకుంది? పాలకులు ప్రయివేట్ కార్పొరేషన్ల పైన, సంపన్నుల ఆస్తుల పైన శ్రుతి మించిన ఆదాయంపై విధించే పన్నుల్ని తగ్గించి వేయడంవల్ల! మరోవైపున శ్రమజీవులైన కార్మిక సంఘాలను అణచి వేయడం ద్వారా వారి కనీస వేతనాన్ని ద్రవ్యోల్బణం ద్వారా కోత పెట్టేయడం రివాజుగా మారింది."
– ప్రసిద్ధ ఆర్థికవేత్త పాల్ క్రూగ్‌మన్

2016లో అకస్మాత్తుగా బీజేపీ పాలకులు పెద్ద నోట్ల చలామణీని అదుపు చేసి దేశాన్ని ద్రవ్యోల్బణం నుంచి కాపాడుతామని బీరాలు పలికి తాము చతికిలపడటమే గాక కోట్లాదిమంది సామాన్య ప్రజలను కష్టాల్లోకి నెట్టేశారు. ఆ రోజు నుంచి ఈ రోజు దాకా ప్రజలు తేరుకోలేదు. ఈలోగానే 'పెద్ద నోట్ల భారం' పేరిట వాటిని చలామణీ నుంచి ఉపసంహరించే పేరిట గతంలో 500, 1000 నోట్లకు ఎసరు పెట్టినట్టే ఇప్పుడు రూ. 2000 నోట్లపై యుద్ధం ప్రకటించారు. 2016లో 'పాకిస్తాన్‌పై యుద్ధం కోసం' పెద్ద నోట్ల చలామణీని అదుపు చేస్తే, ఈ రోజు దాకా తేరుకోకుండా కునారిల్లుతూ వస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థకు 'జీవం పోసే' పేరిట 2000 నోట్ల కట్టల ఉపసంహరణ తతంగానికి తెరలేపారు. సామాన్య ప్రజాబాహుళ్యం మౌలిక ప్రయోజనాలకు రూ. 2000 నోటు ఉపసంహరణ వల్ల ప్రత్యక్షంగా నష్టం కలగక పోవచ్చు. అయితే పరోక్షంగా ఎన్నికల పేరిట రాజకీయ పార్టీలు పోటాపోటీలతో అనుసరించే ఎత్తుగడల నుంచి మాత్రం రెండువేల రూపాయల నోటు తొలగిపోదు. లోపాయకారీగా ప్రత్యక్షమవుతూనే ఉంటుంది. కేవలం పాలకపక్ష నాటకంగా పైకి కనిపించినా, పరోక్షంగా ప్రతిపక్షాల ప్రయోజనాలు నెరవేర్చడంలో కూడా 'రెండు వేల నోటు' ఉపయోగపడుతుందని మరచిపోరాదు.

గతంలో రూ. 1000, రూ. 500 నోట్ల రద్దు వల్ల 'నల్ల ధనం, నకిలీ నోట్లు' చలామణీ నుంచి తప్పుకున్న దాఖలాలు లేవు. అలాగే విదేశీ బ్యాంకుల్లో ఏళ్ల తరబడిగా తలదాచుకుంటున్న భారత పెట్టుబడిదారుల దొంగ డబ్బును దేశానికి తీసుకొచ్చి, భారత ప్రజలకు లక్షలు, కోట్లు పంచిపెడతానన్న ప్రధాన మంత్రి మాట 'నీటి మూట'గా ఎలా మారిందో ప్రజలు చూశారు. ఈ సందర్భంగా నాటి రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా ఉన్న రఘురామ్ రాజన్ పాలకుల నిర్ణయాల్ని నిరసించి, 'దేశాన్ని ఆర్థిక సంక్షోభం'లోకి పాలకులు నెట్టబోతున్నారని ప్రజల్ని హెచ్చరించి మరీ గవర్నర్ పదవికి రాజీనామా చేసి అమెరికాలో కొలువుకి 'చెక్కేయ'వలసి వచ్చింది. రాజన్ హెచ్చరికలు దేశానికి ముందస్తు మెలకువలయ్యాయి. అయినా పాలకులలో చలనం లేదు. సుప్రీం కోర్టు కూడా 'ఆరేళ్ల తర్వాత ఇప్పుడు కాలాన్ని వెనక్కి తిప్పలేమన్న' తీవ్ర నిరాశను బాహాటంగానే వ్యక్తం చేసింది.



రెండో మాట

ఆసియా, ఆఫ్రికా వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు స్వతంత్రంగా, ఎలాంటి 'ఉచ్చులు' లేకుండా బతకవచ్చునో జూలియస్ నైరేరి అధ్యక్షతన ఏర్పడిన 'సౌత్ కమిషన్' నిరూపించింది (1990 రిపోర్టు). కాంగ్రెస్ హయాంలో ప్రధాని హోదాలో నరసింహారావు, మన్మోహన్ సింగ్ ఆ రిపోర్టును ఆహ్వానించి కూడా ఆచరణలో అమలు చేయలేకపోయారు. ఇదిలా ఉండగా – ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు అన్నార్తులైన ప్రజాబాహుళ్యంపై ఎక్కుపెట్టిన దారి దోపిడీ పద్ధతుల వల్ల ఆయా ఖండాల ప్రజలు ఎలా ఆర్థికంగా కునారిల్లిపోయారో ఆ సంస్థల ఆదేశంపై వాటి తరఫున ఆ దేశాలలో పని చేసిన వైస్ ప్రెసిడెంట్ డేవిసన్ బుధూ తన అనుభవాలను అమితమైన దుఃఖంతో అక్షరబద్ధం చేశారు. "ఈ ఖండాలలో కోటానుకోట్ల పేద ప్రజలు పట్టెడన్నం కోసం మాడుతున్నారు. అన్నార్తుల రక్తంతో తడిసిన మా అధికారుల చేతులను కడగటానికి ప్రపంచంలో ఉన్న సబ్బులన్నీ చాలవు" అని ప్రకటించారు!

'రూ. 2000' పెద్ద నోటును సర్క్యులేషన్ నుంచి కట్టడి చేసినంత మాత్రాన రూ. 2లు కూడా చేతిలో ఆడని అసంఖ్యాక సామాన్య కష్టజీవులకు కలిగే ప్రత్యేక లాభం ఏముంటుంది? కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర పాలకులు కొత్త వేషానికి గజ్జె కట్టారు. కర్ణాటక తాజా ఎన్నికల్లో రెండువేల రూపాయల కట్టలు ప్రాణం పోసుకున్నందువల్ల 2024 ఎన్నికల నాటికన్నా ఈ కట్టల్ని 'కట్టడి' చేయాలన్నది కేంద్ర పాలకుల ఎత్తుగడ! అసలు 'మంచి పాలన' పేరిట దేశ రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చే ప్రపంచ బ్యాంకు విధాన ఒరవడిలో పెట్టుబడి విధానాల్ని ఆశ్రయించే దేశాల పాలకులందరిదీ ఇదే తంతు అని నిశితమైన ఆర్థిక వ్యవహారాల నిపుణులలో ఒకరైన సంజీవి గుహన్ ఖండించవలసి వచ్చింది. వరల్డ్ బ్యాంక్ చరిత్రకారులైన ఎడ్వర్డ్ మాసన్, రాబర్ట్ ఆషర్ అభిప్రాయం కూడా అదే! అంతేగాదు, బీజేపీ పాలకుల నిర్ణయాలను 'ఆదర్శం'గా భావించిన ఒక 'నేత' మరొక అడుగు ముందుకు వేసి – ప్రతిపక్షాల కూటమికి తనను రథసారథిని చేస్తే మొత్తం ఎన్నికల ఖర్చంతా తానే భరిస్తానని అన్నట్టుగా ఓ ఇంగ్లిష్ ఛానల్‌లో బాహాటంగా ప్రకటించడంతోనే – రెండు వేల రూపాయల నోటుకు 'వేటు' పడిందని కొల్లలుగా ప్రకటనలు వెలువడజొచ్చాయి.

ఈ సందర్భంగా రాజకీయ పాలకుల, నాయకుల తప్పిదాలకు మూలాన్ని కనుగొనే యత్నంలో ఐన్‌స్టీన్‌కూ, సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియాకూ మధ్య సాగిన ఒక ఆసక్తికరమైన సంభాషణను గమనించాలి. **ఐన్‌స్టీన్:** 'రాజకీయులు చేసే తప్పిదాలు వాళ్ల లోని చెడ్డ తలంపుల వల్లగాక, అమాయకత్వం నుంచి పుట్టే లక్షణంగా మనం భావించవచ్చా?'

లోహియా: 'అసలు రహస్యం – రాజకీయవేత్తలకు తమ అమాయక మనస్తత్వం నుంచి బయటపడటం ఇష్టం ఉండదు. అది రోగ నివారణకి అందనంత పెద్ద జబ్బు. ఆ జబ్బే వారిని పీడిస్తుండే పెద్ద రోగం. ఈ రోగం నుంచి బయట పడటం ఇష్టం లేనందుననే చాలా మంది రాజకీయులకు దేశ సామాజిక, ఆర్థిక, ధార్మిక సమస్యలపై శాస్త్రీయమైన అవగాహన ఉండదు గాక ఉండదు'!

ఆర్థిక నిపుణులైన శుభదారావు నేతృత్వంలో పనిచేస్తున్న ఆర్థికవేత్తల బృందం (క్వాంట్ ఎకో) వివరించినట్టుగా, పన్నుల ఎగవేతకు వీలుగా దొంగచాటుగా అట్టిపెట్టుకోవడానికి ఈ 2000 లాంటి పెద్ద నోట్లు సంపన్నుల వద్ద మేట వేసుకున్నాయి. అవి ఇప్పుడు కోట్లాది విలువ చేసే లోహ సంపద పెంచుకోవడానికి ఉపయోగపడతాయి. గతంలో బ్యాంకుల వద్ద పొద్దుగూకులు పెద్ద నోట్లు మార్చుకోవడానికి పడిగాపులు పడి 125 మంది సాధారణ ఖాతాదార్ల ప్రాణాలు 'హరీ' అన్నాయి. ఈసారి 'భాగోతం' ఎలా ముగుస్తుందో రేపటి 'వెండి తెర'పై చూడాల్సిందే!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

హింస ఆగదా?



మణిపూర్‌లో ఇంకా ఎన్ని మరణాల గురించి జనాలు వేదన పడాలి? ఎన్ని ఇళ్లు, ఎన్ని కాలనీలు దగ్ధమవ్వాలి? ఎన్ని గ్రామాలు నేలమట్టం కావాలి? మనకు మనం ఒక రాష్ట్రం అనిపించుకోవడానికి ముందు ఎంత నష్టం జరగాలి? మిత్రమా, దీని జవాబు గాలిలో వీస్తోంది.

– పావోలియెన్లాల్ హావోకిప్, వ్యాఖ్యాత

దేశం తీరు



హరప్పా, మొహెంజెదారోలు ఏ యూరప్ దేశంలోనో ఉండివుంటే, వాళ్లు టూరిజం పరిశ్రమ మీద ప్రతియేటా బిలియన్ల డాలర్లు సంపాదించేవాళ్లు. దానికి బదులుగా పాకిస్తాన్ వృద్ధిలో ఉన్న దేశాలను అడుక్కోవడానికే ఇష్టపడుతుంది.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

పిండేశాక...



ఛాట్ జీపీటీ ప్రస్తుతానికి ఎందుకు ఉచితంగా ఉందంటే, మనం దానికి కావాల్సిన కథలు, వ్యాసాలు, కవితలు ఉచితంగా ఫీడ్ చెయ్యాలి కాబట్టి. మన దగ్గర ఉన్నవన్నీ చేయడం అయిపోయాక, అప్పుడు వాళ్లు దానికి డబ్బులు వసూలు చేయడం మొదలుపెడతారు.

– కింబెర్లీ ఎంగుయెన్, కవయిత్రి


ఆలోచిస్తే...



'కెరియర్‌ను నిర్మించుకోవడానికి మహిళలు ఎన్నో అవరోధాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందులో మొట్టమొదటి అడ్డంకి పెళ్లి చేసుకోవడం' అని కెరియర్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఒక యువతి తన సీఈఓకు చెబుతుండగా విన్నాను. బహుశా అందుకే మహిళలు తమ నిర్ణయాలు సరిగ్గా తీసుకోవాల్సి ఉంటుంది.

– అపూర్వ పురోహిత్, రచయిత్రి

అప్పుడే...




సిద్ధరామయ్య ప్రభుత్వ ఉచిత విధానాలను విమర్శించినందుకు కర్ణాటక చిత్ర దుర్గ జిల్లాలోని ఒక ఉపాధ్యాయుడు సస్పెండ్ అయ్యాడట! అధికారంలోకి వచ్చీరాగానే ఇంత అసహనమా?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ప్రత్యామ్నాయం నియో లిబరలిజమే!

అభిప్రాయం



డా॥ పి. కృష్ణ మోహన్ రెడ్డి

గత కొన్నేళ్లుగా వామపక్షీయులు, పాప్యులిస్ట్ మేధావులు, నియోలిబరిలజంపై దాడిచేస్తూ మార్క్సిస్ట్ – సోషలిస్ట్ సిద్ధాంతానిది పైచేయిగా చూపిస్తూ ప్రధాన స్రవంతి మీడియాలో వ్యాసాలు రాస్తున్నారు. ఒక హైపోథీసిస్‌ను అప్లై చేసి 10 సార్లలో 8 సార్లు సఫలీకృతమైతే దానిని సిద్ధాంతం అంటారు. మరి 1930ల నుంచి 1991 సోవియట్ యూనియన్ పతనం వరకు దారుణంగా విఫలమైన మార్క్సిస్ట్ హైపోథీసిస్‌ను సిద్ధాంతంగా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం? మార్క్స్ 'యుటోపియన్' మోడల్ దారుణంగా విఫలం చెందడం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తేటతెల్లమైంది. ఆ మోడల్ వల్ల రష్యా, తూర్పు యూరప్, చైనా, కాంబోడియాల్లో కొన్ని లక్షల మంది మరణించారు. మార్క్స్–సోషలిస్ట్ మోడల్ పొలిటికల్ ఎకానమీ... దేశాలను, ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి నెట్టేసింది. పోల్చిచూస్తే తూర్పు జర్మనీ – పశ్చిమ జర్మనీ, ఉత్తర కొరియా – దక్షిణ కొరియా, తూర్పు యూరప్ – పశ్చిమ యూరప్‌లలో లిబరల్ ఆర్థిక వ్యవస్థే దేశాలను నిలబెట్టింది. ప్రధానంగా ప్రైవేటైజేషన్, విదేశీ పెట్టుబడులను నిరోధించడం, అన్నీ ప్రభుత్వ రంగంలో ఉండటం లాంటి కారణాల వల్ల మార్క్సిస్ట్ – సోషలిస్ట్ దేశాల్లో ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయి, ఆ దేశాలు కుప్పకూలాయి.

అదే సమయంలో 1950ల నుంచి ప్రపంచ వ్యాప్తంగా లిబరల్ ఆర్థిక వ్యవస్థ మోడల్‌ను అనుసరించిన దేశాలు, వాటిలోని ప్రజలు ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. వాటి ఆర్థికవ్యవస్థలు కూడా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. కాబట్టి లిబరల్–క్యాపిటలిస్ట్ మోడల్ ఒక కాల పరీక్షను ఎదుర్కొని విజయవంతంగా నిలబడింది. ఈ విషయాన్ని మొట్టమొదటగా అర్థం చేసుకున్నది చైనా. 1978 నుంచే చైనా మార్క్సిస్ట్ విధానాలను త్యజించి లిబరల్–క్యాపిటలిస్ట్ మోడల్‌లోకి ప్రవేశించింది. గత 40 ఏళ్లుగా చైనా అభివృద్ధి మన కళ్ళముందుంది. అలాగే తూర్పు యూరప్‌లోని కమ్యూనిస్టు దేశాలు ప్రజాస్వామిక దేశాలుగా 30 ఏళ్ల నుంచి ప్రజాస్వామికంగా నియోలిబరల్ మోడల్‌ని ఆచరిస్తున్నాయి. అక్కడి ప్రజలు తిరిగి మార్క్సిస్ట్ మోడల్ కోసం వెనక్కు వెళ్ళలేదు. ఒకవేళ మార్క్సిస్ట్ మోడల్ నియో లిబరల్ మోడల్ కంటే ఉత్తమమైనదైతే అక్కడి ప్రజలు కచ్చితంగా తిరిగి మార్క్సిస్ట్ మోడడల్‌ని ఆహ్వానించేవారు. ఎందుకంటే వారు ఈ రెండు మోడల్స్‌నూ అనుభవించారు కనుక.

మార్క్సిస్ట్–నియో లిబరల్ నేపథ్యం ఇలా



ఉండగా, భారతదేశంలో మాత్రం నియో లిబరలిజం వల్ల దేశం నాశనం అవుతుందని ప్రచారం చేస్తున్నారు. కానీ 1947 నుంచి 1991 వరకు 'నెహ్రూవియన్ సోషలిస్ట్ కమాండ్ ఎకానమీ'ని ఆచరించడం వల్ల మన ఆర్థికవృద్ధి రేటు 3 శాతానికి మించలేదు. దేశం దారుణమైన ఆర్థిక సమస్యల్లో ఇరుక్కుపోయింది. మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు... లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్‌పీజీ) వల్లనే దేశం గడ్డు సమస్యల నుంచి బయట పడింది. ఈ మోడల్ భారతదేశంతో సహా అన్ని దేశాల్లోనూ సత్ఫలితాలను ఇస్తూ ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే చివరి కమ్యూనిస్టు దేశాలు వియత్నాం, క్యూబా కూడా మార్క్సిస్ట్ – సోషలిస్ట్ సిద్ధాంతాలను అనుసరించలేక పోయాయి. ఇంకో ముఖ్య విషయం ఏమిటంటే మార్క్సిస్ట్ సిద్ధాంతం, మార్క్సిస్ట్ పోరాటాల ద్వారా మార్క్సిస్ట్ ప్రభుత్వాన్ని నెలకొల్పుకున్న నేపాల్ కూడా లిబరలిజం రాజ్యాంగ, ఆర్థిక విధానాలతోనే అభివృద్ధి చెందుతోంది. కాబట్టి 21వ శతాబ్దంలో నియో లిబరలిజాన్ని వదలి తిరిగి సోషలిజం వైపు ప్రయాణం చేయడం ఆత్మహత్యా సదృశ్యమే.

కొన్నిసార్లు నియో లిబరలిజం వల్ల ఆర్థిక తారతమ్యాలు పెరిగి పోతున్నాయనీ; పర్యావరణ కాలుష్యం, కార్పొరేటీకరణ, వనరులు దోచుకోవడం లాంటివి జరుగుతున్నాయనీ విమర్శలున్నాయి. ఆర్థికవ్యవస్థ మెరుగుపడి, అధిక ధనం ప్రభుత్వాల చేతిలోకి వచ్చినా ప్రభుత్వాలు అసమానతలు తొలగించకుండా ఉంటే అది ప్రభుత్వాల తప్పు. నియో లిబరిజం తప్పుకాదు. ఇక పర్యావరణం, వనరుల వినియోగం విషయానికి వస్తే... గతంలో కమ్యూనిస్టు దేశాల్లో కూడా గనులతో సహా అన్ని సహజ వనరులనూ ప్రభుత్వాలే విచ్చలవిడిగా వినియోగించడంతో ఆయా దేశాల్లో పర్యావరణం దెబ్బతింది. కాబట్టి ఇటువంటి విషయాలమీద నియో లిబరలిజం సిద్ధాంతంలో లోపమున్నట్లు విమర్శించడం సమంజసం కాదు. ఈ సిద్ధాంతం వల్ల పేదరికం పెరిగిపోతుందని ఒక విమర్శ. ఇది అవాస్తవం. పేదరికం తగ్గడంతోపాటు మధ్యతరగతి కూడా పెరుగుతోందనేది వాస్తవం. నియో లిబరలిజాన్ని విమర్శించే మేధావులు ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ఇబ్బందులు తేనటువంటి వేరే ఆర్థిక మోడల్‌ను ప్రతిపాదిస్తే అందరూ ఆహ్వానిస్తారు. కానీ సోషలిజాన్ని తిరిగి తీసుకురావాలనే ప్రయత్నం తప్ప ఒక ప్రత్యామ్నాయ మోడల్‌ను ఎవరూ ప్రతిపాదించడం లేదు. అదే విచారకరం.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్
చరిత్రశాఖ, ఎస్వీ యూనివర్సిటీ

చట్టాలకు మార్గదర్శి అతీతం కాదు!

అభిప్రాయం



పి. చంద్రమౌళి

చాలా రోజులుగా 'మార్గదర్శి చిట్స్' కేసు వార్తల్లో నిలుస్తోంది రామోజీరావు వాదన ప్రకారం ప్రభుత్వం కక్షపూరితంగా తమ సంస్థపై అభియోగాలు మోపుతోంది. తమ సంస్థ విశ్వసనీయత దెబ్బతీసేందుకే సీబీసీఐడీ సోదాలు జరుగుతున్నాయి అన్నది రామోజీరావుగారి వాదన. అసలు ఇవన్నీ పక్కనపెడితే మార్గదర్శి చిట్స్ మార్గదర్శకాలు పాటిస్తూ వ్యాపారం చేస్తున్నదా?

రామోజీరావు సంస్థలన్నీ 'హెచ్‌యూఎఫ్ ఏక్ట్' కిందికి వస్తాయని ఆయనే స్వయంగా 2006లో తన పేపర్లో ఇదే మార్గదర్శి విషయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ లేవనెత్తిన సందేహాల సందర్భంలో ఒప్పుకున్నారు. హెచ్‌యూఎఫ్ ఏక్ట్ అంటే హిందూ అవిభాజ్య కుటుంబ చట్టం. ఈ చట్టం... ఒక హిందూ కుటుంబంలోని రక్త సంబంధీకులు కలిసి ఒక సంస్థని ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో పన్ను మినహాయింపు కోరే వెసులుబాటును కలిపించింది. అయితే ఒక సంస్థ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏక్ట్–1934, సెక్షన్ 45ఎస్‌కు అనుగుణంగా ఏర్పడితేనే దానిని హెచ్‌యూఎఫ్ కింద పరిగణిస్తారు. అంతేకాకుండా ఆ సంస్థ హెచ్‌యూఎఫ్ కింద కార్యకలాపాలు సాగిస్తూ ఉంటే థర్డ్ పార్టీ నుంచి పెట్టుబడులు కాని, డిపాజిట్స్ కానీ స్వీకరించకూడదు. అలా స్వీకరిస్తే అది చట్టరీత్యా నేరం. అసలు థర్డ్ పార్టీ నుంచి ఎటువంటి ఆర్థికపరమైన లావాదేవీలు చేయడానికి ఈ చట్టంలో వెసులుబాటు లేనే లేదు.

అయితే మార్గదర్శి చిట్స్ దీనికి వ్యతిరేకంగా డిపాజిట్స్ స్వీకరించి వాటిని మ్యూచువల్ ఫండ్స్ లోనో, షేర్స్‌లోనో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఇది ఒక విధంగా స్పెక్యులేషన్ ఇన్వెస్ట్‌మెంట్. ఈ పెట్టుబడుల్లో ఖాతాదారుల సొమ్ముకు ఎటువంటి భరోసా ఉండదు.

అసలు రామోజీరావు చేస్తున్న జిమ్మిక్కులన్నీ ఎవరూ పసిగట్టకపోవడం దురదృష్టకరం. నేను ఆయన మీద విశాఖపట్నంలో సీసీ 43/2006 అనే కేసు మూడవ ఎమ్ఎమ్‌సీ కోర్టులో పరువు నష్టం కేసు ఫిర్యాదుదారుని తరఫున వాదించాను. అందులో రామోజీరావు ముద్దాయి. ఈ కేసులో రామోజీ రావు వింత వాదనని తెర మీదకి తెచ్చారు. తాను ఈనాడు పత్రిక నడుపుతున్నది 'ఉషోదయ పబ్లికేషన్స్' పేరు మీదనీ, అది 'ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్' ఆధ్వర్యంలో నడుస్తున్నదనీ భిన్న వాదనలు వినిపించారు. అంతేకాదు మార్గదర్శి చిట్స్, రామోజీ ఫిలింసిటీలను కూడా కంపెనీలుగా పేర్కొన్నారు. ఈ పరువు నష్టం కేసులో ... 'ఉషోదయ పబ్లికేషన్స్'కి 'ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్' ఆథరైజేషన్ ఇచ్చినట్లు చూపించారు. అసలు ఒక కంపెనీ ఇంకో కంపెనీకి ఆథరైజేషన్ ఎలా ఇవ్వగలదో రామోజీరావుకే తెలియాలి. 'సూటిగా రామోజీరావుని అడుగుతున్నా... మార్గదర్శి చిట్స్ మూసివేస్తే ఆయన మిగతా సంస్థలమీద ప్రొసీడ్ అయ్యి ఖాతాదారులు తమ డబ్బు తిరిగి పొందే వీలుందా!' ఆయన ఆ హామీ కచ్చితంగా ఇవ్వలేరు.



ఎందుకంటే చట్టంలో ఆ వెసులుబాటు లేదు. ప్రతి కంపెనీకి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ వేరువేరుగా ఉంటాయి. ఇక్కడే రామోజీరావు చాణక్య నీతి బయట పడుతుంది. డిపాజిట్స్ సేకరించే మార్గదర్శిని నష్టాల్లో చూపిస్తున్నారు. నష్టాల్లో ఉన్న రామోజీ ఫిలిం సిటీని లాభాల్లో చూపిస్తున్నారు. భవిష్యత్తులో మార్గదర్శి చిట్స్‌ను ఎత్తివేస్తే ఖాతాదార్లు ఎవరూ ఆయన ఇతర సంస్థలైన రామోజీ ఫిలింసిటీ, ఈనాడు వంటి వాటిమీద రికవరీ కోసం వెళ్లలేరు. ఈయన ప్రజలను చాలా తెలివిగా బురిడీ కొట్టిస్తున్నారు.

అలాగే రామోజీరావు ఏ ఖాతాదారుడు మార్గదర్శి మీద ఫిర్యాదు చేయకపోయినా సీబీసీఐడీ... తమ సంస్థపై కేసులు పెడుతున్నదని అంటున్నారు. ఈ వాదనలో ఎటువంటి పస లేదు. ఉల్లంఘన ఉంటే రెగ్యులేటరీ అథారిటీకి చర్యలు తీసుకొనేందుకు చట్టబద్ధమైన హక్కు ఉందని 'ఏపీ చిట్‌ఫండ్ ఏక్ట్'లోని సెక్షన్ 76 స్పష్టంగా చెబుతోంది.

నిజంగా రామోజీరావు వ్యాపారం పారదర్శకంగా చేస్తుంటే ఆయన ఖాతాదారుల వివరాలు తెలియచేయడానికి ఎందుకు ఇబ్బంది పడుతున్నారు? సమాచారం దర్యాప్తు సంస్థలకిగానీ, న్యాయస్థానాలకు గానీ అడిగినప్పుడు ఇవ్వకపోవడం కూడా నేరమే. సుప్రీంకోర్టు 'సహారా' కేసులో ఇదే తేల్చి చెప్పింది. అప్పట్లో 'కృషీ బ్యాంక్' ఛైర్మన్ 32 కోట్ల డిపాజిట్స్ ఎగ్గొట్టిన వైనాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఛైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు మూడు సంవత్సరాల పాటు రిమాండులో ఉండవలసి వచ్చింది. మరి రామోజీ రావు ఇన్నివేల కోట్లు డిపాజిట్స్ రూపంలో సేకరించి వాటిని స్పెక్యులేటివ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా మార్చినందువల్ల కలిగే నష్టాలకు ఎటువంటి శిక్షపడుతుందో మరి.

అసలు మార్గదర్శి చిట్స్ చట్టాన్ని పట్టించుకునేలా కనిపించటం లేదు. సెక్షన్ 213లోని మూడవ షెడ్యూల్ ప్రకారం ఒక ఫార్మాట్ అనుసరించి వారు ఎవరెవరి దగ్గర నుంచి డిపాజిట్స్ సేకరిస్తున్నారో వాటి వివరాలు, లాభం ఎంత, నష్టం ఎంత, అప్పులు ఎన్ని ఉన్నాయి, సంస్థ ఆస్తుల వివరాలు వంటివన్నీ బహిర్గతపరచాలి. అలాగే వాటిని రెగ్యులేటరీ అథారిటీకి బ్యాలెన్స్ షీట్ రూపంలో ప్రతి సంవత్సరం సబ్‌మిట్ చెయ్యాలి. కానీ అలా చేస్తున్నట్లు దాఖలాలు ఏమీ లేవు.

వ్యాసకర్త సీనియర్ అడ్వకేట్, విశాఖపట్నం
మొబైల్: 48489 99976

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.పంచమి రా.1.11 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పునర్వసు ప.1.55 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.10.43 నుండి 12.29 వరకు, దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.23 వరకు, అమృతఘడియలు: ఉ.11.15 నుండి 01.32 వరకు ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.30, సూర్యాస్తమయం: 6.23.

క్లుప్తంగా...

నేడు ఆచార్య 'కేతు' అంత్యక్రియలు


కేతు విశ్వనాథరెడ్డికి నివాళులర్పిస్తున్న పెంచలయ్య దంపతులు

కడప కల్చరల్: ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అంత్యక్రియలు బుధవారం జరగనున్నాయి. బుధవారం ఉదయం ఆయన కుమారుడు, కుమార్తె విదేశాల నుంచి వచ్చాక అంత్యక్రియలు కడపలో గానీ, ఆయన స్వగ్రామంలోగానీ నిర్వహిస్తారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం కడపలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఆయన స్వగృహానికి కుటుంబీకులు చేర్చారు. భౌతికకాయానికి రైల్వేకోడూరు మాజీ శాసన సభ్యులు పెంచలయ్య దంపతులు, సాహిత్యాభిమానులు నివాళులర్పించారు.

శ్రీశైలంలో జూన్ నెల ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జూన్ నెలకు సంబంధించి ఉభయ దేవాలయాల్లో నిర్వహించే అన్ని ఆర్జిత సేవలు, స్వామివారి స్పర్శ దర్శనం టికెట్లు ఈ నెల 25వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులో ఉంటాయని దేవస్థానం అధికారులు మంగళవారం ప్రకటించారు. ఆన్‌లైన్ టికెట్లు పొందిన వారు టికెట్లతో పాటు, ఆధార్ జిరాక్స్ వెంట తెచ్చుకోవాల్సి ఉంది. మహాకుంభాభిషేకం నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేయడం తెలిసిందే. అయితే ప్రస్తుతం మహాకుంభాభిషేకం వాయిదా పడడంతో ఆర్జిత సేవలను యథావిధిగా కొనసాగించేందుకు నిర్ణయించారు. గర్భాలయ అభిషేకం, స్వామివారి స్పర్శదర్శనం టికెట్లు మినహా అన్ని ఆర్జిత సేవలు ప్రారంభానికి ఒక గంట ముందు వరకు కూడా ఆన్‌లైన్‌లో ఆయా సేవా టికెట్లను భక్తులు పొందవచ్చు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన జనం


గంగమ్మ శిరస్సు ఊరేగింపు

కుప్పం(చిత్తూరు జిల్లా): శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా కుప్పంలో మంగళవారం అమ్మవారికి శిరస్సు తెర తొలగించి ఊరేగించే తంతు వైభవంగా నిర్వహించారు. కుప్పం మూడు రాష్ట్రాల కూడలిలో ఉండడంతో కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి శిరస్సును దర్శించుకున్నారు. అన్నప్రసాదాలు వండి భక్తులకు పంచిపెట్టారు.

రూ.18 కోట్ల ఎంబర్‌గ్రిస్ స్వాధీనం


ఎంబర్‌గ్రిస్‌ను చూపుతున్న పోలీసులు

మైసూరు: తిమింగలం వాంతి ఎంబర్‌గ్రిస్‌ను విక్రయిస్తోన్న ముగ్గురిని కర్ణాటకలోని మైసూరు జిల్లాలో హెచ్.డి.కోటె పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి అరుదైన రూ.18 కోట్ల విలువైన ఎంబర్‌గ్రిస్‌ను స్వాధీనం చేసుకున్నారు. హెచ్.డి.కోటె సమీపంలో ఓ హోటల్ వద్ద స్విఫ్ట్ కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద ఉన్న 9 కిలోల 821 గ్రాముల ఎంబర్‌గ్రిస్‌ను సీజ్ చేశారు. వన్యజీవుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తిమింగలాలు కొన్ని రకాల సముద్ర జీవులను ఆరగించినప్పుడు జీర్ణం కాగా మిగిలిపోయిన పదార్థాన్ని వాంతి చేసుకుంటాయి. ఇది మెత్తని గడ్డ రూపంలో ఉంటుంది. దీనిని సుగంధ ద్రవ్యాల తయారీకి ఉపయోగిస్తారు. దీనికి అంతర్జాతీయ మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉంది. కేజీ ధర కోటి రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా.

పోలీసులపై గవర్నర్‌కు బీజేపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో తమ పార్టీ నేతలపై పోలీసులు దాష్టీకాన్ని ప్రదర్శించారని ఫిర్యాదు చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆధ్వర్యంలోని ఆ పార్టీ నేతలు మంగళవారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. సోము వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ.. ఘటనకు కారణమైన డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జూన్ 16న కర్నూలులో బీసీ సామాజిక సభను, విశాఖలో ఈ నెల 28న బీసీల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కిసాన్ మోర్చా ఆలిండియా ఉపాధ్యక్షుడు సురేష్ రెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు భరత్, తదితరులున్నారు.

రీ సర్వేలో సర్కారు స్పీడు

తొలి విడత 2 వేల గ్రామాల్లో విజయవంతంగా రాళ్లు పాతడం పూర్తి

- కొత్త రెవెన్యూ రికార్డులూ సిద్ధం
- రికార్డు స్థాయిలో 20 రోజుల్లో 12 లక్షలకు పైగా రాళ్లు పాతిన సర్వే శాఖ
- సగటున రోజుకు 40 వేలకు పైగా రాళ్లు పాతిన సిబ్బంది
- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో నెల రోజులుగా ఈ పనిలో నిమగ్నం
- మొత్తం 25.80 లక్షల సరిహద్దు రాళ్లు పాతిన వైనం
- రైతులకు పైసా ఖర్చు లేదు
- రూ.కోట్లు ఖర్చు పెట్టి ఉచితంగా రాళ్లు పాతిన ప్రభుత్వం
- రీ సర్వేలో మోడల్‌గా మారిన 2 వేల గ్రామాలు



సర్వేరాళ్లు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి, అమరావతి: భూముల రీ సర్వేతో కొత్త చరిత్రను లిఖిస్తున్న ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. తొలి విడత రీ సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. వ్యవసాయ భూముల సరిహద్దులను చూపుతూ రాళ్లు వేసినప్పుడు మాత్రమే సమగ్ర భూ సర్వే పూర్తయినట్లని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేయటంతో సర్వే శాఖ వేగంగా దాన్ని పూర్తి చేసింది. గత నెలాఖరుకి 13 లక్షల రాళ్లు పాతిన యంత్రాంగం ఆ తర్వాత 20 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 12.80 లక్షలకుపైగా రాళ్లు పాతి, కొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 20వ తేదీకల్లా 2 వేల గ్రామాల్లో రాళ్లు పాతే పని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా మూడు రోజుల ముందే ఆ పని పూర్తి చేశారు. ఇందుకోసం సర్వే శాఖ వెయ్యి రోవర్లను సమకూర్చుకొంది. మరికొన్నింటిని అద్దెకు తీసుకొంది. రోజుకు సగటున 40 నుంచి 50 వేల రాళ్లను పాతారు.

2 వేల గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తి

రాష్ట్రంలోని 17 వేలకుపైగా గ్రామాలకుగాను తొలి విడతగా 2 వేల గ్రామాల్లో రీ సర్వే అన్ని దశలు పూర్తయింది. ఈ గ్రామాలకు కొత్త రెవెన్యూ రికార్డులు (ఆర్ఓఆర్) సైతం తయారయ్యాయి. ఆ గ్రామాలకు చెందిన 7.50 లక్షల మంది రైతులకు భూ హక్కు పత్రాలను జారీ చేశారు. చివరిగా రైతుల భూముల సరిహద్దుల్లో సర్వే రాళ్లు పాతడం కూడా పూర్తి చేయడం ద్వారా ఈ 2 వేల గ్రామాలను రీసర్వే మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దారు.

ఖర్చంతా ప్రభుత్వానిదే

సాధారణంగా రైతులు భూమిని సర్వే చేయించుకుని రాళ్లు పాతించడం పెద్ద ప్రయాస. ఖర్చు ఎక్కువ. అయితే, ప్రభుత్వం రైతులపై పైసా కూడా భారం పడకుండా మొత్తం తానే భరించింది. సర్వే పూర్తి చేసి ఉచితంగా రాళ్లు పాతి రైతులకు భూములు అప్పగించింది. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా ఇందుకోసం అవసరమైన రాళ్లను కోట్ల ఖర్చుతో తయారు చేయించింది. రాళ్ల తయారీకి ప్రత్యేకంగా యూనిట్లు పెట్టి మరీ అవసరమైన సైజుల్లో రాళ్లను తయారు చేసింది.

25 లక్షలకు పైగా రాళ్లు

సర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో మొత్తం 25 లక్షలకు పైగా రాళ్లను పాతారు. మూడు గ్రామాలు కలిసే చోట (ట్రై జంక్షన్) ఏ క్లాస్ పెద్ద రాళ్లు 6,970 పాతారు. ప్రతి భూకమతం హద్దుల్లో బి క్లాస్ చిన్న రాళ్లు 25.73 లక్షలు పాతారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలోని 354 గ్రామాల హద్దుల్లో 4.48 లక్షల రాళ్లు పాతారు. విజయనగరం జిల్లాలో 179 గ్రామాల్లో 2.48 లక్షలు, పల్నాడు జిల్లాలో 70 గ్రామాల్లో 2.08 లక్షలు, కాకినాడ జిల్లాలో 121 గ్రామాల్లో 1.86 లక్షలు, చిత్తూరు జిల్లాలోని 134 గ్రామాల్లో 1.44 లక్షల రాళ్లు పాతారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా గ్రానైట్, శాండ్ స్టోన్, లైమ్ స్టోన్, నాప రాళ్లను వినియోగించారు. 70 శాతానికిపైగా గ్రానైట్ రాళ్లనే పాతారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఐదుగురు అరెస్ట్
- వెయ్యి కిలోల గంజాయి, ఐసర్ వ్యాన్, బ్రిజా కారు స్వాధీనం
- ఒడిశా నుంచి విశాఖ మీదుగా తమిళనాడుకు సరఫరా



అల్లిపురం (విశాఖ దక్షిణ): ఒడిశా నుంచి తమిళనాడుకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను విశాఖ నగర సిటీ టాస్క్‌ఫోర్స్, ఆనందపురం పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఒక ఐసర్ వ్యాన్, బ్రిజా కారు, మూడు సెల్‌ఫోన్లు, రూ.3,600 స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ వివరాలు వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి గ్రామం సమీపంలోని కోరుకొండ, ఒడిశా రాష్ట్రం సువ్వాపల్లి, కంచరపేట గ్రామం నుంచి ఐదుగురు తమిళనాడుకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నగర సిటీ టాస్క్ ఫోర్సు పోలీసులు సోమవారం రాత్రి ఆనందపురం వై.జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో ఏపీ 05 టీజీ 4665 నంబరు గల ఐసర్ వ్యానులో 25 గోనె సంచుల్లో వెయ్యి కేజీల గంజాయి గుర్తించారు. వ్యానును అనుసరిస్తున్న ఏపీ 31 డబ్ల్యూక్యూ 0044 నంబరు కారులో ఉన్న అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం, బెన్నబోపాలపట్నం గ్రామానికి చెందిన చెల్లూరి మోహన్, సూర్యం అలియాస్ సూర్యనారాయణ అలియాస్ సూర్య బాయ్, చింతపల్లి మండలం లోతుగెడ్డకు చెందిన అనపర్తి ప్రసాద్, పల్లెల లోవరాజును అరెస్టు చేశారు. అలాగే వ్యానులో ప్రయాణిస్తున్న చింతపల్లి మండలం రేగల్ల గ్రామానికి చెందిన వంతల రాజబాబు, క్లీనర్ వంతల సూరిబాబును కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, గంజాయిని తమిళనాడుకు తరలించేందుకు ప్రధాన నిందితుడు చెల్లూరి మోహన్ తమిళనాడులోని కొందరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇతనిపై 2012లో కశింకోటలో పోలీసు స్టేషన్‌లో ఓ కేసు ఉంది. డీసీపీ-1 విద్యాసాగరనాయుడు, క్రైం డీసీపీ జి.నాగన్న పాల్గొన్నారు.

ఘరానా గజదొంగ ఆటకట్టు

- పలు రాష్ట్రాల్లో 45 కేసుల్లో నిందితుడు
- 14 కేసుల్లో శిక్షపడినా మారని నైజం
- విశాఖలో చోరీ చేసి పట్టుబడిన వైనం
- నిందితుడితో సహా నలుగురి అరెస్ట్
- బంగారు, వెండి ఆభరణాలు, ద్విచక్రవాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ

అల్లిపురం (విశాఖ దక్షిణ): 45 కేసుల్లో నిందితుడైన గజదొంగను విశాఖ పోలీసులు అరెస్ట్ చేసి అతడికి సహకరించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ విలేకరులకు ఈ కేసు వివరాలను చెప్పారు. విశాఖ ఎన్ఏడీ జంక్షన్ గణేష్‌నగర్‌లోని వాసవీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్స్‌లో డాక్టర్ బిందెల సూర్య సాహిత్య, ఆమె తండ్రి ఈ నెల 6న రాత్రి ఫ్లాట్-101లో నిద్రిస్తున్నారు. ఆమె తల్లి బయట నుంచి తాళం వేసి అదే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్-517లో ఉంటున్న సాహిత్య సోదరికి తోడుగా పడుకునేందుకు వెళ్లింది. తెల్లవారుజామున 3.15 గంటలకు తండ్రి బెడ్ రూమ్‌లో లైట్ వెలగడాన్ని సాహిత్య గమనించి..తలుపు దగ్గరకు వెళ్లి చూడగా బయట తాళం వేసిన గెడ విరిగి ఉంది. ఇంట్లోని బీరువాలో బంగారం, వెండి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులు కేసు నమోదు చేసి బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. తనిఖీల్లో భాగంగా పోలీసులు మద్దిలపాలెం కళాభారతి వద్ద శివాజీపాలెంకి చెందిన శీలా అనిల్‌కుమార్, అతని స్నేహితుడు తట్టా లక్ష్మణరావు అలియాస్ తట్టబాబులను విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు అనిల్‌కుమార్ తల్లి రమణి, గుర్జాపు గురుమూర్తిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఫ్లాట్-101లో దొంగిలించిన రూ.5.80 లక్షల విలువైన 15.5 తులాల బంగారాన్ని, 500 గ్రాముల వెండి వస్తువులు, 2 స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు.

జైలు నుంచి విడుదల అవ్వగానే..

నిందితుడు శీలా అనిల్‌కుమార్ గత ఏప్రిల్ 18న తెలంగాణలోని కరీంనగర్ జైలు నుంచి విడుదలై అక్కడ నుంచి మెదక్ చేరుకొని ఓ ఇంట్లో చొరబడి 6.7 గ్రాముల బంగారు చైన్, స్కూటీ దొంగిలించాడు. అక్కడ నుంచి స్కూటీపై విశాఖకు చేరుకున్నాడు. ఇతను ఎటువంటి ఆయుధం లేకుండానే గడియలను తీయడంలో సిద్ధహస్తుడు. దొంగిలించిన సొత్తును తన తల్లి శీలా రమణి, గుర్జాపు గురుమూర్తి, స్నేహితుడు తట్టా లక్ష్మణరావులకు ఇచ్చి అమ్మిస్తుంటాడు. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక స్కూటీ, శ్రీకాకుళం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 33 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగతనం చేశాడు. ఇందులో నిందితుడు సెల్‌ఫోన్ వాడకపోవడం విశేషం. అటుగా వెళ్లే వారి ఫోన్ అడిగి మాట్లాడి వారికి ఇచ్చేస్తుండేవాడు. అనిల్‌కుమార్‌పై ఇప్పటివరకు విశాఖలో 6, ఇతర జిల్లాల్లో 15, ఇతర రాష్ట్రాల్లో 28 కేసులు నమోదయ్యాయి. వాటిలో 14 కేసుల్లో శిక్ష కూడా ఖరారైంది. కాగా, నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వెస్ట్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేష్, హార్బర్ క్రైం ఎస్ఐ సూరిబాబు, ఎయిర్‌పోర్టు క్రైం ఎస్ఐ కాంతారావు, కంచరపాలెం క్రైం ఎస్ఐ సునీల్, పెందుర్తి క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్, గోపాలపట్నం క్రైం ఎస్ఐ నరసింహరాజు, సిబ్బందికి కమిషనర్ నగదు రివార్డులు అందజేసి అభినందించారు.

నావిక్-01తో నావిగేషన్ వ్యవస్థ బలోపేతం

- 29న జీఎస్ఎల్వీ ఎఫ్12 రాకెట్ ద్వారా ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఈనెల 29వ తేదీ ఉదయం 10.42 గంటలకు జీఎస్ఎల్‌వీ మార్క్2(జీఎస్ఎల్‌వీ ఎఫ్12) రాకెట్ ద్వారా 2,232 కిలోల బరువు కలిగిన నావిక్-01 (ఐఆర్ఎన్ఎస్ఎస్-1జే) ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించబోతోంది. ఇప్పటికే రాకెట్ అనుసంధానం పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(ఐఆర్ఎన్ఎస్ఎస్)ను తయారు చేసుకోవడానికి గతంలో ఏడు ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఇప్పుడు నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రెండో విడతలో మొట్టమొదటిగా నావిక్-01 ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగిస్తోంది. ఈ ఉపగ్రహంలో ఎల్-1 బ్యాండ్ సిగ్నల్స్‌కు సంబంధించిన పరికరాలు, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన అణు గడియారాన్ని అమర్చి ప్రయోగిస్తున్నారు. దీని వల్ల నావిగేషన్ వ్యవస్థలో టైమ్ టు టైమ్ సమాచారం తెలుసుకోవచ్చు.

బీజేపీతో బీసీలకు మేలు: సోము వీర్రాజు

పొదిలి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు ఎంతో మేలు చేస్తుందని బీజేపీ ఏపీ శాఖ అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. ప్రకాశం జిల్లా పొదిలిలో మంగళవారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో వీర్రాజు మాట్లాడారు. ఏపీలో 50%గా ఉన్న బీసీల్లో చైతన్యం నింపేందుకు, వారి సంక్షేమం కోసం కేంద్రం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. విశాఖ లేదా కర్నూలులో బీసీ సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం కోట్లాది రూపాయల నిధులిస్తున్నా రాష్ట్రం సక్రమంగా పథకాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంపై చార్జిషీట్ దాఖలు చేస్తున్నామని, దీనిలో భాగంగా ప్రకాశం జిల్లాలో చార్జిషీట్ పెడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఎమ్మెల్యేల అక్రమాల గురించి చార్జిషీట్‌లో పెట్టినట్లు వెల్లడించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఊతమివ్వాలని, ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వీర్రాజును సన్మానించారు.

ఎస్సీ విద్యార్థులకు విశాఖలో నీట్, జేఈఈ శిక్షణ కేంద్రం

- ఈ కేంద్రంలో 160 మంది బాలికలకు శిక్షణ
- ఇంటర్ విద్యార్థులకోసం 56 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ కేంద్రాలు
- ఎస్సీ గురుకులాల సమీక్షలో మంత్రి మేరుగు నాగార్జున


డీసీవోల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు నీట్, జేఈఈ శిక్షణ ఇచ్చేందుకు విశాఖ జిల్లా మధురవాడలో మరో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఎస్సీ గురుకుల విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు వీలుగా 56 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ల (డీసీవోల)తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ బాలుర కోసం అడవి తక్కెళ్లపాడు (గుంటూరు జిల్లా), చిన్నటేకూరు (కర్నూలు జిల్లా), బాలికల కోసం ఈడుపుగల్లు (కృష్ణాజిల్లా)లో నీట్, జేఈఈ శిక్షణ కేంద్రాలున్నాయని తెలిపారు. ఈ కేంద్రాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బాలికల కోసం మరో శిక్షణ కేంద్రాన్ని మధురవాడలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కేంద్రంలో 160 మంది బాలికలకు శిక్షణ ఇస్తామన్నారు. ఎస్సీ గురుకులాలు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర సగటును మించి ఫలితాలు సాధించాయని చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల్లో 1,400 మంది సింగిల్ సబ్జెక్ట్‌లో తప్పారని తెలిపారు. వీరంతా ఉత్తీర్ణులయ్యేలా రాష్ట్రవ్యాప్తంగా 56 అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. సింగిల్ సబ్జెక్ట్‌లో తప్పినవారంతా ఉత్తీర్ణులైతే ఇంటర్ పాస్ ఫలితాలు 80 శాతం దాటిపోతాయని పేర్కొన్నారు. డీసీవోలు తమ జిల్లాల పరిధిలో తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలలకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. గురుకులాల్లో విద్యార్థుల రోజువారీ హాజరును ప్రతిబింబిస్తూ డైలీ సిట్యుయేషన్ రిపోర్ట్ (డీఎస్ఆర్)ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. తద్వారా విద్యార్థులు అనుమతి లేకుండా బయటికి వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం లేకుండా చూడాలని కోరారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 5వ తరగతిలో 14,940 సీట్లు ఉన్నాయని, తొలివిడతగా 13,881 మందిని ఎంపిక చేశామని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 13,520 సీట్లు ఉన్నాయని, వీటిలో 13,180 సీట్లకు తొలి విడతలోనే విద్యార్థులను ఎంపిక చేశామని చెప్పారు. 5 నుంచి 9వ తరగతిలో మిగిలిపోయిన మరో 1,450 సీట్లను కూడా ఆయా జిల్లాల స్థాయిలోనే భర్తీ చేస్తామని వారు తెలిపారు. గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా మిగలకుండా చూసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి, సంయుక్త కార్యదర్శి శివరావు, ఏఎంవో ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వాణిజ్య శాఖ అధికారి, ఎస్ఐ


వాణిజ్యశాఖ అధికారి సత్య హరి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి/కంబాలచెరువు(రాజమహేంద్రవరం): లంచాలు తీసుకుంటూ ఇద్దరు ప్రభుత్వ అధికారులు ఏసీబీకి మంగళవారం చిక్కారు. రాజమహేంద్రవరానికి చెందిన డ్రీమ్స్ స్టెప్ సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన జీఎస్టీ రిటర్న్, ఇన్‌కం టాక్స్ రిటర్న్ ఐదేళ్లుగా ఫైల్ చేస్తున్నారు. అయితే దానిలో లోపాలున్నాయని, దీనిపై ఆ కంపెనీపై చర్యలు తీసుకుంటామని ఇన్‌కం టాక్స్ కార్యాలయం నుంచి 5 నోటీసులు వచ్చాయి. దీనిపై ఆ కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాల వీర మల్లిఖార్జునరావు జీఎస్టీ రిటర్న్స్, ఇన్‌కం టాక్స్ రిటన్స్ పత్రాలను పంపారు. అయితే అవి సక్రమంగా లేవని కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సత్యహరి శ్రీనివాసు చెప్పారు. ఒక్కో నోటీస్‌కు రూ.20 వేలు చొప్పున 5 నోటీసులకు రూ.లక్ష లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అదనపు ఎస్పీ సౌజన్య రంగంలోకి దిగి..లంచం తీసుకుంటుండగా సత్యహరి శ్రీనివాస్‌ను కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు ఎస్ఐ కందుల దుర్గా ప్రసాద్ ఓ కేసులో జప్తు చేసిన కారును విడుదల చేయడంతోపాటు ,స్టేషన్ బెయిల్ ఇవ్వడం, చార్జ్‌షీట్‌లో పేరు తొలగించేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. దాంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి నుంచి తొలి విడతగా రూ.1.80 లక్షలను కానిస్టేబుల్ ప్రేమ్ సునీల్‌కుమార్ ద్వారా తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సత్య హరి శ్రీనివాసరావు, కందుల దుర్గా ప్రసాద్, ప్రేమ్ సునీల్ కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గుంటూరు జిల్లాలో టిడ్కో ఇళ్ల పంపిణీ

- టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంత పేదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 53,296 ఇళ్లను లబ్ధిదారులకు అందించగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పొన్నూరులో 2,368, నరసరావుపేటలో 1,504 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం వీటిని మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా అందించనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. ఇళ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆయన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీఆర్డీఏ పరిధిలోని ఎనిమిది ప్రాంతాల్లో నిర్మించిన 5,024 టిడ్కో ఇళ్లను శుక్రవారం ముఖ్యమంత్రి లబ్ధిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

సీఆర్డీఏ టిడ్కో ఇళ్ల వద్ద చెట్ల పెంపకం:

ఏపీ సీఆర్డీఏ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పరిసరాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 26న ఈ ప్రాంతంలో 5,024 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించనున్న నేపథ్యంలో మంగళవారం గ్రీనింగ్ పనులపై కమిషనర్ వివేక్ యాదవ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వదినతో మరిది వివాహేతర సంబంధం..

- పరువుపోతుందని రైలు కిందపడి ఇద్దరూ బలవన్మరణం


శ్రీనివాసులు (ఫైల్)


రాములమ్మ (ఫైల్)

కంభం: వివాహేతర సంబంధం బయటపడి కుటుంబసభ్యులు మందలించడంతో పరువుపోతుందని భావించి రైలు కింద పడి వదిన, మరిది ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా కంభం మండలం సైదాపురం సమీపంలో జరిగింది. నంద్యాల రైల్వే ఎస్ఐ అబ్దుల్ జలీల్ తెలిపిన వివరాల మేరకు..పెద్దారవీడు మండలం బి.చెర్లోపల్లికి చెందిన పిక్కిలి రాములమ్మ (35)కు అదే గ్రామానికి చెందిన పిక్కిలి చలమయ్య పెద్ద కుమారుడు పిక్కిలి ఆంజనేయులుతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. గత మూడేళ్లుగా పిక్కిలి రాములమ్మకు ఆమె మరిది పిక్కిలి శ్రీనివాసులు (25)తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయాన్ని వారం క్రితం తెలుసుకున్న కుటుంబసభ్యులు అందరికీ తెలిస్తే కుటుంబం పరువు పోతుందని ఇద్దరినీ మందలించారు. శ్రీనివాసులకు రెండేళ్ల క్రితం దోర్నాల మండలం చింతల అగ్రహారంలో ఉన్న తన అక్క కూతురుతో వివాహమైంది. ఈ నేపథ్యంలో బ్యాంకులో పొదుపు డబ్బులు తీసుకొస్తానని సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చిన రాములమ్మతో కలసి శ్రీనివాసులు కంభం వెళ్లారు. మంగళవారం ఉదయం కంభంలో రైలు పట్టాల కింద తలపెట్టి ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇద్దరి తలలు మొండెం నుంచి తెగి పట్టాల మధ్యలో పడ్డాయి. రైలు పట్టాలకు సమీపంలో దుప్పటి, తాగిపడేసిన మద్యం సీసా, కూల్‌డ్రింక్ బాటిల్, ద్విచక్రవాహనం ఉన్నాయి. వీరిద్దరూ సోమవారం రాత్రి ఈ ప్రదేశానికి వచ్చి ఇక్కడే మద్యం సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

అదే తేదీల్లో మహా కుంభాభిషేకానికి ఆదేశాలివ్వలేం

- అందుకు తగిన సమయం లేదు
- ఇప్పటివరకు చేసిన ఖర్చు ఎంత?
- ఎవరిని సంప్రదించి వాయిదా వేశారో చెప్పండి
- పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయండి
- దేవాదాయ శాఖ, శ్రీశైలం దేవస్థానం ఈవోకు హైకోర్టు ఆదేశం
- ఈ వ్యవహారంలో కొన్ని ఆదేశాలు ఇస్తామన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి : శ్రీశైలం దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరగాల్సిన మహా కుంభాభిషేకాన్ని వాయిదా వేసిన నేపథ్యంలో, తిరిగి అదే తేదీల్లో నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. సమయం తక్కువగా ఉండటమే అందుకు కారణమని తెలిపింది. భక్తులు ఎక్కువగా వచ్చే కార్తీక మాసంలో మహా కుంభాభిషేకం ఆచరణ సాధ్యం కాదని అభిప్రాయపడింది. ఈ వ్యాజ్యంలో కొన్ని అంశాలపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంది. మహా కుంభాభిషేకాన్ని కొనసాగించేలా ఆదేశించాలంటూ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యంలో నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల కోసం ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఎవరిని సంప్రదించి వాయిదా వేశారు తదితర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖను, దేవస్థానం ఈవోను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

షెడ్యూల్ ప్రకారం మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలు జరిపేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారత వీరశైవ ధర్మిక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జస్టిస్ కృష్ణమోహన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. ఆగమ పండితులను సంప్రదించకుండానే మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను వాయిదా వేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పూజాదికాల్లో జోక్యం చేసుకునే అధికారం కమిషనర్‌కు లేదన్నారు. దేవదాయ శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది రజనీరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకునే మహా కుంభాభిషేకాన్ని వాయిదా వేశామన్నారు. విజయవాడలో నిర్వహించిన యజ్ఞానికి ఎండ తీవ్రత కారణంగా భక్తులు అనుకున్న స్థాయిలో రాలేదని, ఆ పరిస్థితి పునరావృతం కాకూడదనే దేవస్థానం అధికారులతో మాట్లాడి, కంచి పీఠాధిపతి అనుమతి తీసుకున్న తరువాతే కమిషనర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మహా కుంభాభిషేకానికి ప్రాథమిక ఏర్పాట్లు మాత్రమే జరిగాయని దేవస్థానం తరఫు న్యాయవాది రమణరావు కోర్టుకు నివేదించారు. వాయిదా వల్ల ఆర్థిక నష్టం ఏమీ జరగదన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా కార్యక్రమాన్ని వాయిదా వేశామే తప్ప, రద్దు చేయలేదని వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వ్యవహారంలో కొన్ని ఆదేశాలిస్తామంటూ నిర్ణయాన్ని వాయిదా వేసింది.

క్లుప్తంగా

ప్రధాని డిగ్రీ సర్టిఫికెట్ వివాదం...

కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ సర్టిఫికెట్‌పై చేసిన వ్యాఖ్యల కేసుకు సంబంధించి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌లకు గుజరాత్ కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై గుజరాత్ యూనివర్సిటీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో జూన్ 7న కోర్టు ఎదుట హాజరు కావాలంటూ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.జే.పాంచాల్ మంగళవారం సమన్లు పంపారు. గతంలో మే 23న హాజరు కావాలని కోర్టు సమన్లు జారీ చేసినా ఇరువురు నేతలు హాజరు కాలేదు. ప్రధాని విద్యార్హతల వివాదం సమయంలో గుజరాత్ యూనివర్సిటీ పరువు తీసేలా కేజ్రీవాల్, ఆప్ నాయకులు మాట్లాడారని, ట్విట్టర్లలో పోస్టులు పెట్టారన్న ఆరోపణలతో ఆ యూనివర్సిటీ కోర్టుకెక్కింది. మోదీకి డిగ్రీయే ఉంటే, అది నిజాయితీగా వచ్చిందే అయితే గుజరాత్ యూనివర్సిటీ ఆ సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వలేదు, బహుశా అది ఫేక్ అయి ఉంటుందంటూ అప్పట్లో కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

బెంగాల్‌లో 34,000 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, నిషేధిత బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలను చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న 100 మందిని అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు మంగళవారం వెల్లడించారు. మొత్తం 132 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 34,000 కిలోల పేలుడు పదార్థాలు, బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు.

కునో నేషనల్ పార్క్‌లో చీతా కూన మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో రెండు నెలల క్రితం జన్మించిన చీతా కూన మంగళవారం చనిపోయిందని అటవీ శాఖ తెలిపింది. దీంతో, ఆఫ్రికా దేశాల నుంచి తీసుకువచ్చిన వాటితో కలిపి రెండు నెలల కాలంలో మృతి చెందిన చీతాల సంఖ్య నాలుగుకు చేరింది. నమీబియా నుంచి తీసుకువచ్చిన చీతాల్లో ఒకటైన 'జ్వాల'కు మార్చిలో నాలుగు కూనలు పుట్టాయి. మంగళవారం తల్లితోపాటు మూడు కూనలు అటవీ ప్రాంతంలో తిరుగాడుతుండగా, నాలుగో కూన మాత్రం కదలకుండా ఉంది. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. కొద్ది సేపటికే చనిపోయింది' అని అటవీ శాఖ వివరించింది. ఈ కూన పుట్టినప్పటి నుంచి బలహీనంగానే ఉందని తెలిపింది. నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి తీసుకువచ్చిన చీతాల్లో మూడు గత రెండు నెలల్లో చనిపోవడం తెలిసిందే.

సివిల్స్‌లో నారీ భేరి

మొదటి నాలుగు ర్యాంకులు వారివే | **ఫస్ట్ ర్యాంకర్ ఇషితా కిశోర్** | **తెలుగు యువతి నూకల ఉమా హారతికి మూడో ర్యాంక్** | **టాప్-25 ర్యాంకర్లలో 14 మంది మహిళలు, 11 మంది పురుషులు** | **అర్హత సాధించిన 933 మంది అభ్యర్థులు**

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసెస్-2022 తుది ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. మొదటి నాలుగు ర్యాంకులను మహిళలే కైవసం చేసుకోవడం విశేషం. ఢిల్లీ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ ఇషితా కిశోర్ తొలి ర్యాంకు సాధించారు. గరీమా లోహియా, తెలుగు యువతి నూకల ఉమా హారతి, స్మృతీ మిశ్రా వరుసగా రెండు, మూడు, నాలుగో ర్యాంకు సొంతం చేసుకున్నారు. టాప్-25 ర్యాంకర్లలో 14 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నట్లు యూపీఎస్సీ ప్రకటించింది. ఈ పరీక్షలో మొత్తం 933 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరిలో 613 మంది పురుషులు, 320 మంది మహిళలు ఉన్నారు. సివిల్స్‌లో టాప్-3 ర్యాంకులు మహిళలే సాధించడం ఇది వరుసగా రెండో సంవత్సరం కావడం గమనార్హం. సివిల్స్-2021లో శృతి శర్మ, అంకితా అగర్వాల్, గామినీ సింగ్లా తొలి మూడు ర్యాంకులు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

మూడో ప్రయత్నంలో తొలి ర్యాంక్

ఈసారి సివిల్స్ తొలి ర్యాంకర్ ఇషితా కిశోర్ ఆప్షనల్ సబ్జెక్టుగా పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఎంచుకొని మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. ఆమె యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని శ్రీరామ్ కాలేజీ ఆఫ్ కామర్స్ నుంచి ఎకనామిక్స్(ఆనర్స్)లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. రెండో ర్యాంకర్ గరీమా లోహియా యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలోని కిరోరీమల్ కాలేజీ నుంచి కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ అభ్యసించారు. సివిల్స్‌లో కామర్స్ అండ్ అకౌంటెన్సీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నారు. రెండో ప్రయత్నంలో రెండో ర్యాంక్ సాధించారు. మూడో ర్యాంకర్ నూకల ఉమా హారతి ఐఐటీ-హైదరాబాద్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. ఆంత్రోపాలజీని ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంచుకున్నారు. ఐదో ప్రయత్నంలో మూడో ర్యాంక్ సొంతం చేసుకున్నారు. ఇక స్మృతీ మిశ్రా మూడో ప్రయత్నంలో నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. ఆమె ఢిల్లీలోని మిరండా హౌజ్ కాలేజీలో బీఎస్సీ చదివారు. జువాలజీ ఆప్షనల్ సబ్జెక్టుగా సివిల్స్‌లో జయకేతనం ఎగురవేశారు. ఐదో ర్యాంకర్ మయూర్ హజారికా తొలి ప్రయత్నంలోనే అనుకున్నది సాధించారు. అస్సాంకు చెందిన హజారియా ఎంబీబీఎస్ చదివారు.

ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి రాక

టాప్-25 ర్యాంకర్ల విద్యార్హతలను గమనిస్తే చాలా మంది ఐఐటీ, ఎన్ఐటీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి ఇంజనీరింగ్, హ్యుమానిటీస్, సైన్స్, కామర్స్, మెడికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారే ఉన్నారు. మెయిన్స్ పరీక్షలో ఎక్కువ మంది ఆంత్రోపాలజీ, కామర్స్ అండ్ అకౌంటెన్సీ, ఎకనామిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లా, హిస్టరీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఫిలాసఫీ, సోషియాలజీ, జువాలజీని ఆప్షనల్ సబ్జెక్టులుగా ఎంచుకున్నారు.

రిజర్వ్ లిస్టులో 178 మంది

అర్హత సాధించిన వారిలో 345 మంది జనరల్ కేటగిరీ, 99 మంది ఆర్థికంగా వెనుకబడిన తరగతి(ఈడబ్ల్యూఎస్), 263 మంది ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీ), 154 మంది షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), 72 మంది షెడ్యూల్డ్ తెగల(ఎస్టీ) వర్గానికి చెందినవారున్నారు. 178 మంది అభ్యర్థులను రిజర్వ్ జాబితాలో చేర్చినట్లు యూపీఎస్సీ తెలియజేసింది. మొత్తం విజేతల్లో 41 మంది దివ్యాంగులు ఉన్నారు.



ఫస్ట్ ర్యాంకర్ ఇషితకు మిఠాయి తినిపిస్తున్న కుటుంబసభ్యులు

నా కల నెరవేరింది

సివిల్స్‌లో తొలి ర్యాంకు సాధించడం ద్వారా నా కల నెరవేరింది. ఐఏఎస్ అధికారిగా మహిళా సాధికారత కోసం, అణగారిన వర్గాల సంక్షేమ కోసం కృషి చేస్తా. మొదటి ర్యాంకు లభించడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు తొలుత నా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేయాలి. సివిల్స్‌లో మొదటి రెండు ప్రయత్నాలు విఫలమైనప్పటికీ వారు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. మెరుగైన ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో ప్రతిరోజూ 8 గంటల నుంచి 9 గంటల పాటు చదివాను. నా కఠోర శ్రమకు ఈ ఫలితం దక్కిందని భావిస్తున్నా. నా ప్రాధాన్యత ఉత్తర ప్రదేశ్ క్యాడర్. ఈసారి సివిల్స్‌లో మొదటి నాలుగు ర్యాంకులు మహిళలు సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది

- ఇషితా కిశోర్, సివిల్స్ ఫస్ట్ ర్యాంకర్

15 రోజుల్లోగా మార్కుల వివరాలు

యూపీఎస్సీ వెబ్‌సైట్ http//www.upsc.gov.in ద్వారా ఫలితాలు, సివిల్స్ విజేతల వివరాలు తెలుసుకోవచ్చు. అభ్యర్థులకు ఏదైనా సమాచారం కావాలంటే 011- 23385271/ 23381125/ 23098543 ఫోన్ నంబర్ల ద్వారా పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా సంప్రదించవచ్చని యూపీఎస్సీ సూచించింది. సివిల్స్-2022లో అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలియజేసింది.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను గత ఏడాది జూన్ 5న నిర్వహించారు. 11,35,697 మంది దరఖాస్తు చేసుకోగా, 5,73,735 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 13,090 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మెయిన్స్ పరీక్షలో 2,529 మంది అభ్యర్థులు పర్సనాలిటీ టెస్టు(ఇంటర్వ్యూ)కు ఎంపికయ్యారు. తుది ఫలితాల్లో 933 మంది అర్హత సాధించారు.

టాప్-10 ర్యాంకర్లు

ర్యాంకు	విజేత
1	ఇషితా కిశోర్
2	గరీమా లోహియా
3	నూకల ఉమా హారతి
4	స్మృతీ మిశ్రా
5	మయూర్ హజారికా
6	గహన నవ్యా జేమ్స్
7	వసీం అహ్మద్ భట్
8	అనిరుధ్ యాదవ్
9	కనికా గోయల్
10	రాహుల్ శ్రీవాస్తవ

రెండో ర్యాంకు ఊహించలేదు

''సివిల్స్ సాధించాలన్నది నా చిన్నప్పటి కల. ఏకంగా రెండో ర్యాంకు సాధిస్తానని ఊహించలేదు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించా. ఈ ప్రయాణంలో మా అమ్మ, కుటుంబ సభ్యులు నాకు తోడుగా నిలిచారు. ప్రిపరేషన్ నిరంతరం కాకుండా మధ్యలో అప్పుడప్పుడు విరామం ఇచ్చా. బంధుమిత్రులను కలుసుకున్నా. స్ఫూర్తి, సొంతంగా చదుకోవడం, విశ్లేషణతో ఎవరైనా పరీక్షల్లో విజయం సాధించవచ్చు. సరైన మార్గనిర్దేశం కూడా అవసరమే. పెద్ద నగరంలో ఉంటున్నామా, చిన్న పట్టణంలో ఉంటున్నామా అనేది సమస్య కాదు. ఇంట్లో ఉండి చదువుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. సర్వీసులో చేరాక మహిళాభివృద్ధి, యువత సంక్షేమం కోసం పనిచేస్తా''

- గరీమా లోహియా, సివిల్స్ రెండో ర్యాంకర్

విజేతలకు మోదీ అభినందనలు

సివిల్స్-2022 విజేతలకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. దేశానికి సేవలందించే అవకాశం రావడం, ప్రజల జీవితాన్ని సానుకూల మార్పును తీసుకొచ్చే అదృష్టం లభించడం గొప్ప విషయమంటూ ట్వీట్ చేశారు. విజయం సాధించలేకపోయినవారు నైపుణ్యాలను, బలాలను ప్రదర్శించేందుకు దేశంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. ర్యాంకర్లకు కేంద్ర మంత్రులు అమిత్ షా, జితేంద్ర సింగ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.



హెడ్ కానిస్టేబుల్‌కు 667వ ర్యాంక్

ఢిల్లీ పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రామ్‌భజన్ కుమార్ సివిల్స్‌లో 667వ ర్యాంకు సాధించి, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆయన వయసు 34 ఏళ్లు. ఎనిమిదో ప్రయత్నంలో ర్యాంకు సాధించడం గమనార్హం. ప్రస్తుతం సైబర్ సెల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. సివిల్స్ ఫలితాలు వెలువడిన తర్వాత రామ్‌భజన్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచరులు, సీనియర్ అధికారులు ఆయనను అభినందించారు. ఓబీసీ కేటగిరీకి చెందిన రామ్‌భజన్‌కు తొమ్మిది సార్లు సివిల్స్ రాసేందుకు అనుమతి ఉంది. ఎట్టకేలకు ర్యాంకు సాధించడం ద్వారా తన కల నెరవేర్చుకున్నానని ఆయన చెప్పారు. ఒకవేళ ఈసారి విఫలమైనా తొమ్మిదోసారి పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇప్పటిదాకా ఏడు ప్రయత్నాలు సఫలం కాకపోయినా నిరాశ పడలేదని అన్నారు. తన భార్య అందించిన అండదండలతో ముందుకు సాగానని వివరించారు. తాను రాజస్తాన్ నుంచి వచ్చానని, అక్కడ తన తండ్రి కూలీగా పనిచేస్తున్నాడని వెల్లడించారు. కష్టాల్లోనే పుట్టి పెరిగానని పేర్కొన్నారు. అంకితభావం, కఠోర శ్రమ, సహనంతో అనుకున్న లక్ష్యం సాధించడం సులువేనని సూచించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2019లో యూపీఎస్సీ పరీక్షలో ర్యాంకు సాధించిన ఫిరోజ్ ఆలం తనకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. రామ్‌భజన్ 2009లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు.

నమ్మకమే పునాది



వేద పండితుల ఆశీర్వచనాలు, ఆస్ట్రేలియా మూలవాసుల సంప్రదాయ పద్ధతుల్లో మోదీ, అల్బనీస్‌లకు వేదికపైకి స్వాగతం

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం: మోదీ

కిక్కిరిసిన సిడ్నీ ఇండోర్ స్టేడియం

20 వేల మందికి పైగా హాజరు

ఆద్యంతం మోదీ నినాదాలే

ఆస్ట్రేలియా ప్రధాని విస్మయం



ఫోన్ టార్చ్‌లైట్లను వెలిగించి మోదీకి సభికుల అభివాదం

సిడ్నీ: పరస్పర నమ్మకం, గౌరవాలే మూలస్తంభాలుగా భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు నానాటికీ బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. మంగళవారం సిడ్నీలోని కుడోస్ బ్యాంక్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలోని అతి పెద్ద ఇండోర్ స్టేడియాల్లో ఒకటైన 20 వేల మంది సామర్థ్యమున్న ఎరీనా పూర్తిగా కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో 21 వేల మందికి పైగా పాల్గొన్నారు. సభికులంతా 'మోదీ, మోదీ' నినాదాలతో ప్రధానికి ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రసంగం పొడవునా పదేపదే అవే నినాదాలతో హోరెత్తించారు. మోదీ మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో వ్యూహాత్మక భాగస్వామ్యం నానాటికీ బలోపేతమవుతోందన్నారు. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపునకు మించి పెరుగుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. ''భారత-ఆస్ట్రేలియా మధ్య భౌగోళికంగా చాలా దూరమున్నా హిందూ మహాసముద్రం రెండింటినీ నిరంతరం కలిపే ఉంచుతోంది. ఇరు దేశాల బంధాలకు ఒకప్పుడు '3సి'లు (కామన్వెల్త్, క్రికెట్, కర్రీ) ప్రతీకగా ఉండేవి. తర్వాత '3డి'లు (డెమొక్రసీ, డయాస్పొరా, దోస్తీ)గా మారింది. ఇప్పుడది '3ఇ'లు (ఎనర్జీ, ఎకానమీ, ఎడ్యుకేషన్)గా రూపాంతరం చెందింది. ఇరు దేశాల బంధాల్లోని గాఢత ఈ నిర్వచనాలన్నింటినీ ఎప్పుడో అధిగమించింది. క్రికెట్ అయితే ఎన్నో దశాబ్దాలుగా కలిపి ఉంచుతూ వచ్చింది. కొన్నేళ్లుగా ఈ జాబితాలో యోగా కూడా చేరింది'' అని సభికుల హర్షధ్వానాల మధ్య చెప్పుకొచ్చారు. ఇందులో ఆస్ట్రేలియాలోని భారత సంతతి పాత్ర అత్యంత కీలకమని ప్రశంసలు గుప్పించారు. లెగ్ స్పిన్ మాంత్రికుడు, లెజెండరీ క్రికెటర్ షేన్ వార్న్ అకాల మరణం పాలైనప్పుడు లక్షలాది మంది భారతీయులు అత్యంత ఆప్తున్ని కోల్పోయామంటూ దుఃఖించారని గుర్తు చేశారు. బ్రిస్బేన్‌లో త్వరలో భారత కాన్సులేట్‌ను ప్రారంభిస్తామని ప్రకటించారు. బుధవారం మోదీ, అల్బనీస్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

ప్రపంచ శక్తిగా భారత్

భారత్ నేడు ప్రపంచమంతటికీ ఓ సానుకూల శక్తిగా ఎదిగిందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఎక్కడ ఎలాంటి విపత్తు జరిగినా సాయానికి అందరికంటే ముందు నిలుస్తూ వస్తోందన్నారు. ఇటీవలి తుర్కియే భూకంప బాధితులను ఆపరేషన్ దోస్త్ ద్వారా ఇతోధికంగా ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ''ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తళుకులీనుతున్న తారగా భారత్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధి అభివర్ణించింది. ప్రపంచ మాంద్యం పరిస్థితులను సమర్థంగా తట్టుకుంటున్న దేశమేదైనా ఉందంటే అది భారతేనని ప్రపంచ బ్యాంకు కూడా చెప్పింది. ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువ సంఖ్యలో యువత ఉన్న దేశం కూడా భారతే'' అన్నారు.

భారత యాత్రాస్మృతిలోకి జారుకున్న అల్బనీస్

ఇటీవలి భారత పర్యటన తాలూకు మధుర స్మృతులు తన మనసులో ఇంకా తాజాగానే ఉన్నాయన్నారు. ''గుజరాత్‌లో హోలీ వేడుకలు, ఢిల్లీలో మహాత్మా గాంధీకి నివాళులు, అహ్మదాబాద్ స్టేడియంలో దాదాపు లక్ష మంది అభిమానుల అభివాదం స్వీకరించడం అన్నీ అద్భుత జ్ఞాపకాలే. 1991లో 28 ఏళ్ల యువకునిగా ఐదు వారాల పాటు భారత్‌లో కలియదిరిగా. ఎక్కడికి వెళ్లినా ఇరు దేశాల ప్రజల మధ్య పెనవేసుకున్న గాఢానుబంధాన్ని గమనించా'' అని చెప్పారు. నిజమైన భారత్‌ను అర్థం చేసుకోవాలంటే దేశమంతా రైళ్లో, బస్సుల్లో విస్తృతంగా కలియదిరగాలని అల్బనీస్ అభిప్రాయపడ్డారు.

సిడ్నీలో 'లిటిల్ ఇండియా'

పశ్చిమ సిడ్నీలో భారతీయులు ఎక్కువగా ఉండే హారిస్ పార్కుకు 'లిటిల్ ఇండియా' అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ నామకరణం చేశారు. ఇదో గొప్ప గౌరవమంటూ మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అల్బనీస్‌ను హారిస్ పార్క్‌కు తీసుకెళ్లి భారతీయ వంటకాలు, ముఖ్యంగా అక్కడ బాగా ఫేమస్ అయిన చాట్, జిలేబీ రుచి చూపించాలని స్థానిక భారతీయులకు సూచించారు. కోవిడ్ కష్టకాలంలో ఆస్ట్రేలియాలో స్థానిక గురుద్వారాలు గొప్పగా సేవలందించాయని ఆయన అన్నారు.

మోదీ ఓ రాక్‌స్టార్

సిసలైన బాస్: ఆల్బనీస్

తమ దేశంలో మోదీకి దక్కుతున్న అపూర్వ ఆదరణను కళ్లారా చూసి ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ అక్షరాలా అచ్చెరువొందారు. మోదీ వేదికపైకి రాగానే ఆయన్ను ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. 'ప్రపంచంలో ఎక్కడికెళ్లినా రాక్‌స్టార్ తరహాలో అపూర్వ స్వాగతం పొందే అత్యంత పాపులర్ నాయకుడు' అంటూ మిన్నంటిన హర్షధ్వానాల మధ్య సభికులకు పరిచయం చేశారు! ''ప్రఖ్యాత అమెరికా సింగర్ బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ కూడా 2017లో ఇక్కడికొచ్చారు. ఇప్పుడు మోదీకి లభించినంత ఆదరణ ఆయనకు కూడా దక్కలేదు. మోదీ నిజమైన బాస్'' అంటూ ఆకాశానికెత్తారు. స్ప్రింగ్‌స్టీన్‌ను అభిమానులు బాస్ అని ముద్దుపేరుతో పిలుచుకుంటారు! ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం తాలూకు స్ఫూర్తిని ఆస్ట్రేలియాకు వెంట తెచ్చినందుకు మోదీకి కృతజ్ఞతలని ఆల్బనీస్ అన్నారు. ఇంత భారీ సంఖ్యలో భారతీయులు ఆస్ట్రేలియాను తమ సొంతిల్లుగా మార్చుకున్నందుకు వారిని చూసి గర్వపడుతున్నానన్నారు. అంతకుముందు ప్రధానులిద్దరికీ వేదిక వద్ద వేదమంత్రాలు, ఆస్ట్రేలియా మూలవాసుల సంప్రదాయ పద్ధతుల్లో ఘనస్వాగతం లభించింది. ఆస్ట్రేలియాతో బంధాలను దృఢతరం చేయడంలో కీలకపాత్ర పోషించాలని భారతీయ ప్రముఖులను మోదీ కోరారు.

సిసోడియా పట్ల పోలీసుల దురుసుతనం: ఆప్



సిసోడియాను లాక్కెళ్తున్న పోలీసు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆవరణలో మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆప్ ఆరోపించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జుడీషియల్ కస్టడీలో ఉన్న సిసోడియాను పోలీసులు మంగళవారం కోర్టుకు తీసుకువచ్చారు. కస్టడీని జూన్ ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. అనంతరం తీసుకెళ్తుండగా సిసోడియా మీడియాతో మాట్లాడేందుకు యత్నించారు. పోలీసులు ఆయన్ను బలవంతంగా మెడపట్టి లాక్కెళ్లారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలు దీన్ని ఖండించారు. ఆప్ విమర్శలను తప్పుడు ప్రచారంగా ఢిల్లీ పోలీసు శాఖ పేర్కొంది. ''కస్టడీలో ఉండగా మీడియాకు స్టేట్‌మెంట్లివ్వడం చట్ట విరుద్ధం. ఈ ఘటనలో పోలీసు అధికారి నుంచి అలాంటి స్పందన సహజమే'' అంటూ ట్వీట్ చేసింది.

కేంద్ర ఆర్డినెన్స్‌పై పోరులో మీ వెంటే మేం

కేజ్రీవాల్‌కు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హామీ

కోల్‌కతా: దేశ రాజధానిలో పరిపాలనా సర్వీసులపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు అధికారాలు కట్టబెడుతూ కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై పోరులో సీఎం కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. కేజ్రీవాల్ మంగళవారం పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో కలిసి కోల్‌కతాలో మమతతో గంటపాటు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్‌పై రాజ్యసభలో ప్రవేశపెట్టే బిల్లును 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా కేజ్రీవాల్ అభివర్ణించారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటే ఏర్పడేది డబుల్ ఇంజన్ సర్కారు కాదని, ట్రబుల్ ఇంజన్ ప్రభుత్వమని మమత ఎద్దేవా చేశారు. ఆర్డినెన్స్‌పై బిల్లుకు రాజ్యసభలో వ్యతిరేకంగా ఓటేయాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. 'కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహా అయితే ఆరు నెలలు మాత్రమే అధికారంలో ఉంటుంది. అద్భుతమేదైనా జరిగితే ఈలోగానే గద్దెదిగుతుంది'అని మమత పేర్కొన్నారు.



రాహుల్ లారీ ప్రయాణం

రాహుల్ కూచున్నది ఎక్కడో తెలుసా? ఓ లారీ క్యాబిన్లో! లారీ డ్రైవర్ల సమస్యలు తెలుసుకోవడానికి ఢిల్లీ నుంచి చండీగఢ్ వరకు సోమవారం రాత్రంతా ఆయన ఇలా లారీలో ప్రయాణించారు. మధ్యలో ధాబాలో డ్రైవర్లతో మాట్లాడారు. సంబంధిత వీడియోను కాంగ్రెస్ ట్వీట్ చేసింది. దేశవ్యాప్తంగా 90 లక్షల మంది లారీ డ్రైవర్ల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ కొంతకాలంగా విమర్శిస్తోంది.

పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించనున్న విపక్షాలు!

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీయే ప్రారంభిస్తే ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని యోచిస్తున్నట్లు సమాచారం. కొత్త భవనాన్ని ఈ నెల 28న లాంఛనంగా ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. నూతన భవన ప్రారంభోత్సవానికి తాము హాజరు కావడం లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ నేతలు ఇప్పటికే ప్రకటించారు. ఈకార్యక్రమాన్ని బహిష్కరించాలని, దీనిపై అతిత్వరలో ఒక ఉమ్మడి ప్రకటన జారీ చేయాలని పలు భావసారూప్యం కలిగిన ప్రతిపక్షాలు భావిస్తున్నట్లు సమాచారం. బుధవారం తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. పార్లమెంట్ అనేది కేవలం ఒక భవనం కాదని, దేశ ప్రజాస్వామ్యానికి అది పునాది అని తృణమూల్ కాంగ్రెస్ నేత, ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ చెప్పారు. ఇది ప్రధాని మోదీ సొంత వ్యవహారం కాదని అన్నారు. 2020 డిసెంబర్‌లో కొత్త పార్లమెంట్ నిర్మాణ శంకుస్థాపన పనులను ప్రతిపక్షాలు బహిష్కరించాయి.



మెక్సికో దేశంలోని పెబ్లా రాష్ట్రంలోని పోపోక్యాటిపెటెల్ అగ్నిపర్వతమిది. సోమవారం బద్దలై పెద్దమొత్తంలో లావా, దుమ్ము ధూళిని వెదజల్లినప్పుడు తీసిందీ ఫొటో.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం । 24 । మే । 2023

కరుముత్తు కన్నన్ కన్నుమూత

సాక్షి, చెన్నై: విద్యావేత్త, ఆధ్యాత్మిక సేవకుడు, మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ ట్రస్టీ కరుముత్తు కన్నన్ (71) మంగళవారం కన్ను మూశారు. గత కొంతకాలంగా వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆయన బాధ పడుతున్నారు. ఈ మరణ సమాచారం తెలియడంతో మంత్రులు ఉదయ నిధి స్టాలిన్, పళని వేల్ త్యాగరాజన్ తదితరులు మంగళవారం మదురైలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. అనంతరం ఆయన భౌతిక కాయానికి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఇక సీఎం స్టాలిన్ తన సంతాపాన్ని సందేశాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం కరుముత్తు కన్నన్ భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

రూ. 1.8 కోట్ల విలువైన బంగారం సీజ్

తిరువొత్తియూరు: చెన్నై ఎయిర్ పోర్టులో రూ.1.8 కోట్ల విలువైన రెండు కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై మీనంబాకం అంతర్జాతీయ విమానాశ్రయానికి విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో కొందరు అక్రమంగా బంగారం, ఇతర వస్తువులు తరలించడంపై అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో శ్రీలంక నుంచి చెన్నైకి వచ్చిన విమానంలో సింహళానికి చెందిన నలుగురు మహిళలను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. వారు లోదుస్తులలో దాచిన 80.42 లక్షల విలువైన 1.48 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే అబుదాబి నుంచి చెన్నైకి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.28 లక్షలు విలువైన 518 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు నిందితులందరినీ అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు.

వీధి కుక్కలకు ఆహారం అందించేందుకు ప్రత్యేక స్థలం

– చెన్నై కార్పొరేషన్ నిర్ణయం

కొరుక్కుపేట: వీధి కుక్కలకు ఆహారం అందించడం కోసం ప్రత్యేక స్థలాన్ని కార్పొరేషన్ అధికారులు మంగళవారం కేటాయించారు. వివరాలు.. చెన్నైలో లక్షకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. ఇటీవల చెన్నై కార్పొరేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం వీధికుక్కలకు సంబంధించినవే. నివాస ప్రాంతాల్లో శునకాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 1913ను కార్పొరేషన్ తీసుకుని వచ్చింది. దీని ద్వారా రోజుకు సగటున 80 ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఫిర్యాదుల్లో చాలా వరకు జంతు ప్రేమికులు తమ నివాసాల వద్ద కుక్కలకు ఆహారం అందిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలకు సమస్యలు రాకుండా వీధి కుక్కలకు ఆహారం ఇవ్వడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. దీనికి సంబంధించి చెన్నై కార్పొరేషన్ అధికారులు జంతు సంరక్షణ వలంటీర్లతో చర్చా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రత్యేక స్థలం వివరాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఎల్జీ తమిళిసైకు వ్యతిరేకంగా నిరసన

- ద్రవిడ విడుదలై కళగం నాయకుల అరెస్టు

సాక్షి, చెన్నై: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వ్యతిరేకంగా మంగళవారం ద్రవిడ విడుదలై కళగం నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. రాజ్ నివాస్ వైపుగా ర్యాలీగా వెళ్లిన ఈ కళగం నాయకులను పుదుచ్చేరి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పుదుచ్చేరి ప్రజలకు వ్యతిరేకంగా ఎల్జీ పనితీరు ఉందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందనివ్వకుండా చేస్తున్నారని, ఆమె పుదుచ్చేరిని వీడి వెళ్లి పోవాలని నినాదిస్తూ ద్రవిడ విడుదలై కళగం నేతృత్వంలో పుదుచ్చేరిలో ఉదయం నిరసన చేపట్టారు. ఎల్జీకి వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలతో హోరెత్తించారు. రాజ్ నివాస్ ముట్టడికి యత్నించారు. ర్యాలీగా వచ్చిన ఈ కళగం నిర్వాహకులను పోలీసులు మార్గం మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సమయంలో వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. చివరకు నిరసనకారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. సాయంత్రం వరకు అక్కడి ఓ కమ్యూనిటీ సెంటర్‌లో ఉంచారు. ఆ తర్వాత సొంత పూచీకత్తుపై నిరసన కారులను విడుదల చేశారు. అయితే ఎల్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేసిన కళగం నాయకులపై మాత్రం కేసులు నమోదయ్యాయి.

ఆన్‌లైన్‌లో మరో 42 సేవలు

సాక్షి, చెన్నై : ప్రభుత్వ రంగ సేవలన్నీ ఆన్‌లైన్ మయం అవుతూ వస్తున్న విషయం తెలిసిందే. సోమవారం నుంచి గ్రామ పంచాయతీలలో సైతం అన్ని రకాల సేవలను ఆన్‌లైన్ చేశారు. ఈ పరిస్థితుల్లో రవాణ శాఖ పరిధిలోని ఆర్టీఏ కార్యాలయాలలో ఇకపై అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ కానున్నాయి. దీంతో బ్రోకర్లను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. అలాగే అధికారులను కలిసి విన్నవించుకోవాల్సిన పని లేకుండా ఆన్‌లైన్ ద్వారా 42 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో 22 రకాల సేవలు కండక్టర్లు, డ్రైవర్ల నియామకం తదితర అంశాలకు చెందినవి ఉన్నాయి. మిగిలినవి ఎల్ఎల్ఆర్, లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, చిరునామాల మార్పు, ఫోన్‌నంబర్ల అనుసంధానం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే సమయంలో వాహనాలకు అనుమతులు తదితర అన్ని రకాల సేవలు ఉన్నాయి. ఈ పనులను మంగళవారం రవాణా మంత్రి శివశంకర్ పరిశీలించారు. మరో వారంలోపు ఇవి అమల్లోకి రానున్నట్లు అధికారులు వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: మీంజూరుపట్టి సమీపంలో కడుపు నొప్పి తాళలేక మంగళవారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. అరియలూరు జిల్లా మీంజూరు పట్టి సమీపంలోని వెదయా ర్పెట్టు మేలతెరులో నివాసం ఉంటున్న విశ్వలింగం భార్య జయచిత్ర (45). కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. మీంజూరుపట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా తన విదేశీ పర్యటన సాగనున్నదని సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. మంగళవారం చెన్నై నుంచి ఆయన సింగపూర్‌కు బయలు దేరి వెళ్లారు. తర్వాత జపాన్‌లోనూ పర్యటించనున్నారు. తన 9 రోజుల టూర్ తర్వాత ఈనెల 31వ తేదీ రాత్రి చెన్నైకు రానున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్



పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటన

- సింగపూర్‌కు వెళ్లిన సీఎం స్టాలిన్
- తర్వాత జపాన్‌కు..
- అందర్నీ కలుస్తా.. పెట్టుబడులతో వస్తానని ప్రకటన

సాక్షి, చెన్నై: వచ్చే జనవరిలో చెన్నై వేదికగా ప్రపంచ స్థాయి పెట్టుబడి దారుల మహానాడును చెన్నైలో నిర్వహించాలని డీఎంకే ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ మహానాడుకు దేశ విదేశాలలోని పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు సీఎం స్టాలిన్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం నుంచి తన విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఆయా దేశాలకు స్వయంగా వెళ్లి పెట్టుబడిదారులను ఆహ్వానించే విధంగా తొలి పర్యటనగా సింగపూర్, జపాన్‌లను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజ నేతృత్వంలోని అధికారుల బృందం సింగపూర్, జపాన్‌లోని టోక్యో, ఒసాకా నగరాలలో పెట్టుబడి దారులను ఆకర్షించే విధంగా సభలు, సమావేశాలకు ఏర్పాట్లు చేసింది.

చెన్నై నుంచి..

మంగళవారం ఉదయం సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనకు బయలు దేరి వెళ్లారు. ఆయనకు విమానాశ్రయంలో డీఎంకే వర్గాలు, మంత్రులు దురై మురుగన్, నెహ్రూ, శేఖర్‌బాబు, ఎం సుబ్రమణియన్, సెంజి మస్తాన్, అన్బరసన్ , పొన్ముడి, ఏవీ వేలు తదితరులు, ఎంపీలు టీఆర్‌బాలు, ఎ. రాజ తదితరులు వీడ్కోలు పలికారు. పర్యటన విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఎప్పుడూ తెల్ల పంచె, చొక్కతో కనిపించిన సీఎం స్టాలిన్ ఈసారి ఫార్మల్ ప్యాంట్, షర్ట్, కళ్లజోడుతో విదేశీ పర్యటనకు వెళ్లడం గమనార్హం. అందరికీ అభివాదం చేస్తూ 11.25 గంటలకు చెన్నై నుంచి సింగపూర్ విమానంలో విదేశీ పర్యటనకు బయలు దేరారు.

9 రోజుల పర్యటన

2030–31 నాటికి తమిళనాడు ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ యూఎస్ డాలర్ల స్థాయికి చేర్చడం లక్ష్యంగా సీఎం ప్రత్యేక కార్యాచరణతో దూసుకెళ్తున్నారు. తమిళనాడులో దేశ విదేశాలకు చెందిన అనేక సంస్థలు ఇప్పటికే పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి ఉన్న నేపథ్యంలో, తన లక్ష్యాన్ని చేరేందుకు మరో 23 లక్షల కోట్లు అవశ్యమని సీఎం గుర్తించారు. అలాగే 46 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా నిర్ణయించారు. ఇంత పెద్ద మొత్తాన్ని తమిళనాడులోకి ఆహ్వానించేందుకు తానే రంగంలోకి దిగి ఉన్నట్టు ఇప్పటికే ఓ ప్రకటనలో వివరించారు. తమిళనాడులో అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్నాయని, రోడ్డు, ఆకాశం, సముద్ర మార్గాలు మరింత అందుబాటులో ఉన్నాయని వివరించారు. తమిళనాడులోని పలు జిల్లాలో పారిశ్రామిక వాడల ఏర్పాటుతో పాటుగా ఇక్కడ విదేశీ సంస్థలకు స్థలాల కేటాయింపు, పరిశ్రమలు పెట్టేందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి ప్రత్యేక రాయితీలు, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక పాలసీలను, ప్రభుత్వ అనుమతులను మరింత సులభతరం చేసి ఉన్నట్టు పేర్కొన్నారు. సింగపూర్‌లో పలు సంస్థలు పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందాలకు సిద్ధమైన ఉన్నట్టు వివరించారు. జపాన్‌లోని మరిన్ని అగ్ర శ్రేణి కంపెనీలు తమిళనాడు పాలసీలను ఇప్పటికే అధ్యయనం చేసి, సీఎంతో సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కేవలం సభలు, సమావేశాలే కాకుండా, ఆయా సంస్థల యాజమాన్యాలతో వ్యక్తిగత భేటీ, సింగపూర్ , జపాన్‌లలోని తమిళ సంఘాలు, తమిళ పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేక కార్యక్రమాలకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



ముఖ్యమంత్రికి వీడ్కోలు పలుకుతున్న నాయకులు

రెండేళ్లలో 2.95 లక్షల కోట్లు..

అంతకు ముందు విమానాశ్రయంలో సీఎం స్టాలిన్ మీడియాతో మాట్లాడారు. 2024లో జరిగే పెట్టుబడి దారుల సమావేశానికి విదేశాలలోని పెట్టుబడి దారులను తానే స్వయంగా ఆహ్వానించే విధంగా ఈ పర్యటనకు ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ దేశాలకు చెందిన వారందరినీ ఇక్కడకు ఆహ్వానిస్తామన్నారు. తొమ్మిది రోజుల తన పర్యటన సింగపూర్, జపాన్ దేశాలలో జరుగుతుందన్నారు. తనతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి, ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు విదేశీ పర్యటనకు బయలుదేరినట్టు వివరించారు. సభలు, సమావేశాలు, వ్యక్తిగత భేటీలతో రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద పారించడం లక్ష్యంగానే ఈ పర్యటన విజయవంతం చేస్తామన్నారు. గత ఏడాది మార్చిలో అరబ్ ఎమిరేట్స్ దేశాల పర్యటన సందర్భంగా అనేక అవగాహన ఒప్పందాలు జరిగాయని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చినానంతరం 2021 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలోకి రూ. 2.95 లక్షల కోట్ల పెట్టుబడులతో 226 ప్రాజెక్టులు తీసుకొచ్చినట్టు వివరించారు. తద్వారా 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నామని తెలిపారు. సింగపూర్, జపాన్ దేశాల నుంచి ఇక్కడకు పెట్టుబడులు పెట్టేందుకు మరెన్నో సంస్థలు ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. వందలాది సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలను కలవబోతున్నామని , ఈ పర్యటన విజయవంతం అవుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు.

16 జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం

- ఇకపై అన్ని వ్యవహారాలూ మంత్రుల పర్యవేక్షణలోనే..



సచివాలయం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో ప్రభుత్వ పథకాల అమలు, ఇతర వ్యవహారాల పర్యవేక్షణకు.. 16 జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులను నియమిస్తూ సీఎస్ ఇరై అన్బు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లాలలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం, అధికారులతో సమీక్షలు, సమావేశాలు, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు తదితర అన్ని రకాల వ్యవహారాలను ఇకపై వీరే చూస్తారని పేర్కొన్నారు. జిల్లాల అభివృద్ధితో పాటుగా తరచూ ఫీల్డ్ సర్వేలు నిర్వహించడం, నిరంతరం జిల్లాలో ఉంటూ ప్రజలకు సేవలు చేయడం వంటి కార్యక్రమాలను మంత్రులు నిర్వర్తించనున్నారు.

బాధ్యులు వీరే..

ఇది వరకు కృష్ణగిరి జిల్లా బాధ్యతలను నిర్వస్తూ వచ్చిన ఆర్. గాంధీకి తాజాగా తిరువళ్లూరు జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఇది వరకు ఈ జిల్లాకు ఇన్‌చార్జ్‌గా ఉన్న మంత్రి నాజర్ పదవి ఊడిన విషయం తెలిసిందే. తిరువారూర్ ఇన్‌చార్జ్‌గా ఉన్న మంత్రి చక్రపాణి, ఇకపై కృష్ణగిరి బాధ్యతలు నిర్వహిస్తారు. మైలాడుతురై, నాగపట్నం జిల్లాల ఇన్‌చార్జ్‌గా ఉన్నమంత్రి మెయ్యనాథన్ కేవలం మైలాడుతురైకు మాత్రమే పరిమితం అవుతారు. నాగపట్నం బాధ్యతలను మంత్రి రఘుపతికి అప్పగించారు. సేలం జిల్లా ఇన్‌చార్జ్‌గా కేఎన్ నెహ్రూ, తేనికి ఐ. పెరియస్వామి, తిరుపత్తూరు, కళ్లకురిచ్చికి ఏవీ వేలు, ధర్మపురికి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, తెన్ కాశికి కేకేఎస్ఎస్ ఆర్ రామచంద్రన్, రామనాథపురానికి తంగం తెన్నరసు, కాంచీపురానికి అన్బరసన్, తిరునల్వేలికి ఆర్ఎస్ రాజకన్నప్పన్, కోయంబత్తూరుకి సెంథిల్ బాలాజీ, పెరంబలూరుకి శివశంకర్, తంజావూరుకి అన్బిల్ మహేశ్‌ను ఇన్‌చార్జ్ మంత్రులగా నియమించారు. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

మెట్రోకు మెరుగులు

- రూ. 2,800 కోట్లతో పనులు
- ఆరు బోగీలతో రైలు
- స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు

సాక్షి, చెన్నై: చెన్నైలోని మెట్రో రైల్వే స్టేషన్లను ఆధునీకరించనున్నారు. రూ. 2,800 కోట్లతో ఈ పనులకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆరు బోగీలతో కూడిన రైలు సేవలు అందించాలని నిర్ణయించారు. వివరాలు.. చెన్నైలో ప్రస్తుతం విమానాశ్రయం – విమ్కో నగర్, సెయింట్ థామస్ మౌంట్ – సెంట్రల్ రైల్వే స్టేషన్ మధ్య మెట్రో రైలు సేవలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మార్గాల్లో పనులు, రైల్వే స్టేషన్ల తదితర నిర్మాణాలకు రూ. 14,600 కోట్లు వెచ్చించారు. 2010లో ఈ పనులు చేపట్టి 2019లో ముగించి రైలు సేవలు మొదలెట్టారు. అయితే, ఈ మార్గంలో తొలినాళ్లలో రోజుకు 10 వేల మంది మాత్రమే మెట్రో సేవలను పొందారు. అయితే, ప్రస్తుతం రోజుకు 2.5 లక్షల మంది మెట్రోను ఆశ్రయిస్తున్నారు. ఈ సంఖ్య ముందు మరింత పెరిగే అవకాశం ఉంది.

మరింత అభివృద్ధి..

పదేళ్ల క్రితం చేపట్టిన నిర్మాణాలు కావడంతో ప్రస్తుతం ఆయా రైల్వే స్టేషన్లు, సిగ్నలింగ్ వ్యవస్థ, రైలు బోగీల సేవలలో మరిన్ని మార్పులకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా రైల్వే స్టేషన్లలో వసతుల మెరుగు, ఆధునీకరణ తదితర పనులు, మరిన్ని నిర్మాణాల దిశగా కార్యాచరణ సిద్ధం చేశారు. అలాగే, ప్రస్తుతం 4 బోగీల రైలు జరుగుతోండడంతో, దీనిని ఆరు బోగీలుగా మార్చేందుకు తగ్గ చర్యలపై దృష్టి పెట్టారు. ఈ వ్యవహారాలన్నీ ప్రత్యేక సలహాదారు ద్వారా పరిశీలించి నివేదికను సిద్ధం చేసి ఉన్నారు. ఈ పనులకు రూ. 2,800 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వం దృష్టికి నివేదికను తీసుకెళ్లి పనుల ప్రక్రియపై దృష్టి పెట్టేందుకు మెట్రో అధికారులు సిద్ధమయ్యారు. రెండో దశలో మూడు మార్గాల పనులు ముగియగానే, ప్రయాణికుల సేవలు మరింత అధికం అయ్యే అవకాశాలు ఉండడంతో అంతలోపు పాత నిర్మాణాలను ఆధునీకరించే దిశగా అధికారులు ముందుకెళ్తున్నారు.



మెట్రో రైలు

కారును ఢీకొన్న లారీ

- బాలుడి మృతి
- ఒకే కుటుంబంలోని ఆరుగురికి తీవ్ర గాయాలు

అన్నానగర్: కడలూరులో మంగళవారం ఉదయం కారును లారీ ఢీ కొనడంతో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమారుడు మృతి చెందాడు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పుదుచ్చేరి మురుంగబాక్కంకు చెందిన మాయకన్నన్ (47). రియల్ ఎస్టేట్ వ్యాపారి చిదంబరం సమీపంలోని పిచ్చావరం టూరిస్ట్ స్పాట్‌కు కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం వెళ్లాడు. అతనితో పాటు భార్య సీతాలక్ష్మి (38), కుమారులు అరివుకరసు (12), అన్బుకరసు (8), చెల్లెలి కుమారుడు నీరజ్ (15), మరో చిన్న చెల్లెలి కుమారుడు రవీందర్ (15), మేనల్లుడు జైగణేష్ (14) కారులో వెళ్లారు. అక్కడ బోటు షికారులో గడిపి సాయంత్రం పుదుచ్చేరికి బయలుదేరారు. అయితే చిదంబరం – కడలూరు రహదారిలో కడలూరు సిప్‌కాట్ అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అనూహ్యంగా కారును ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో మాయకన్నన్ కుమారుడు అన్బుకర ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కడలూరు ముత్తునగర్ పోలీసులు గాయపడిన వారిని రక్షించి చికిత్స నిమిత్తం కడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి తీవ్ర చికిత్స అందిస్తున్నారు. అన్బుకరసు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. మృతి చెందిన అన్బుకరసు పుదుచ్చేరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతుండడం గమనార్హం. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. కడలూరు ముత్తునగర్ పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ప్రైవేటులోనూ తమిళం తప్పనిసరి

సాక్షి, చెన్నై: ప్రైవేటు విద్యాలయాలు, పాఠశాలల్లోనూ తమిళం సబ్జెక్టును తప్పనిసరి చేస్తూ విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ప్రత్యేకంగా సీబీఎస్ఈ స్కూల్స్‌లో తమిళం అమలు చేయాల్సిందే అనే ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్వచ్ఛమైన తమిళ భాషను విద్యార్థులు మాట్లాడే విధంగా విద్యాబోధన చేపట్టాలని పేర్కొన్నారు. తమిళంలో నిష్ణాతులైన అధ్యాపకులను నియమించుకోవాలని ఆదేశించింది. ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు, విద్యా లయాలలో తమిళం తప్పని సరిచేస్తూ గతంలో ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇతర భాషల విద్యార్థులు కూడా తప్పని సరిగా తమిళం నేర్చుకోవాలని స్పష్టం చేశారు. అయితే ప్రైవేటు విద్యాలయాల్లో ఈ విధానం సరిగా అమలు కావడం లేదన్న సమాచారం ప్రభుత్వానికి చేరింది. అనేక పాఠశాలలో విద్యార్థినులు ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ తదితర భాషలపై దృష్టి పెడుతున్నట్టు, తమిళంను మమా అనిపిస్తున్నట్లు తేలింది. అలాగే, ప్రైవేటు పాఠశాలు, సీబీఎస్ఈ తదితర పాఠశాలల్లోనూ తమిళానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఆంగ్లంపై అధికంగా దృష్టి సారించడాన్ని విద్యాశాఖ పరిగణనలోకి తీసుకుంది. విద్యార్థుల తమిళం మాట్లాడటమే కరువైనట్లు గుర్తించింది. దీంతో అన్ని పాఠశాలలో తమిళం తప్పని సరి చేశారు. ఇతర భాషలను విద్యార్థులు నేర్చుకుంటున్నప్పటికీ, తమిళం కూడా నేర్చుకోవాల్సిందే అనే ఆదేశాలు తాజాగా జారీ అయ్యాయి. అన్ని ప్రైవేటు పాఠశాలలో నిష్ణాతులైన తమిళ ఉపాధ్యాయుల నియామకం జరగాలని పేర్కొన్నారు. ఈ అంశం అమలు విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఘనంగా న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

- హైకోర్టులో 64కు చేరిన జడ్జీల సంఖ్య

సాక్షి, చెన్నై : మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య మంగళవారం 64కు చేరింది. మరో నలుగురు అదనపు న్యాయమూర్తులు ఉదయం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. వివరాలు.. మద్రాసు హైకోర్టులో కనీసం 70కి పైగా న్యాయమూర్తులు ఉండాల్సిన అవసరం ఉంది. అయితే గతంలో వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండేది. గత ఏడాది కాలంగా హైకోర్టులో న్యాయమూర్తుల పోస్టుల భర్తీ దిశగా సుప్రీంకోర్టు కొలీజియం చర్యలు తీసుకుంటూ వస్తోంది. అదే సమయంలో గత కొంతకాలంగా హైకోర్టుకు పూర్తి స్థాయిలో ప్రధాన న్యాయమూర్తి నియామకం కూడా జరగలేదు. ఈ బాధ్యతలను ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రాజ నిర్వర్తిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం జిల్లా న్యాయమూర్తులు నలుగురిని అదనపు న్యాయమూర్తులుగా హైకోర్టుకు నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి భవన్ ఆమోద ముద్ర వేసింది. దీంతో ఈ కొత్త న్యాయమూర్తు ప్రమాణ స్వీకారం మంగళవారం హైకోర్టు ఆవరణలో జరిగింది. ఇందులో జస్టిస్ ఆర్. శక్తివేల్, పి. ధనపాల్, సి. కుమరప్పన్, కె. రాజశేఖర్ ఉన్నారు. ఈ నలుగురు అదనపు న్యాయమూర్తులతో ఇన్‌చార్జ్ సీజే రాజ ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త అదనపు న్యాయమూర్తులకు సహచర న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ వర్గాలు, న్యాయవాద సంఘాల నేతలు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.



అదనపు న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఇన్‌చార్జి సీజే రాజ



శరత్‌బాబు భౌతికకాయం వద్ద విషణ్ణవదనంతో కుటుంబ సభ్యులు

శరత్‌బాబుకు కన్నీటి వీడ్కోలు

విలక్షణ నటుడు శరత్‌బాబు మృతి దక్షిణాది సినీ పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. మంగళవారం చెన్నై, టీ.నగర్‌లోని శరత్‌బాబు నివాసంలో ఆయన భౌతికాయానికి పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించారు. వీరిలో నటుడు రజనీకాంత్, సూర్య, కార్తీ, దర్శకుడు సురేశ్‌కృష్ణ, నటుడు భానుచందర్, శరత్‌కుమార్, రాధిక దంపతులు, నటి సుహాసిని మణిరత్నం, దర్శకుడు కె.భాగ్యరాజ్, పూర్ణిమ దంపతులు, నటుడు రాజేష్, ఆనంద్ తదితరులు ఉన్నారు. శరత్‌బాబుతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా శరత్‌బాబును చివరి చూపు చూడటానికి ఆయన అభిమానులు, భారీగా తరలి వచ్చారు. అనంతరం శరత్‌బాబు పార్థీవదేహాన్ని ఊరేగింపుగా శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. ఆయన మృతదేహానికి స్థానిక గిండీ శ్మశాన వాటికలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. – తమిళసినిమా



నివాళులర్పించేందుకు వస్తున్న నటుడు కార్తీ



మీడియాతో మాట్లాడుతున్న శరత్‌కుమార్, రాధిక, రజనీకాంత్, సుహాసిని, సూర్య

క్లుప్తంగా

తిరుచ్చి విమానాశ్రయంలో రూ. 84 లక్షల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో సోమవారం రాత్రి రూ.84 లక్షల విలువైన బంగారాని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుచ్చి విమానాశ్రయానికి సోమవారం మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి మలిండో విమానం చేరుకుంది. ఇందులోని ప్రయాణికులను సెంట్రల్ ఎయిర్ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓ ప్రయాణికుడి వద్ద 1,091 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.67 లక్షల 5 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే మరో ప్రయాణికుడి నుంచి 279 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.17 లక్షలు ఉంటుందన్నారు. కాగా ఇటీవల తిరుచ్చి విమానాశ్రయంలో బంగారం అక్రమ తరలింపు కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

తేయాకు తోటలో చిరుత కళేబరం

అన్నానగర్: మానంపల్లిలోని తేయాకు తోటలో మంగళవారం ఉదయం ఓ చిరుత కళేబరం కనిపించింది. దీనిపై అటవీశాఖ విచారణ జరుపుతోంది. కోయంబత్తూరు జిల్లా వాల్పారైలోని మానంపల్లి అటవీ ప్రాంత పరిధిలోని సెగల్‌మూడి ఎస్టేట్ తేయాకు తోటలో చిరుత మృతి చెందినట్లు అటవీ రేంజర్ మణికంఠకు మంగళవారం ఉదయం సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చిరుత కళేబరాన్ని ఉరుళికల్ ఎస్టేట్‌లోని అటవీశాఖ కార్యాలయా నికి తీసుకొచ్చారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ సెల్వం, ఫారెస్ట్ వార్డెన్ మణికంఠన్, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ కమిషన్ ప్రతినిధి గణేష్ రఘురామ్ నేతృత్వంలో ఆనైమలై టైగర్ రిజర్వ్ వెటర్నరీ ఆఫీసర్ విజయరాఘవన్ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఆడ చిరుత అని.. సుమారు 3 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. గొంతుకు బలమైన గాయం కావడం, శ్వాసనాళం పగిలిపోవడంతో చనిపోయినట్లు నిర్ధారించారు. శరీర భాగాలను ల్యాబొరేటరీ పరీక్షల నిమిత్తం తరలించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. మృతిపై అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా స్కూల్ బస్సుల పర్యవేక్షణ



పాఠశాల బస్సును తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: ప్రైవేటు పాఠశాల బస్సులను అతి వేగంగా నడపకుండా విద్యార్థులను జాగ్రత్తగా తీసుకెళ్లాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. కాట్పాడిలోని సన్‌బీమ్ పాఠశాల ఆవరణంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాల బస్సుల కండిషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భం మాట్లాడుతూ బస్సులలో విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో అతి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా బస్సులను కండిషన్‌గా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా పాఠశాల బస్సులను నడిపేందుకు సీనియర్ డ్రైవర్‌లను నియమించి ప్రతి బస్సుకూ క్లీనర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి బస్సులను నడిపే డ్రైవర్‌ల లైసెన్స్‌లను రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. బస్సులోని విద్యార్థులు ఎక్కిన అనంతరం క్లీనర్ సరి చూసుకొని బస్సును నడపాలన్నారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో ఎటువంటి ప్రమాదాలు జరగలేదని ఇదే పరిస్థితి కొనసాగేందుకు ప్రైవేటు బస్సు డ్రైవర్‌లు సహకరించాలన్నారు. అనంతరం పాఠశాల బస్సుల కండిషన్‌లు, బస్సులు టైర్లు, అద్దాలు, తలుపులు, సీట్లు, డ్రైవర్ లైసెన్స్, బస్సులో ప్రథమ చికిత్స బాక్సు, స్పీడు కండీషన్ తదితర వాటిని పరిశీలించారు. ప్రతి బస్సుకూ అత్యవసర ద్వారం ఉండడాలన్నారు. అదే విధంగా మంటలను అదుపు చేసే సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేలూరు డివిజన్ పరిధిలో ప్రైవేటు పాఠశాల, కళాశాలలకు చెందిన 250 బస్సులను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఆర్టీఓ వెంకటేశన్, డీఏస్పీలు తిరునావకరసు, పయణి, విద్యాశాఖ సీఈఓ మునస్వామి, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు కాళియప్పన్, మాణిక్యం, ప్రైవేటు పాఠశాల, కళాశాలలకు చెందిన డ్రైవర్‌లు పాల్గొన్నారు. అంతుకు ముందు బస్సు డ్రైవర్‌లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

వెలవెలబోతున్న బ్యాంక్‌లు



చెన్నైలోని ఆర్‌బీఐ కేంద్రంలో ఖాతాదారులు

- రిజర్వు బ్యాంక్ వద్ద ఖాతాదారుల క్యూ
- భారీగా రూ. 2 వేల నోట్ల మార్పిడి

సాక్షి, చెన్నై : రూ. 2 వేల నోట్ల మార్పిడి కోసం బ్యాంక్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే, బ్యాంక్‌లన్నీ వెలవెల బోయాయి. రిజర్వు బ్యాంక్ వద్ద మాత్రం జనం బారులు తీరి కనిపించారు. వివరాలు.. రూ. 2 వేల నోటును రద్దు చేస్తూ రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ నోట్లను తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంక్‌ల ద్వారా మార్చుకోవచ్చని రిజర్వు బ్యాంక్ ప్రజలకు ఊరట కలిగింది. ఇందు కోసం బ్యాంక్‌లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి అన్ని బ్యాంక్‌లలో రూ. 2 వేల నోట్ల మార్పిడి కోసం చర్యలు తీసుకున్నారు. అయితే, బ్యాంక్‌లన్నీ వెల వెల బోయాయి. పెద్ద సంఖ్యలో జనం బారులు తీరుతారని భావించి ఏర్పాట్లు చేసినా, ఆ మేరకు ఖాతాదారులు రాకపోవడం గమనార్హం.

ఇక, రాష్ట్రంలో అనేక ప్రైవేటు బ్యాంక్‌లు నోట్ల మార్పిడి కోసం వచ్చిన వారికి దరఖాస్తుల ఫాంలు ఇచ్చి పూర్తి చేయాలని సూచరించడం గమనార్హం. అయితే, ఎలాంటి వివరాలను తెలియజేయాల్సిన అవసరం లేదని రిజర్వు బ్యాంక్ పేర్కొన్నా, ప్రైవేటు బ్యాంక్‌లు వివరాలను సేకరించడం వివాదానికి దారి తీసింది. ఇక, చెన్నైలోని రిజర్వు బ్యాంక్ వద్ద ఉదయాన్నే జనం బారులు తీరి, తమ వద్ద ఉన్న నోట్లను మార్చుకున్నారు. ఒకొక్కరు రూ. 20 వేల వరకు తమ వద్ద ఉన్న రూ 2 వేల నోట్లను అందజేసి రూ. 500 నోట్లను తీసుకెళ్లారు.

కల్తీసారా కేసులో సీబీసీఐడీ కస్టడీ పిటిషన్

సాక్షి, చెన్నై: కల్తీ సారా కేసులో అరెస్టయిన నిందితులను కస్టడీకి తీసుకుని విచారించేందుకు సీబీసీఐడీ నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం విల్లుపురం కోర్టులో సీబీసీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. విల్లుపురం జిల్లా మరక్కానం సమీపంలోని ఎక్కియార్ కుప్పంలో కల్తీ సారా కారణంగా 15 మంది మరణించిన విషయం తెలిసిందే. మరో 40 మంది మేరకు ఆసుపత్రి పాలయ్యారు. ఈ కేసును సీబీసీఐడీ విచారిస్తోంది. ఇప్పటి వరకు 11 మందిపై కేసు నమోదు చేశారు. 12వ వ్యక్తిగా మరొకరిని అరెస్టు చేశారు. అయితే, ముందుగా అరెస్టయిన 11 మందిని తమ కస్టడీకి తీసుకుని విచారించాలని సీబీసీఐడీ నిర్ణయించింది. మూడు రోజుల పాటు తమ కస్టడీకి వీరి అప్పగించాలని కోరుతూ విల్లుపురం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, చెంగల్పట్టులో కల్తీ సారా మరణాల కేసును మరో సీబీసీఐడీ బృందం వేగవంతం చేసింది. అలాగే తంజావూరులో టాస్మాక్ బార్‌లో మద్యం తాగి ఇద్దరు మరణించిన వ్యవహారంపై విచారణకు ఐదు బృందాలు రంగంలోకి దిగాయి.

డీఎస్పీ రాజ పర్యవేక్షణలో ఈ బృందాలు విచారణను వేగవంతం చేశారు. ఆ ఇద్దరు తాగిన మద్యంలో సైనెడ్ కలిపి ఉండటాన్ని తీవ్రంగా పరిగణించి ఈ విచారణ పలు కోణాల్లో జరుగుతోంది. మృతులు కుప్పుస్వామి, వివేక్‌కు సన్నిహితంగా ఉన్న వారు, శత్రువుల జాబితాను సిద్ధం చేసి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మంగళవారం ఆ టాస్మాక్ బార్‌లో వేలి ముద్రల నిపుణుల బృందంతో పాటు చెన్నై నుంచి వచ్చిన పరిశోధక బృందం వివరాలు సేకరించింది.

కుమారుడిని కడతేర్చిన తండ్రి

అన్నానగర్: తాగుడుకు బానిసై ఇబ్బందులకు గురిచేస్తున్న కొడుకును కాళ్లు, చేతులు కట్టి బావిలో పడేసి సొంత తండ్రే హత్య చేయడం మేలూరులో మంగళవారం కలకలం రేపింది. మదురై జిల్లా మేలూరు సమీపంలోని కొత్తకుడికి చెందిన పెరుమాళ్ అలియాస్ రవి (55) రైతు. ఇతని కుమారుడు కందదేవన్ (27) మద్యానికి బానిసై రోజూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసేవాడు. సోమవారం బయటకు వెళ్లిన కందదేవన్ ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం ఊరు బయట బావిలో శవమై కనిపించాడు. ఈ విషయమై బాటసారులు గ్రామ పరిపాలన అధికారి తమిళన్‌కు సమాచారం అందించారు. మేలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ మన్నవన్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆనందజ్యోతి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కందదేవన్ మతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విచారణలో షాకింగ్ సమాచారం వెల్లడైంది. మద్యానికి బానిసైన కందదేవన్ వేధింపులు తట్టుకోలేని తండ్రి పెరుమాళ్, అతని బంధువు తంగం(32) తాడుతో కాళ్లు, చేతులు కట్టి బావిలో పడేసి హత్య చేసినట్లు తేలింది.

భవనంపై నుంచి కిందపడి కార్మికుడి మృతి

తిరువొత్తి యూరు: చెన్నై ఎర్నాఊర్లో 13 వ అంతస్తు నుంచి కిందపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సొరాజ్ కుమార్ (35). ప్లంబర్ అయిన ఇతను గత ఏడాదిగా నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఎర్నావూరు ప్రాంతంలో నగర అభివృద్ధి పథకం కింద కొత్తగా నిర్మాణం చేస్తున్న బహుళ అంతస్తుల భవనం 13వ అంతస్తులో ప్లంబర్ పనులు చేస్తుండగా కాలుజారి పడి అదే చోట మృతి చెందాడు. ఎన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి సొరజ్ కుమార్ మృతదేహాన్ని శవ పరీక్ష కోసం స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సొరజ్ కుమార్ భార్య గీతాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఖైదీ..

అన్నానగర్: తిరువారూర్ జిల్లా మన్నార్గుడి బర్మా కాలనీకి చెందిన జనరక్షగన్(56) కూలి. ఓ హత్య కేసులో అరెస్టయిన కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఈ స్థితిలో సోమవారం రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై స్పృహతప్పి పడిపోయాడు. జైలు సిబ్బంది అతడిని రక్షించి కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు రేస్ కోర్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల ధర్నా



డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్న దివ్యాంగులు

అన్నానగర్: విల్లుపురం జిల్లా పీపుల్ విత్ డిజేబిలిటీస్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దివ్యాంగులు ధర్నాకు చేశారు. జిల్లా కలెక్టర్ పళని వెంటనే వారితో చర్చలు జరిపారు. విల్లుపురం జిల్లా దివ్యాంగుల కార్యాలయంలో గత 5 సంవత్సరాలుగా బాలకష్ణన్ దివ్యాంగులకు జాతీయ గుర్తింపు కార్డులు ఇచ్చే పని చేస్తున్నాడని తెలిపారు. అతడిని అకస్మాత్తుగా ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పడంతో తమ ఆందోళనను విరమించారు.

విలక్షణ కథతో తీరాద కాదల్



తీరాద కాదల్ చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు జయ్, ఐశ్వర్యరాజేశ్, శివదా హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం తీరాద కాదల్. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి అదే కంగళ్, పెట్రోమ్యాక్స్ చిత్రాల ఫేమ్ రోహిన్ వెంకటేశన్ కథ,దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. సిద్ధు కుమార్ సంగీతాన్ని, రవివర్మన్ నీలమేఘం ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ నెల 26వ తేదీన తెరపైకి రానుంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్ నిర్వహించిన మీడియా సమావేశంలో నటి ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ అన్ని కథల వెనుకా పలు కథలు ఉంటాయన్నారు. అదే విధంగా తనకు ఈ చిత్ర దర్శకుడి మధ్య రెండేళ్ల కథ ఉందన్నారు. తాను లైకా ప్రొడక్షన్స్ నిర్వహకుడు తమిళ్‌కుమరన్‌కు నాలుగు కథలు పంపానన్నారు. అందులో ఒక కథ చాలా బాగుందని తమిళ్‌కుమరన్ రాత్రి 11 గంటలకు ఫోన్ చేసి చెప్పారన్నారు. దీంతో చాలా ఆనందం కలిగిందన్నారు. అయితే చిత్ర నిర్మాణం ఆలస్యం కావడంతో తాను, దర్శకుడు రోహిన్ వెంకటేశన్ కలిసి ఒక రోజు తిరుమల కొండపైకి నడిచి వెళ్లామన్నారు. అలా కొండపైకి మెట్లు ఎక్కుతుండగా లైకా సంస్థ నిర్వాహకుడు తమిళ్‌కుమరన్ ఫోన్ చేసి తీరాద కాదల్ చిత్రాన్ని చేస్తున్నామని చెప్పారన్నారు. అదో మరచిపోలేని అనుభవంగా పేర్కొన్నారు. అయితే ఇందులో హీరోగా నటుడు జయ్‌నే నటించాలని పట్టు పట్టారన్నారు. అది ఎందుకో తనకు అర్థం కాలేదని అన్నారు. చిత్రంలో అందరూ బాగా నటించారని నటి ఐశ్వర్యరాజేశ్ పేర్కొన్నారు. నటుడు జయ్ మాట్లాడుతూ ఈ చిత్ర కథను విన్నప్పుడు చాలా బాగుందనిపించిందని, అయితే తనకు కరెక్ట్‌గా ఉంటుందా? అన్న సందేహం కలిగిందని చెప్పారు.దర్శకుడు రోహిత్ వెంకటేశన్‌పై నమ్మకం ఉందనీ, ఆయన ఇంతకు ముందు తెరకెక్కిన అదే కంగళ్ చిత్రాన్ని నాలుగు సార్లు చేశానన్నారు. అందుకే ఈ చిత్రాన్ని చేయడానికి సమ్మతించానని చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

సరికొత్తగా వేట్టైయాడు విళైయాడు

తమిళసినిమా: నటుడు కమలహాసన్ కథానాయకుడిగా గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం వేట్టైయాడు విళైయాడు. నటి జ్యోతిక, కమలిని ముఖర్జీ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, డేనియల్ బాలాజీ, జానకి సుబేల్, ముమైత్‌ఖాన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సెవెంత్ ఛానల్ కమ్యునికేషన్ పతాకంపై మాణిక్యం నారాయణన్ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ కథా చిత్రానికి రవివర్మన్ ఛాయాగ్రహణం, హరీశ్ జయరాజ్ సంగీతాన్ని అందించారు. కాగా కమల్‌హాసన్ పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నటించిన ఈ యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రం 2006లో విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. చిత్రంలోని పాటలు ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. కాగా అలాంటి విజయవంతమైన చిత్రం ఇప్పుడు ఫిలింస్ విజన్ కె.రాము డిజిటల్ విధానంలో డిజిటల్ విధానంలో సరికొత్త హంగులతో రూపొందించారు. దీన్ని వైఎంఆర్ క్రియేషన్స్ సంస్థ రీ రిలీజ్ చేయనుంది. దీన్ని కేఎం.సుందరం పిక్చర్స్ అధినేత సుందరం జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేయనుందని ఆయన తెలిపారు. నటుడు కమలహాసన్ కథానాయకుడిగా నటించిన విక్రమ్ చిత్రం సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. తాజా చిత్రం ఇండియన్ -2 విడుదలకు ఇంకా సమయం ఉండటంతో మధ్యలో వేట్టైయాడు విళైయాడు చిత్రం సరికొత్త హంగులతో తెరపైకి రానుందన్న మాట.



వేట్టైయాడు విళైయాడు చిత్రంలో ఓ దృశ్యం

నా నిర్మాత ఓ బిచ్చగాడు



ఆధారం చిత్ర ట్రైలర్ ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: తన చిత్ర నిర్మాత ఓ బిచ్చగాడని దర్శకురాలు కవిత పేర్కొన్నారు. ఈమె దివంగత ప్రఖ్యాత దర్శకుడు టీఎన్ బాలు కూతురు అన్నది గమనార్హం. కవిత తొలిసారిగా దర్శకురాలిగా పరిచయం అవుతూ తెరకెక్కించిన చిత్రం అధారం. మ్యాట్నీ ఫోక్ పతాకంపై జి.ప్రదీప్‌కుమార్, ఆషా మైదీన్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నవ జంట అజిత్ విఘ్నేశ్, పూజా శంకర్ హీరో హీరోయిన్లుగా నటించారు. ధర్మ ప్రకాశ్ సంగీతాన్ని, ఎస్ఎస్.రాజేశ్‌కుమార్, శ్రీవట్సల ద్వయం ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మిష్కిన్, ఎంగేయుమ్ ఎప్పోదుమ్ చిత్రం ఫేమ్ శరవణన్, నటుడు వైజీ.మహేంద్రన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చిత్ర నిర్మాత ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ స్నేహితులే జీవితం అని తెలుసుకున్న వ్యక్తిని తానన్నారు. ఈ వేదికపై నిలబడటానికి కారణం వారేనన్నారు. స్నేహితుల కారణంగానే ఈ చిత్రాన్ని నిర్మించగలిగానని చెప్పారు. దర్శకురాలు కవిత మాట్లాడుతూ ఈ చిత్రం కోసం తనతో పాటు శ్రమించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. దర్శకురాలిగా తనకిది తొలి చిత్రం అనీ, తాను దర్శకుడు టీఎన్.బాలు కూతురిని అని గర్వంగా చెప్పుకుంటున్నానన్నారు. తన తండ్రి పెద్ద దర్శకుడు అయినా తనను ఎవరూ గుర్తించడం లేదని అనిపించేదని, అయితే దర్శకుడు మిష్కిన్, వైజీ మహేంద్రన్ ఈ వేడుకకు రావడానికి కారణం తన తండ్రే అని,ఆ ఘనత చాలని అన్నారు. తన చిత్ర నిర్మాత ఒక బిచ్చగాడని పేర్కొన్నారు. బిచ్చగాడు చిత్రానికీ, ఆయనకు ఒక పోలిక ఉందన్నారు. అందుకే ఆయన్ని అలా పిలుస్తుంటానని చెప్పారు.

ఉత్తమ నటుడిగా విజయ్



నటి కంగనా రనౌత్



- ఉత్తమ నటిగా కంగనా రనౌత్
- ఘనంగా తమిళ్ అంతర్జాతీయ సినీ అవార్డుల వేడుక

తమిళసినిమా: ఒసాకా తమిళ్ అంతర్జాతీయ 2021 సినీ అవార్డుల వేడుక ఇటీవల జపాన్‌లో జరిగింది. ఈ వేదికపై 2021 ఏడాదికి గానూ తమిళ చిత్రాలకు అవార్డులను ప్రకటించారు. అందులో మాస్టర్ చిత్రంలోని నటనకు గానూ కథనాయకుడు విజయ్‌కు ఉత్తమ నటుడు అవార్డును ప్రకటించారు. నటి మాళవికా మోహన్ నాయకిగా నటించిన ఇందులో నటుడు విజయ్‌సేతుపతి ప్రతినాయకుడిగా నటించారు. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని 7 స్క్రీన్ స్టూడియోస్, ఎక్స్ బీ.ఫిలిం క్రియేటర్స్ సంస్థలు నిర్మించాయి. కాగా ఇందులో నటించిన విజయ్‌సేతుపతికి ఉత్తమ ప్రతినాయకుడు అవార్డును ప్రకటించారు. ఈ చిత్రంలోని వాత్తి కమింగ్ పాట ఉత్తమ పాట అవార్డును గెలుచుకుంది. ఆ విధంగా మాస్టర్ చిత్రం మూడు అవార్డులను కైవసం చేసుకుంది. ఇకపోతే తలైవి చిత్రంలో నటనకు గానూ నటి కంగనారనౌత్‌కు ఉత్తమ నటి అవార్డు వరించింది. అదే విధంగా సర్పట్ట పరంపరై చిత్రానికి గానూ పా.రంజిత్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డును మానాడు చిత్రానికి గానూ దర్శకుడు వెంకట్‌ప్రభు గెలుచుకున్నారు. ఉత్తమ నిర్మాణ సంస్థ అవార్డును మండేలా చిత్రానికి గానూ వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టెయిన్‌మెంట్, ఓపెన్ విండో ప్రొడక్షన్స్, విష్‌బెర్రి ఫిలింస్ సంస్థలు గెలుచుకున్నాయని అవార్డుల జ్యూరీ అధికారికంగా ప్రకటించింది.

అందానికి మెరుగులు దిద్దుకునే పనిలో..



తమిళసినిమా: అందంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. సినిమా హీరోయిన్లు అయితే ఈ విషయంలో ఎక్కువ శ్రద్ధే పెడుతుంటారు. అందుకోసం నిత్యం కసరత్తులు కూడా చేస్తుంటారు. అయితే పాలరాతి బొమ్మ లాంటి తమన్న కూడా ఇటీవల కాస్త బరువెక్కింది. దీంతో ఆమె నెటిజన్ల కామెంట్స్ గురౌతోంది. ఏదేమైనా ఈ భామ ఇప్పుడు బరువు తగ్గే పనిలో ఉందట. అందు కోసం తీవ్రంగా కసరత్తులు చేస్తోంది. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అవి ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇకపోతే ప్రస్తుతం తమిళంలో రజనీకాంత్‌తో కలిసి జైలర్ చిత్రం, సుందర్.సీ దర్శకత్వంలో అరణ్మనై 4 చిత్రంలో నటిస్తోంది. ఇక తెలుగులో చిరంజీవి సరసన భోళాశంకర్ చిత్రంలో నటిస్తోంది. ఈ అమ్మడికి అవకాశాలు తగ్గినా ఇన్‌స్టాగామ్‌లో మాత్రం 21 మిలియన్ల ఫాలోవర్స్ ఉండటం విశేషం. ఇకపోతే ఐటమ్ సాంగ్స్‌లో తమన్నది ప్రత్యేక స్థానం. ఇప్పటికీ ఈమెకు అలాంటి అవకాశాలు వస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా ఒక తెలుగు చిత్రంలో ఐటమ్ సాంగ్‌కు కోసం ఈ మిల్కీబ్యూటీ ఏకంగా రూ.5 కోట్లు డిమాండ్ చేసిందనీ, దీంతో నిర్మాత మైండ్ బ్లాక్ అయ్యిందనే టాక్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే ఈ ప్రచారాన్ని నటి తమన్న ఖండించింది. అసలు అలాంటి అవకాశమే తన వద్దకు రాలేదని ట్విట్టర్ ద్వారా వివరించింది. మొత్తం మీద ఈ బ్యూటీ ఏదో విధంగా నిత్యం వార్తల్లో ఉంటోంది.

క్లుప్తంగా

పిడుగుపాటుకు 3 ఆవులు మృతి


మృతి చెందిన ఆవులు

తిరువొత్తియూరు: తిరుచ్చిలో పిడుగుపడి మూడు ఆవులు మృతి చెందాయి. ఉప్పిలియపురం యూనియన్ 15వ వార్డు కౌన్సిలర్ చంద్రమూర్తి, కీల్ పట్టికి చెందిన ఇతను తన కుటుంబంతో కలిసి ఆవులను మేపుతున్నాడు. ఆదివారం సాయంత్రం తోటలో 3 ఆవులను కట్టి వేసి ఇంటికి తిరిగి వచ్చాడు. సోమవారం ఉదయం తోటలోకి వెళ్లి చూడగా 3 ఆవులు చనిపోయి ఉన్నాయి. పాతరపేట గ్రామ పరిపాలనాధికారి చిన్నతంబి, ఉప్పిలియపురం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గీత, ఎరకుడి వెటర్నరీ డాక్టర్ ఆనంద్, ఉప్పిలియపురం ఎస్ఐ ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో ఆదివారం రాత్రి భారీ కురిసిందని.. ఆవులను కట్టిన ప్రదేశానికి సమీపంలోని వేపచెట్టుపై పిడుగు పడడంతో 3 ఆవులు మృతిచెందినట్లు గుర్తించారు. అక్కడే పశువైద్యుడు పోస్టుమార్టం నిర్వహించి ఆవులను పాతిపెట్టారు.

శాస్త్రోక్తంగా గోవిందుని మహా సంప్రోక్షణ


మహా హారతి ఇస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో మహా సంప్రోక్షణలో భాగంగా మంగళవారం వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, కుంభారాధన, పంచగవ్యా రాధన చేపట్టారు. తర్వాత విశేష హోమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు వివిధ వైదిక కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద జీయంగారు, చిన్నజీయంగారు, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా మధ్యాహ్నం 1.30 గంటల తరువాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ. ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

పద్మావతీ అమ్మవారికి ముత్యాల హారం విరాళం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారికి భక్తులు ముత్యాలహారాన్ని కానుకగా అందజేశారు. ఒంగోలుకు చెందిన వరప్రసాద్ దంపతులు మంగళవారం ఆలయానికి చేరుకుని హారాన్ని ఆలయ సూపరింటెండెంట్ శేషగిరికి అందజేశారు. సుమారు రూ.52వేల విలువైన ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించాలని దాతలు కోరారు. అనంతరం వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బాబు స్వామి, వీవీ రామ్మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఇంద్రవరదుడి విహారం

యాదమరి: స్థానిక త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వామివారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక పూజార్చనలు, అభిషేకాలు, అలంకరణల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికలో కొలువు దీర్చి, పూజలు చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు గ్రామస్తులు మజ్జిగ పంపిణీ చేశారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి మంగళవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడకు చెందిన రవిశంకర్ రూ.2.50లక్షలు విరాళమిచ్చారు. గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.50లక్షలు, నిత్యాన్నదానానికి రూ.లక్ష చొప్పున ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు ఈ విరాళం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డాగ్‌స్క్వాడ్‌లోకి మహిళా పోలీసులు

- రాష్ట్రంలోనే తొలిసారి

కొరుక్కుపేట: రాష్ట్రంలో తొలిసారిగా ఇద్దరు మహిళా పోలీసు కానిస్టేబుళ్లను స్నిఫర్ డాగ్ (డాగ్ స్క్వాడ్) హ్యాండ్లర్‌లుగా కోయంబత్తూరు నగర పోలీసులు సోమవారం నియమించారు. కవిప్రియ, భవాని అనే ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. ఆరు నెలల తర్వాత నేరస్థలానికి కుక్కలను తీసుకెళ్లడం ప్రారంభిస్తారని పోలీసుశాఖ వర్గాలు తెలిపాయి. కవిప్రియ, భవాని మాట్లాడుతూ.. పెంపుడు జంతువులంటే తమకు చాలా ఇష్టమని, శిక్షణ కాలంలో డాగ్ స్క్వాడ్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశామని తెలిపారు. తిరుప్పూర్ నగరంలోని చెల్లం నగర్‌కు చెందిన కవిప్రియ భౌతికశాస్త్రంలో బీఎస్సీ, బీఈడీ, బీఏ (హిందీ), డిప్లొమా పూర్తి చేసి కానిస్టేబుల్‌గా చేరారు. ఆమె కోయంబత్తూరులోని పోలీస్ రిక్రూట్స్ స్కూల్ (పీఆర్ఎస్)లో శిక్షణ పూర్తి చేసి, కోయంబత్తూర్ సిటీ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్‌లో విధుల్లో ఉన్నారు. అలాగే తేని జిల్లాకు చెందిన భవానీ 2022లో శిక్షణ పూర్తి చేసుకుని కోయంబత్తూరు సిటీ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్‌లో నియమితులయ్యారు. ఆమె బీఏ (ఇంగ్లీష్ లిటరేచర్), బీపీఈడీ (బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషనల్) పూర్తి చేసింది. ఈమె ప్రస్తుతం డిటెక్టివ్ డాగ్ స్క్వాడ్ అలాగే సిటీ పోలీస్ కమిషన్ ఆఫీస్ ఆవరణలో ఉన్న డాగ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. కవిప్రియ క్రైమ్ సీన్ వర్క్‌లో ఎక్స్‌పర్ట్ కాగా, భవాని త్వరలో మాదకద్రవ్యాల కేసులను ఛేదించనున్నారు. ఈ సందర్భంగా కోయంబత్తూరు సిటీ పోలీస్ కమిషనర్ వి.బాలకృష్ణన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సిబ్బందిని డాగ్ స్క్వాడ్‌లో నియమించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఇప్పటి వరకు మహిళలను నియమించని కొన్ని సంప్రదాయ స్థానాల్లో లింగ సమానత్వం ఉండేలా తాము ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. ముగ్గురు మహిళా పోలీసు సిబ్బందిని స్ట్రైక్ ఫోర్స్‌లో నియమించామని, బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ వంటి ఇతర ప్రత్యేక విభాగాల్లో మహిళలను చేర్చుకోవాలని యోచిస్తున్నామని తెలిపారు.


డాగ్ స్క్వాడ్‌లోకి చేరిన మహిళా కానిస్టేబుళ్లు

లాటరీ విధానంలో ఇళ్ల కేటాయింపు


కలెక్టరేట్‌లో గుమిగూడిన లబ్ధిదారులు

వేలూరు: తమిళనాడు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో అందరికీ ఇళ్లు పథకం కింద ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను వేలూరు తొర్రపాడిలో నిర్మించారు. దీన్ని సీఎం స్టాలిన్ చెన్నై సచివాలయం నుంచి గత నెల 10వ తేదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ పథకంలో 824 మందిని ఎంపిక చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటించారు. ఎంపిక చేసిన లబ్ధిదారులు రూ. 2.39 లక్షలు చెల్లించాలని తెలపడంతో లబ్ధిదారులు మొదటి విడతగా గత నెల 28వ తేదీ 367 మంది బ్యాంకుల ద్వారా చెల్లించారు. నగదు చెల్లించిన లబ్ధిదారులకు వేలం పాట ద్వారా కలెక్టరేట్‌లో ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు అధిక సంఖ్యలో కలెక్టరేట్ చేరుకోవడంతో కిటకిటలాడింది. వేలం పాటకు వచ్చిన వారు టోకన్ పొందేందుకు తోపులాట చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బందోబస్తులో ఉన్న పోలీసులు వారితో చర్చలు జరిపి శాంతింపజేశారు.

26 నుంచి పదో తరగతి మార్కుల జాబితా పంపిణీ

తిరువొత్తియూరు: తమిళనాడులో పదో తరగతి విద్యార్థులకు 26వ తేదీ నుంచి తాత్కాలిక సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశించారు. ఏప్రిల్‌లో జరిగిన 10వ తరగతి సాధారణ పరీక్ష ఫలితాలు ఈ నెల 19న వెలువడ్డాయి. విద్యార్థులు ప్లస్ వన్, పాలిటెక్నికల్ కాలేజీల్లో అడ్మిషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీని ప్రకారం 26వ తేదీ నుంచి విద్యార్థులకు ప్రొవిజినల్ మార్కుల సర్టిఫికెట్లను పంపిణీ చేయాలని పరీక్షల డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాల అభ్యర్థులు, వ్యక్తిగత అభ్యర్థుల పరీక్ష కేంద్రం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ కేంద్రంలో హాజరైన వ్యక్తిగత అభ్యర్థుల కోసం సంబంధిత తాత్కాలిక మార్కుల ధృవీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ సర్టిఫికెట్లలోని వివరాలను సరిచూసుకున్న తర్వాత 26వ తేదీ మధ్యాహ్నం నుంచి ఆయా పాఠశాలల్లోని పాఠశాల విద్యార్థులకు, వారు హాజరైన పరీక్ష కేంద్రం ద్వారా ఒక్కో అభ్యర్థులకు పంపిణీ చేయాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రొవిజనల్ గ్రేడ్ సర్టిఫికెట్లు, వాటిలోని అభ్యర్థి పుట్టిన తేదీని ధృవీకరిస్తారు.
క్యాపిటలైజ్ చేసి పేరు విద్యార్థి, తల్లి, తండ్రి లేదా సంరక్షకుడు, ఫొటోగ్రాఫ్, బోధనా భాషలో ఏవైనా లోపాలు ఉంటే ప్రధానోపాధ్యాయుడు దిద్దుబాటు నిర్వహించి సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ తాత్కాలిక మార్కుల సర్టిఫికెట్ల పంపిణీ తర్వాత, వాటిలో ఏవైనా దిద్దుబాట్లు ఉంటే, అథారిటీ ద్వారా తెలియజేయబడిన తేదీలో దిద్దుబాట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థులకు రీప్లేస్‌మెంట్ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో 10వ తరగతి సాధారణ పరీక్ష మార్కుల సీరియల్ నంబర్‌ను సర్టిఫికెట్‌లో సరి చూసి అందచేయాలని అన్ని జిల్లాల సీఈఓలకు పరీక్ష విభాగం డైరెక్టర్ సేతురామవర్మ ఆదేశించారు.

మనసున్న బిచ్చగాడు

- సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 వేల విరాళం
- పదేళ్లలో రూ.5.60 లక్షలు అందజేత


కలెక్టర్‌కు నగదు ఇస్తున్న యాచకుడు పూల్‌పాండి

తిరువళ్లూరు: బిక్షాటన చేయడం ద్వారా వచ్చిన రూ.10 వేల నగదును సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నాడో యచకుడు. తూత్తుకుడి జిల్లా సాత్తాన్‌కుళం సమీపంలోని ఆళంగినర్ గ్రామానికి చెందిన యాచకుడు పూల్‌పాండి(75). భార్య మృతి చెందిన తరువాత తన పిల్లలు ఉద్యోగం కోసం ఇతర ప్రాంతానికి వెళ్లడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. బిక్షాటన చేయడం ద్వారా వచ్చే నగదును విద్య, వైద్యం, అనాథ ఆశ్రమాలకు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పదేళ్లలో పాండిచ్చేరితో పాటు చెన్నై, తూత్తుకుడి, కన్యాకుమారి, విల్లుపురం, వేలూరు, సేలం, నీలగిరి, కోయంబత్తూరు సహా వేర్వేరు జిల్లాలకు చెందిన కలెక్టర్లను కలిసి ఇప్పటి వరకు యాచించిన రూ. 5.60 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. తాజాగా రెండు నెలల్లో బిక్షాటన చేయడం ద్వారా వచ్చిన రూ.10 వేలను కల్తీ సారా తాగి విల్లుపురం చెంగల్‌పట్టు జిల్లాలో మృతి చెందిన కుటుంబాలకు అందించాలని నిర్ణయించారు. మంగళవారం తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌ను కలిసి నగదు అందజేశారు. అనంతరం మీడియాతో పూల్‌పాండి మాట్లాడుతూ.. డబ్బులు ఉంటే మనఃశాంతి ఉండదని, మనస్సు ఉన్న వారి వద్ద డబ్బులు ఉండడం లేదని తెలిపారు. తాను బిక్షాటన చేయడం ద్వారా వచ్చే నగదులో కొంత భాగాన్ని తిండి కోసం ఉపయోగిస్తున్నానని చెప్పారు. తనకు మూడుపూటల ఆహారం, కట్టుకోవడానికి గుడ్డ ఉంటే చాలని పేర్కొన్నారు. మిగిలిన మొత్తాన్ని ప్రజల కోసం ఉపయోగించాలని కలెక్టర్‌ల ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే వృద్ధాశ్రమానికి వెళ్లి విశ్రాంతి తీసుకోనున్నట్లు పాండి తెలిపారు.

డయాబెటిస్‌పై అప్రమత్తత అవసరం


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్ కేశవన్

కొరుక్కుపేట: డయాబెటిస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు పేర్కొన్నారు. అల్కెమ్ మెడ్‌టెక్, డాక్టర్ ఆర్.కె.డయాబెటిక్ ఫుట్ అండ్ పాడియాట్రి ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా హైపర్-పర్సనలైజ్డ్ 4ఈ బయోప్రింటింగ్ టెక్నాలజీపై సింపోజియం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వైద్యులు, ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణులు పాల్గొన్నారు. డయాబెటిక్ ఫుట్ అల్సర్‌ల కోసం డెర్మల్ రీజనరేషన్ విత్ ఇన్నోవేటివ్ మెకానిజం గురించి అవగాహన కల్పించడం, డీఎఫ్‌యూ చికిత్స కోసం చర్మ పునర్నిర్మాణ విధానాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సింపోజియం సాగింది. డాక్టర్ అల్మేష్ కడకోల్ సింపోజియం నిర్వహణ లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ స్వాగతోపన్యాసం చేశారు. డయాబెటిక్ ఫుట్ అల్సర్‌పై నారాయణ మూర్తి, రోహిత్ హెల్త్‌కేర్ ప్రెసిడెంట్ జీహ కిమ్ డీఎఫ్‌యూ స్కిన్ రీజెనరేషన్ టెక్నాలజీ కొత్త చికిత్స విధానం గురించి వివరించారు. డాక్టర్ రాజేష్ కేశవన్ మాట్లాడుతూ.. డయాబెటిస్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా 40 నుంచి 60 మిలియన్ల మంది డయాబెటిక్ ఫుట్ అండ్ లోయర్ లింబ్ సమస్యతో బాధపడుతున్నారని వివరించారు. దేశంలో యూనిక్ మెకానిజం ప్లాట్‌ఫారమ్ ఆటోలోగస్ కొవ్వు కణజాలాన్ని ఉపయోగించి డయాబెటిక్ ఫుట్ అల్సర్‌కి సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

నాగర్ కోయిల్‌లో విద్యార్థుల నిరసన

తిరువొత్తియూరు: తగినన్ని మార్కులు వచ్చినా కోరిన గ్రూప్‌లో సీటు ఇవ్వడం లేదని నాగర్ కోయిల్‌లో ప్రభుత్వ పాఠశాల ఎదుట విద్యార్థులు ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు గత 19వ తేదీ విడుదలయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్లస్ వన్ తరగతులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నాగర్ కోయిల్‌లో కవిమని ప్రభుత్వ బాలిక మహోన్నత పాఠశాలలో సోమవారం ప్లస్ వన్ తరగతి కోసం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్లస్ వన్‌లో చేరేందుకు ఎక్కువ మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాఠశాలకు చేరుకున్నారు. ఆ సమయంలో అదే పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థులు కొందరు తమకు తగినన్ని మార్కులు ఉన్నా కోరిన విభాగంలో తమకు సీట్లు ఇవ్వలేదని డిమాండ్ చేస్తూ ప్రధానోపాధ్యాయురాలు కార్యాలయం ఎదుట కూర్చుని ఆందోళన చేపట్టారు. వారితో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. దీనికి సంబంధించి విద్యార్థులు మాట్లాడుతూ.. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ఈ పాఠశాలలో చదివామని, 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 310 నుంచి 350 మార్కుల వరకు సాధించామని.. ఆంగ్ల మధ్యమంలో చదివినట్లు తెలిపారు. అయితే తాము కోరిన గ్రూపులో సీటు ఇవ్వలేదని చెప్పారు. అర్హత ఉన్న అందరికీ కోరిన విధంగా సీట్లు ఇస్తామని ప్రధానోపాధ్యాయుడు చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

భార్య హత్య.. భర్త లొంగుబాటు

తిరువొత్తియూరు: భార్యను హత్య చేసిన భర్త పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన ఘటన నెల్లైలో జరిగింది. మేలపాలనకు చెందిన మహబూబ్ జాన్ కుమారుడు ఇమ్రాన్ ఖాన్ (32) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి నెల్లై టౌన్ మహమ్మద్ అలీ వీధికి చెందిన మరో మహబూబ్ జాన్ కుమార్తె హసీనా బేగం (28)తో వాహమైంది. వీరికి కుమార్తె అబియ (6), మహమ్మద్ అసరత్ (5) అనే కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. కొద్ది రోజులుగా హసీనా బేగం భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల ఇంటికి పిల్లలతో వచ్చేసింది. ఈ క్రమంలో హసీనా బేగం అత్త మహబూబ్ జాన్ సోమవారం ఉదయం మేలపాలయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కోడలికి భద్రత లేదని ఆమెను నెల్లై టౌన్‌లో ఉన్న తల్లిదండ్రుల ఇంటిలోనే ఉండాలని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇమ్రాన్ ఖాన్ తన భార్యను చూడడానికి టౌన్‌కి వెళ్లాడు. ఆ సమయంలో భార్యతో మాట్లాడాడు. తర్వాత ఇద్దరి మధ్య వాగ్వివాదం ఏర్పడింది. దీంతో వెంట తెచ్చుకున్న కత్తిని తీసి ఇమ్రాన్ ఖాన్ తన భార్యను పొడిచాడు. దీంతో హసీనా బేగం అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఇమ్రాన్‌ఖాన్ పోలీస్ స్టేషన్లో సరెండర్ అయ్యాడు.

పీహెచ్‌సీ మార్పుపై గ్రామస్తుల ఆందోళన


రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

వేలూరు: రాణిపేట జిల్లా కావనూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు పలు మార్లు అధికారులకు విన్నవించారు. దీంతో మంత్రి ఆర్ గాంధీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కావనూరు గ్రామంలో స్థలాన్ని సేకరించి ప్రభుత్వం వద్ద నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతి పొందారు. కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు స్వయ లాభం కోసం ఇక్కడ స్థలం సరిపోదని తప్పుడు సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేసి స్థలాన్ని మార్పు చేశారు. విషయం తెలుసుకున్న కావనూరు గ్రామస్తులు మంగళవారం ఉదయం కావనూరు బస్టాండ్ వద్ద రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తమ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు చేపట్టాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వాసంతి, తిమిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చర్చలు జరిపారు. అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం కావనూరు గ్రామంలో స్థలం చాలకపోవడంతో సమీపంలో ఉన్న పునకనూరులో ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇందుకు స్థానికులు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుని ఉన్నారని వీటిని సర్వే చేస్తే ఆసుపత్రి నిర్మాణానికి స్థలం సరిపోతుందని తెలిపారు. దీంతో అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆలయ కొలనులో అమ్మవారి విగ్రహం లభ్యం


అమ్మవారి విగ్రహం

అన్నానగర్: తక్కలైలోని ఆలయ కొలనులో మంగళవారం అమ్మవారి విగ్రహం లభ్యమైంది. కన్యాకుమారి జిల్లా తక్కలై సమీపంలోని వాల్‌వచ్చగోష్టంలో మహిషాసురమర్దిని అమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని ట్రావెన్ కోర్ రాజు మార్తాండవర్మ కాలంలో నిర్మించారు. రాజు యుద్ధానికి వెళ్లే ముందు ఈ ఆలయానికి వచ్చి యుద్ధ ఖడ్గంతో పూజలు చేసేవారని.. అందుకే ఈ ప్రదేశాన్ని వాల్‌వచ్చ గోష్టం అంటారు. ఈ ఆలయం ప్రస్తుతం హిందూదేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉంది. ఇక్కడ బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని కొలనులో పనులు చేస్తుండగా అమ్మవారి విగ్రహం లభ్యమైంది. ఆలయ మేనేజర్, బ్లాక్ సూపరింటెండెంట్ షణ్ముకంపిళ్లై విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహం ఒక అడుగు కంటే తక్కువ ఎత్తులో ఉంది. ఇది పంచలోహ విగ్రహమా? లేక రాగి విగ్రహమా? అనే విచారణ తర్వాత తెలుస్తుందని అంటున్నారు. ఈ విగ్రహం పూర్వ కాలంలో పండుగల సమయంలో ఉపయోగించే ఉత్సవ విగ్రహం అయి ఉండవచ్చని భావిస్తున్నారు. విగ్రహం లభ్యమైందన్న వార్త తెలియడంతో పలువురు భక్తులు పూజలు చేశారు.

గస్తీ పోలీసులకు ఆధునిక కెమెరాలు


పోలీసులకు స్మార్ట్ మైక్రో కెమెరాలను అందజేస్తున్న కమిషనర్ సత్యప్రియ

తిరువొత్తియూరు: తిరుచ్చి కార్పొరేషన్‌లో గస్తీ పోలీసులకు మైక్రో ఆధునిక కెమెరాలను అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సత్యప్రియ ట్రాఫిక్, గస్తీ విధులు నిర్వహించే 50 మందికి ఈ కెమెరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కెమెరాలను పోలీస్ దుస్తుల్లో ఏర్పాటు చేస్తారని.. దీని ద్వారా 3 రోజుల పాటు జరిగే విషయాలను రికార్డు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇది 64 జీబీ సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. రీచార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. ఐదు మీటర్ల దూరంలో జరుగే దృశ్యాలను స్పష్టంగా రికార్డు చేస్తుందని, ఇది గస్తీ పోలీసులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశామని వెల్లగించారు. వివిధ నేరాలకు సంబంధించి సంఘటనా స్థలంలో ఈ కెమెరాల ద్వారా రికార్డు చేయవచ్చని.. ఫలితంగా విచారణ ప్రక్రియ సులువు అవుందని తెలిపారు.

జింకను వేటాడిన యువకుడి అరెస్టు


నిందితుడు జాకబ్, స్వాధీనం చేసుకున్న జింక కళేబరం, బైక్

అన్నానగర్: వేపూర్‌లో సోమవారం సాయంత్రం తుపాకీతో జింకను వేటాడిన యువకుడిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. పరారైన ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. కడలూరు విరుద్ధాచలం ఫారెస్ట్ ఆఫీసర్ రఘువరన్ నేతృత్వంలో ఫారెస్టర్లు శివకుమార్, పన్నీర్ సెల్వం, ఫారెస్ట్ గార్డులు ఆర్ముగం, నవనీతకృష్ణన్, జయవర్ధన్ వేపూర్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం గస్తీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో బైకుపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను అడ్డుకున్నారు. దీంతో బైకు నిలిపి ఇద్దరు పారిపోయారు. ఒకరిని మాత్రం అదుపులోకి తీసుకుని విచారించారు. అందులో కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట ఎరయూర్ ప్రాంతానికి చెందిన ఫ్రాన్సిస్ కుమారుడు జాకబ్ (29) అని తెలిసింది. పరారీలో ఉన్న వారిని ఎరయూర్ తూర్పు వీధికి చెందిన ఆంటోనిస్వామి కుమారుడు మొట్టయ్యన్, జోసెఫ్ రాజ్‌లుగా గుర్తించారు. అటవీశాఖ జాకబ్‌ను అరెస్టు చేసి అతడి నుంచి చనిపోయిన జింక, వేటకు ఉపయోగించే దేశీ తుపాకీ, గన్‌పౌడర్, షెల్స్, బైకును స్వాధీనం చేసుకున్నారు.

అనుమతి లేని 75 బార్‌లు సీజ్


బార్‌కు సీల్ వేస్తున్న పోలీసులు

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బార్‌లను గుర్తించిన పోలీసులు 75 బార్‌లకు సీల్ వేశారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి, గుమ్మిడిపూండి, తిరువళ్లూరు, తిరుత్తణి, ఆర్కేపేట, పళ్లిపట్టు, ఊత్తుకోట తదితర ఏడు తాలుకా పరిధిలో 137 టాస్మాక్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈ దుకాణాలకు కాకలూరులోని గోధాము నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. కాగా 137 టాస్మాక్ దుకాణాలకు సమీపంలో బార్ నిర్వహించుకోవడానికి 20 మందికి మాత్రమే గతంలో అనుమతి ఇచ్చారు. మిగిలిన దుకాణాలకు సమీపంలో బార్‌లను నిర్వహించుకోవడానికి గత ఆగస్టు19న వేలం వేయగా మరో 36 దుకాణాల వద్ద బార్ నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చారు. మిగిలిన టాస్మాక్ దుకాణాలకు సమీపంలో బార్ నిర్వాహణకు అనుమతి లేదు. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా జిల్లా వ్యాప్తంగా వందకు పైగా బార్‌లను నిర్వహిస్తున్నట్టు తిరువళ్లూరు ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు ఫిర్యాదులు అందాయి. దాడులు నిర్వహించాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. దీంతో 10 బృందాలుగా ఏర్పడిన పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 75 బార్‌లను గుర్తించి సీజ్ చేశారు. బార్‌లో రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. కాగా అనుమతి లేని బార్‌ల సీజ్ వ్యవహారంపై ఎస్పీ మాట్లాడుతూ.. ఇటీవల విల్లుపురం, చెంగల్‌పట్టు జిల్లాలో కల్తీసారా తాగి 20 మందికి పైగా మృతి చెందారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి జిల్లాలో రాకుడదన్న ఉద్దేశంతోనే దాడులు నిర్వహించి అనుమతి లేని బార్‌లను సీజ్ చేశామని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని దాడుల చేస్తామన్నారు.

ఫిట్ నెస్‌కు వేళాయె...

స్కూల్ బస్సుల సామర్థ్యంపై ఫోకస్

- ఆర్టీఏ అధికారులు తనిఖీలు ప్రారంభం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


స్కూల్ బస్సు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్న రవాణాశాఖాధికారి (ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాలలు తెరిచే సమయం దగ్గర పడుతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వపరంగా ఏర్పాట్లు మొదలయ్యాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు ఇందుకోసం సమాయత్తం అవుతున్నాయి. అడ్మిషన్లు..ఫ్యాకల్టీ నియామకం ..పుస్తకాలు..పిల్లలను తరలించే బస్సుల నిర్వహణ లాంటి పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగానడిపే పిల్లల బస్సులపై ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు చాలా శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. కాలం చెల్లిన బస్సులు నడిపితే విద్యార్థులకు ఎంతో ఇబ్బందికరం..ఒక్కోసారి చాలా ప్రమాదాలకు దారి తీస్తుంది. అందుకే బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఏటా సామర్థ్య పత్రం (ఎఫ్‌సీ) జారీ చేస్తుంది. స్కూల్స్,కళాశాలలు తెరిచే నాటికి వాహనాల సామర్థ్యం బాగుండాలి. ఈమేరకు రవాణా శాఖ అధికారులు ఇప్పటికే ఆదేశాలు కూడా జారీ చేశారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు ఈ సర్టిఫికెట్లకు సిద్ధమవుతున్నాయి. జిల్లా పరిధిలో కాకినాడ, పెద్దాపురం, కత్తిపూడి ప్రాంతాలలో ఆయా కార్యాలయాలను అనుసంధాన మండలాల్లోని వాహనాలను తనిఖీచేస్తున్నారు. అనంతరం ఎఫ్‌సీలు జారీచేయనున్నారు.

జిల్లాలో 1203 వాహనాలు..

రూల్ నెంబర్ 185(ఎఫ్) ప్రకారం ప్రతి స్కూల్, కళాశాలల బస్సులు కచ్చితంగా రవాణాశాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఈ నెలంతా రవాణాశాఖ అధికారులు ఈ బస్సులను పరీక్షించి ఎఫ్‌సీలు జారీచేసే పనిలో తలమునకలయ్యారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి మరీ అనువణువు తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1203 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఏటా ఇదే నెల 15వ తేదీకి వ్యాలిడిటీ అయిపోతుంది. బస్సులో అన్నీ బాగుంటే తరువాత తేది నుంచి మరో ఏడాదికి పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తారు.

నిబంధనలు ఇలా...

- స్కూలు బస్ డ్రైవర్‌కు 60 సంవత్సరాలు దాటి ఉండరాదు
- బీపీ,షుగర్,కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ వైద్యుని ద్వారా సమర్పించాలి.
- బస్సులోనూ, యాజమాని దగ్గర డ్రైవరు ఆరోగ్య సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉంచాలి.
- డ్రైవర్ నియామకాన్ని ఆర్‌టీఓ అధికారులకు ముందుగా తెలియజేయాలి.
- డ్రైవరుకు ఐదు సంవత్సరాల అనుభవం,హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- విద్యా సంస్థ ప్రిన్సిపాల్ ..విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా వాహనానికి సంబంధిత స్థితిగతులు రిజిస్టర్ చేయాలి.
- అన్ని లైట్లు,సిగ్నల్స్ కచ్చితంగా పనిచేయాలి. బస్సుకు నాలుగు వైపులా రిఫ్లెక్టివ్ టేపును అతికించాలి.
- గ్లాసులన్నీ పటిష్టంగా ఉండాలి. పొగ అధికంగా రాకూడదు. బ్రేకులు కండిషన్‌లో ఉండి పెయింటింగ్ కొత్తగా వేయించాలి.
- ఎమర్జెన్సీ డోర్, అగ్గిని ఆర్పే పరికరం, ఫస్ట్ ఎయిడ్ పరికరం తప్పని సరిగా ఉండాలి.

ఫిట్‌నెట్ ఉంటేనే రోడ్డెక్కాలి



స్కూల్ బస్సులకు ఎఫ్‌సీల జారీపై విద్యాసంస్థలకు సమాచారం ఇచ్చాం. అన్ని సక్రమంగా ఉంటే సర్టిఫికెట్ జారీ చేస్తున్నాం. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలి. ఎటువంటి నిబంధనలు పాటించక పోయినా బస్సులు సీజ్ చేస్తాం. కేసులు నమోదు చేస్తాము. స్కూల్స్ యాజమాన్యాలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు.

– ఎ.మోహన్, డీటీవో, కాకినాడ

మత్స్య సాగుబడి.. ఉపాధి మెరుగుబడి!

శాస్త్రీయ పద్ధతుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు వైఎస్‌ఆర్ మత్స్యసాగు బడి తోడ్పాటునిస్తోంది. చేపల పెంపకంపై ఒకవైపు మత్స్యసాగు బడి ద్వారా అవగాహన పెంచుతుండగా.. మరోవైపు చేపల పెంపకం ద్వారా ఫిష్ ఆంధ్ర కింద ఏర్పాటైన రీటైల్ ఫిష్ వెండింగ్ యూనిట్లకు తక్కువ ధరకే నాణ్యమైన చేపలు లభిస్తున్నాయి. చేపల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఆర్‌బీకేల వారీగా ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర కింద రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం విశేషం.

శాస్త్రీయ పద్ధతుల్లో చేపల ఉత్పత్తి

- మత్స్య సాగుబడులతో పెంపకంపై అవగాహన
- స్థానిక చెరువుల్లోనే మంచినీటి చేపల ఉత్పత్తి
- దిగుమతి భారం తప్పడంతో తగ్గిన ధరలు
- జిల్లాలో 40పైగా ఫిష్ ఆంధ్ర–ఫిట్ ఆంధ్ర రీటైల్ వెండింగ్ యూనిట్లు


గూడూరు చెరువులో చేపలు పడుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్య సాగుబడులతో చేపల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టడం మెరుగైన ఫలితాలను ఇస్తోంది. ఉప్పు నీటి చేపలు దిగుమతి చేసుకోవడంలో ఖర్చు ఎక్కువ. దీంతో చేపల ధరను పెంచి అమ్మాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న చెరువుల్లో అన్ని రకాల చేపలను పెంచి మంచి సైజుకు వచ్చిన తర్వాత ఫిష్ ఆంధ్ర యూనిట్లకు సరఫరా చేసేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 40 ఫిష్ ఆంధ్ర రీటైల్ వెండింగ్ యూనిట్లు విజయవంతంగా పనిచేస్తున్నాయి. నిరుద్యోగ యువత వీటిని ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. రీటైల్ వెండింగ్ యూనిట్లలో మంచినీటి చేపలు, ఉప్పు నీటి చేపలు వినియోగదారులకు అందుబాటులో ఉండాలనేది లక్ష్యం. దీనివల్ల రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న వారికి నాణ్యమైన చేపలు లభిస్తుండగా.. మత్స్య సహకార సంఘాలకు స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లభిస్తోంది. ఈ కారణంగా మూడేళ్ల క్రితంతో పోలిస్తే 50 శాతం మేర చేపల వినియోగం పెరిగింది.

తక్కువ ధరకు నాణ్యమైన చేపలు

గూడూరు మత్స్య సహకార సంఘం స్థానిక చెరువుల్లో రోయ్యలు, పీతలు మినహా అన్ని రకాల మంచి నీటి చేపలు పెంచుతోంది. నాణ్యమైన చేపలను ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర కింద ఏర్పాటైన రీటైల్ వెండింగ్ యూనిట్లకు అందుబాటులో ఉంచింది. రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు కాక ముందు చెరువుల్లో చేపల పెంపకం చేపడితే వాటి మార్కెటింగ్‌కు తీవ్ర ఇబ్బంది ఉండేది. దూరప్రాంతాలకు తరలించాలంటే రవాణా ఖర్చులు భారీగా వచ్చేవి. ఇందువల్ల చేపల పంపకంపై ఆసక్తి ఉండేది కాదు. ప్రభుత్వం చేపల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో పెంచేందుకు మత్స్య సాగు బడులు నిర్వహించడంతో పాటు వినియోగాన్ని పెంచేందుకు ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర బ్రాండ్‌లతో రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. తక్కువ ధరకే చేపలు లభిస్తుండటంతో ఫిష్ ఆంధ్ర సెంటర్లలోను నాణ్యమైన చేపలను వినియోగదారులకు తక్కువ ధరకు అందించే అవకాశం ఏర్పడింది.

మెరుగైన ఉపాధి

జిల్లాలో ఇప్పటి వరకు 40 మందికి పైగా నిరుద్యోగ యువత రీటైల్ వెండింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిలో అద్భుతంగా రాణిస్తున్నారు. కర్నూలు, కల్లూరు, సీ.బెళగల్, కోడుమూరు తదితర ప్రాంతాల్లోని రీటైల్ వెండింగ్ యూనిట్ల నిర్వాహకులు గూడూరు మత్స్య సహకార సంఘం ఉత్పత్తి చేసిన చేపలను తీసుకుంటున్నారు. ఈ సంఘం వారంలో 25 క్వింటాళ్ల చేపలను ఉత్పత్తి చేస్తోంది.

వ్యాపారం చాలా బాగుంది



మేము పెంచికలపాడులో ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర రీటైల్ వెండింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నాం. 15 కిలోమీటర్ల దూరంలోని గూడూరులో మత్స్య సహకార సంఘం నిర్వాహకలు స్థానిక చెరువుల్లో అన్ని రకాల చేపలు ఉత్పత్తి చేస్తున్నారు. ఇది మా వ్యాపారానికి బాగా కలసి వస్తోంది. ఆది, మంగళ, శుక్రవారాల్లో అక్కడికి వెళ్లి చేపలు తెచ్చుకుంటున్నాం. రవాణా ఖర్చులు లేనందున మేము కూడా తక్కువ ధరతోనే విక్రయిస్తున్నాం.

– తెలుగు రంగ, పెంచికలపాడు, గూడూరు మండలం

స్థానికంగానే నాణ్యమైన చేపలు



ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర కింద ఏర్పాటైన రీటైల్ వెండింగ్ యూనిట్లకు స్థానికంగానే అన్నిరకాల మంచి నీటి నాణ్యమైన చేపలు అందించే ఏర్పాటు చేశాం. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో అన్ని రకాల చేపల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాం. చేపల పెంపకం, ఉత్పత్తిని శాస్త్రీయంగా చేపట్టేందుకు 8 మత్స్య సాగు బడులు నిర్వహిస్తున్నాం.

– శ్యామలమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి, కర్నూలు

జిల్లాలో ఎనిమిది మత్స్య సాగుబడులు

- మత్స్య శాఖ జిల్లాలో ఎనిమిది మత్స్య సాగు బడులు నిర్వహిస్తోంది.
- జిల్లాలోని 8 రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ మత్స్య సహాయకులు ఉన్నారు.
- ప్రతి వారం వీరు క్షేత్రస్థాయికి వెళ్లి మత్స్యసాగు బడి ద్వారా చేపల పెంపకం, మత్స్యకారుల సంక్షేమానికి ఉన్న పథకాలు, చేపలను ఆహారంగా తీసుకోవడం ద్వారా లభించే పోషకాలు తదితరాలపై అవగాహన పెంచుతున్నారు.
- స్థానికంగా ఉన్న చెరువులు, రిజర్వాయర్లలో ఏ చేపలు పెంచుకోవచ్చు. బరువు పెరుగాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపలు ఎప్పుడెప్పుడు పట్టాలి.. ఎప్పుడు పట్టరాదనే విషయాలను వివరిస్తున్నారు.
- మత్స్యసాగుబడులు ఏడాది పొడవున నిర్వహిస్తుండటం విశేషం.


మత్స్య సాగుబడి ద్వారా చేపల ఉత్పత్తిపై అవగాహన పెంచుతున్న దృశ్యం

కేరళ చండా మేళంకు క్రేజ్

యువతకు ఉపాధి మార్గంగా కేరళ దప్పులు • ఉమ్మడి పశ్చిమగోదావరిలో విస్తరిస్తున్న వైనం


పోతవరం కేరళ చండా మేళం బృందం

కైకలూరు: తెల్లటి పంచె.. మెడలో రుద్రాక్షమాల.. నుదిటిపై గంధపు బొట్టు.. నీలం తువాలకు వేలాడే డ్రమ్స్.. కొందరి చేతుల్లో తాళాలు.. లయబద్ధంగా వాయిస్తుంటే ఆ ప్రాంతం దద్దరిల్లిపోతోంది. ఇది కేరళ చండా మేళంలో ప్రత్యేకత. ఇటీవల హిందూ దేవాలయాల ఉత్సవాలు, వివాహాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఈ మేళం నిలుస్తోంది. కేరళలో ప్రత్యేకత సంతరించుకున్న ఈ మేళాన్ని గ్రామాల్లో యువకులు యూట్యూబ్‌లో సాధన చేసి గ్రూపుగా ఏర్పడి ఉపాధి మార్గంగా మార్చుకుంటున్నారు.

తీన్మార్ స్థానంలో కేరళ డప్పులు

ఉత్సవాల్లో తీన్మార్ దప్పులు ఉర్రూతలూగించేవి. వాటి స్థానాన్ని కేరళ చండామేళం ఆక్రమిస్తోంది. పలు కార్యక్రమాలలో దీనిని ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ మేళం ధ్వని ఒకరకమైన భక్తిభావాన్ని మనసులో నింపుతోంది. గతంలో అయ్యప్పస్వామి భజనలకు ప్రత్యేకంగా కేరళ నుంచి తీసుకొచ్చేవారు. ఖర్చు ఎక్కువయ్యేది. నేడు పలు ప్రాంతాల్లో యువకులు చండా మేళాన్ని నేర్చుకుని కేరళ వేషధారణలో ప్రదర్శిస్తున్నారు. ఏడాదిన్నరగా మేళం జట్లు పెరుగుతున్నాయి. కేరళ సంప్రదాయాన్ని గుర్తుతెచ్చేలా కథాకళి వేషధారణలతో నృత్యాలు ప్రదర్శిస్తున్నారు.

నెలకు 15 ప్రదర్శనలు

పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంకు చెందిన పేదవేగి వెంకట వరప్రసాద్ బీకాం చదివారు. ఏడాదిన్నర నుంచి కేరళ చండా మేళాన్ని సహచరులతో కలసి ఏర్పాటు చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకు 15 ప్రదర్శనలు ఇస్తున్నారు. వీరి జట్లలో బీటెక్, డిగ్రీలు చదువుతున్న యువత ఉన్నారు. ఒక్కొక్కరికి దాదాపు 10 ప్రదర్శనలకు రూ.20 వేలు అందుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోతవరం, పిప్పర, ముక్తేశ్వరం, వీరవాసరంతో పాటు పాలకొల్లు, కాకినాడ ఇలా పలు ప్రాంతాల్లో స్థానికంగా చండా మేళ బృందాలు తయారవుతున్నాయి.

కేరళలో 300 సంవత్సరాలకుపైగా చండా మేళం అత్యంత ప్రజాదారణ పొందుతోంది. మొత్తం 15 మంది సభ్యుల్లో 10 మంది డ్రమ్స్, ఐదుగురు తాళాలు వాయిస్తారు. కేరళలో పెరువెంబు, నెమ్మర, లక్కిజి, వెల్లర్కాజ్, వలప్పాయి గ్రామాల్లో పెరుంకొల్లన్ కుటుంబాలు ఈ డప్పులు తయారు చేస్తారు. ఆవు చర్మంతో తయారు చేసిన డ్రమ్ములకు పనించి మరమ్ అనే చెట్టు విత్తనం నుంచి తయారు చేసిన చెక్క ఉంగరాలను తాడులకు తొడుగుతారు.


కేరళ మేళం ప్రదర్శిస్తున్న కళాకారులు


కేరళలో వాద్యాల కొనుగోలు



చండా మేళం ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారు. ఒక జట్టును తయారి చేయడానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతోంది. వాద్య పరికరాలను కేరళలో కొనుగోలు చేస్తాం. ఒక్కో ప్రోగ్రాంకు రూ.50 వేలకు పైగా తీసుకుంటాం. వాహనంలో 15 మంది జట్టుగా వెళతాం. సంప్రదాయ దుస్తులు ధరించిన తర్వాత ఎంతో నిష్ఠతో వ్యవహరిస్తాం.

– పవీ వరప్రసాద్, టీం మేనేజరు, పోతవరం

ఉత్సవాల్లో ప్రదర్శనలు



కేరళ చండా మేళంలో ధ్వని భక్తి భావాన్ని నింపుతోంది. ఇటీవల దేవాలయాల ఉత్సవాలకు ఈ మేళంతో ప్రదర్శన ఇప్పించాం. జట్టు సభ్యులు ధరించే సంప్రదాయ దుస్తులు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి ఊరేగింపు సమయంలో ఈ వాద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

– వీఎన్‌కే.శేఖర్, శ్యామలాంబ ఆలయ ఈవో, కైకలూరు

నిమ్మ సాగులోనే జీవితం


పొదలకూరు మండలంలో నిమ్మ తోటలు


పొదలకూరు యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

నిమ్మ తోటల సాగు.. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఎంతోమంది రైతుల జీవనాధారం. కొంతకాలంగా సకాలంలో వర్షాలు కురిసి దిగుబడి పెరగడంతో అన్నదాతలు ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మొదలుపెట్టిన జలయజ్ఞం రైతాంగానికి బాగా ఉపయోగపడింది. ఈ ప్రాంతంలో కాలువలను తవ్వించడంతో తోటలకు నీటి వసతి పెరిగింది. పొదలకూరులో నిమ్మ మార్కెట్ యార్డు (ప్రభుత్వ) ఉండడం అనుకూలంగా మారింది.

- మెట్ట రైతుల అభిప్రాయం
- దశాబ్దాలుగా జీవనాధారం
- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై డ్రిప్ పైపుల ఏర్పాటు
- ధరలను శాసిస్తున్న ఢిల్లీ మార్కెట్

పొదలకూరు: నిమ్మ తోటల సాగే లాభదాయంగా ఉంది. ఇది అనేకమంది రైతుల మాట. ఇతర పంటలతో పోల్చి చూసుకుని నిమ్మ సాగే మేలంటున్నారు. జిల్లాలో నిమ్మ తోటల సాగు పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, సైదాపురం, వింజమూరు, మనుబోలు, వెంకటాచలం తదితర మండలాల్లో అధికంగా ఉంది. 4 వేల మంది రైతులు సాగు చేస్తుంటారని అధికారుల అంచనా. ఒకప్పుడు నీటి వసతి లేకపోవడం, ఇతర కారణాలతో తోటలను నరికేసిన రైతులు నేడు నిమ్మ మొక్కలను నాటేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 వేల హెక్టార్లలో నిమ్మ సాగులో ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్

నిమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పడడం కూడా రైతులకు కలిసొచ్చే అంశం. ఢిల్లీ మార్కెట్ నుంచి విదేశాలకు సైతం నిమ్మ ఎగుమతి జరుగుతోంది. మార్కెట్ విస్తరించి ధరలు పెరుగుతుండడంతో ఇక్కడి రైతులకు లాభాలు వస్తున్నాయి. దీంతో వరి సాగును తగ్గించి మెట్ట పంటైన నిమ్మపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. ఫలితంగా ప్రతి ఏడాది జిల్లాలో నిమ్మ సాగు పెరుగుతోంది. గతేడాది రికార్డు స్థాయిలో ఒక బస్తా (లూజు) రూ.16 వేలు ధర పలికింది.

ప్రోత్సాహం ఇలా..

నిమ్మ తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తోంది. పునరుద్ధరణ పథకం కింద ముదురు తోటలను తొలగించి మొక్కలను నాటుకుంటే హెక్టార్‌కు రూ.17,700 ఇస్తున్నారు. రైతులు నర్సరీల వద్ద బిల్లులు తీసుకుని ఉద్యాన శాఖకు సమర్పిస్తే ఉద్యానాధికారి నాటిన మొక్కలను ఫొటోలు తీసుకుని నివేదికలు రూపొందించి నగదు ఇస్తారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మాత్రం చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు 10 ఎకరాల్లోపు, ఓసీ, బీసీలు 5 ఎకరాల్లోపు నిమ్మ సాగు చేసుకుంటే రాయితీలను అందజేస్తున్నారు. సేద్యం ఖర్చులను కూడా ఉపాధి హామీ కిందే పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా తోటల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం బోరు, కేసింగ్ పైపు, మోటార్, విద్యుత్ సౌకర్యం మొత్తం కలిపి ఒక్కో రైతుకు రూ.3 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.

సబ్సిడీపై..

సూక్ష్మ సేద్యం పథకం కింద సబ్సిడీపై నిమ్మ తోటలకు డ్రిప్ పైపులను అందజేస్తున్నారు. ఐదు ఎకరాల్లోపు వారికి 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు వారికి 70 శాతం రాయితీలను డ్రిప్ పైపుల పంపిణీపై ఇస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటులో పొదలకూరు మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. 472.87 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కింద డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యాన, ఏపీఎంఐ శాఖలు అందిస్తున్న రాయితీలను రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

నిమ్మ రైతులకు భరోసా

పొదలకూరులో గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్రలో నిమ్మ రైతులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నారు. నిమ్మకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

ధరల్లో వ్యత్యాసం

ఢిల్లీ మార్కెట్ ప్రకారం ఇక్కడ యార్డులో ధరలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది ధరలు చెప్పుకోదగిన స్థాయిలో లేకున్నా రైతులకు గిట్టుబాటవుతున్నాయి. నిమ్మ సాగు వల్ల నష్టపోతున్న రైతులు అరుదుగా ఉంటారు. సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఇంతకంటే వ్యవసాయం ఉండదు.

– ఎం.శంకర్‌రెడ్డి, రైతు, ముదిగేడు

మార్కెట్ ఆటుపోట్లు

ప్రతి ఏడాది నిమ్మకాయల ధరలు ఒకేలా ఉండవు. కాయల నాణ్యత, డిమాండ్, వాతావరణం తదితర అంశాలను బట్టి ఢిల్లీ మార్కెట్ ధరలను నిర్ణయిస్తుంది. ఈ ఏడాది గతేడాదితో పోల్చిచూస్తే 50 శాతం ధరలే ఉన్నాయి. అయితే ఇప్పుడు ధరలు తక్కువగా లేకున్నా రైతులు ఊహించినంతగా లేవు.

– ఎం.బాలకష్టారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్ యార్డు, పొదలకూరు

విస్తీర్ణం పెరుగుతోంది

ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు మొత్తం కలిపి నాలుగువేల హెక్టార్లలో సాగవుతుంటే ఒక్క నిమ్మ 3,300 హెక్టార్లలో ఉంది. కాయల ధరలు బాగా పెరగడంతో రైతులు నిమ్మ సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ ప్రాంత రైతులకు నిమ్మ సాగుతో విడదీయలేని బంధం ఏర్పడింది. నష్టం, కష్టం వచ్చినా నిమ్మ సాగును వదులుకునేందుకు సిద్ధంగా లేరు.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు


వీణాగుండవెల్లి, ఫౌండర్, సీఈవో, ఇమాజియా

అవకాశాలను సృష్టించుకోవాలి!

విజయానికిదే కొత్త ఫార్ములా
వీణాగుండవెల్లి మనసులో మాట

'డ్రీమ్ బిగ్, ఫాలో యువర్ పాషన్, వర్క్ హార్డ్, వర్క్ స్మార్ట్'... నాలుగు మాటలు. ఈ నాలుగు మాటలే వీణాగుండవెల్లిని విజేతగా నిలబెట్టాయి. 'ఇలా ముందుకెళ్లమని నాకెవ్వరూ చెప్పలేదు. స్వీయశోధన తో తెలుసుకున్న సత్యాలివి. కొత్తతరానికి నేను చెప్ప గలిగిన సూచన ఇది. నేను ఆచరించిన మార్గమే నా సందేశం' అన్నారామె.

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ చేసిన వీణ ఆ తర్వాత యూఎస్ వెళ్లి శాంటాక్లారా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశారు. యూఎస్‌లోని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా ఇమాజియా సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్వహిస్తున్న వీణ ఇటీవల హైదరాబాద్‌కి వచ్చినప్పుడు సాంకేతిక రంగంలో విజయవంతమైన తన జర్నీని ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు.

''యూఎస్‌లో నేను కానన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, సిస్కో సిస్టమ్స్‌లో పని చేసిన తర్వాత టెక్నాలజీ రంగంలో సొంత కంపెనీ ప్రారంభించాను. ఇంట ర్నెట్ మొదలైన రోజులు, అలాగే వైటూకే క్రైసిస్ ఎదురైన రోజులు కూడా. ఆ సమస్యలను అధిగ మిస్తూ ఇంటర్నెట్ ఆధారిత ఫైనాన్స్ అప్లికేషన్స్ సర్వీ సులందించింది మా సంస్థ. ఈ టెక్నాలజీకి భవి ష్యత్తు ఉందని నమ్మాను, నా నమ్మకమే పునాదిగా ముందుకెళ్లాను. ఒక దశ తరవాత కంపెనీ కార్యకలా పాలను విస్తరించాలనే ఉద్దేశంతో వెంచర్ క్యాపిటల్ ద్వారా ఫండ్ రైజింగ్ మొదలుపెట్టాను. మా కంపెనీ సేవల పట్ల నమ్మకం కలిగినప్పటికీ పెట్టుబడులు పెట్టడానికి చాలామంది ముందడుగు వేయలేకపో యారు. అందుకు కారణం మహిళను కావడమే. నా మీద నాకు కాన్ఫిడెన్స్ ఉంది, నేను కాన్ఫిడెంట్‌గా ముందుకెళ్తున్నాను. ఆ మేరకు పెట్టుబడి పెట్టేవాళ్లలో విశ్వాసం కలిగించడం కొంచెం కష్టమైందనే చెప్పాలి. కష్టం అని వదిలిన వాళ్ల వెంట సక్సెస్ రాదు. కష్టాన్ని జయించడమే విజయానికి తొలిమెట్టు. మొత్తానికి నాకున్న సాంకేతిక పరిజ్ఞానం పట్ల విశ్వాసం కలిగిన తరవాత పెట్టుబడులు పెట్టారు. కానీ ఆ తర్వాత 'మీ కంపెనీలో మా ప్రతినిధి సీఈవో హోదాలో ఉంటారు. మీరు టెక్నాలజీ పార్ట్ చూసుకోండి' అన్నారు. ఆ షరతును అంగీకరించాల్సి వచ్చింది. కానీ ఆ ప్రయత్నం విజయవంతం కాలేదు. టాప్‌లో ఉన్న మా కంపెనీ ఒడిదొడుకులకు లోనయింది. తిరిగి టాప్‌లో నిలపడానికి నేను చాలా కష్టపడాల్సి వచ్చింది.

ముందుచూపు

ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వినియోగం ఇప్పుడు బాగా ఎక్కువైంది. మేము 2015లో ప్రాడక్ట్ బిల్డ్ చేశాం. సాంకేతిక రంగానికి ఏఐని పరిచయం చేశా మని చెప్పాలి. ఆ తర్వాత మూడేళ్లకు కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక సహకారాన్ని డిజిటల్‌గా అందించడం మొదలుపెట్టాం. మరో రెండేళ్లలో ఫైనాన్షియల్ డాక్యుమెంట్‌లను చదివి, ప్రాజెస్ చేయగలిగిన తొలి ఏఐ ఇంజన్‌ను తీసుకొచ్చాం. ఈ రంగంలో మేమిచ్చిన డైరెక్షన్‌ను ముందుచూపున్న కంపెనీలు అందుకున్నాయి. మేము ఏఐ ఆధారిత డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నాం. ఆర్థిక లావాదేవీలు వేగంగా జరుగుతుంటే వ్యాపారం కూడా అంతే వేగంగా జరుగుతుంది. ఓటూసీ (ఆర్డర్ టూ కస్టమర్) ప్రాసెస్‌ని మా కంపెనీ చేస్తుంది. తొంభై దేశాల్లో, 25 భాషల్లో మా సేవలందిస్తున్నాం.

భవిష్యత్తు దర్శనం

విజేత కావాలంటే భవిష్యత్తును దర్శించగల గాలి. ఆలోచనను ఆచరణలో పెట్టడానికి ఎట్టి పరిస్థి తుల్లోనూ వెనుకడుగు వేయకూడదు. అలాగే అవకా శాలను అందిపుచ్చుకోవడమనేది పాత మాట. అవ కాశాలను సృష్టించుకోవాలనేది ఈ జనరేషన్ అనుస రించాల్సిన ఫార్ములా. హెన్రీ ఫోర్డ్ ఒక ఇంజనీర్‌గా మిగిలిపోలేదు. తన ఆలోచనతో రవాణాకు యంత్రంతో నడిచే కారు అనే వాహనానికి రూపక ల్పన చేసి పారిశ్రామికవేత్త అయ్యాడు. గుర్రం మీద ప్రయాణించే కాలాన్ని వేగంగా ముందుకు తీసుకె ళ్లాడు. మన ఆలోచన సమాజానికంటే ముందుం డాలి. అది శతాబ్దం కావచ్చు, దశాబ్దం కావచ్చు. ఆ సమయానికి సమాజం మన ఆలోచ నను స్వాగతించవచ్చు లేదా విమ ర్శించనూ వచ్చు. కానీ దానిని నిరూ పించిన తరవాత మన వెంట నడిచి తీరుతుంది'' అన్నారు వీణా గుండ వెల్లి.

ఆమె తన విజయాలనే పాఠ్యాంశాలుగా కాలిఫోర్నియా యూనివర్సిటీలో బోధిస్తున్నారు. అల్పాదాయ వర్గాల వారికి సహాయం చేయడానికి టచ్ ఏ లైఫ్ పేరుతో ఒక ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రయోజనం చేకూరే స్టార్టప్‌లతో ముందుకు వచ్చే యువతకు చేయూతనిస్తున్నారు. ఈ ప్రయాణంలో ఆమెను వరిం చిన అవార్డుల ప్రస్తావనకు ఆమె 'ఎన్నని చెప్పాలి, అయినా ఆ లెక్క ఇప్పుడెం దుకు' అన్నారు నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి

ఒక్కోసారి ఒక చిన్న ఆలోచన కూడా సరైన అవకాశంగా రూపుదిద్దుకుంటుంది.
అదే ఆదాయవనరులను సృష్టించి పెడుతుంది.
భోపాల్‌వాసి రచన ఆర్య విషయంలో అదే జరిగింది.
ఫ్యాషన్ జ్యూవెలరీని తయారు చేసే రచన బొటిక్‌లలో మిగిలిపోయిన ఫ్యాబ్రిక్‌ను సేకరించి, వాటితో ఆభరణాలను తయారు చేస్తూ దానిద్వారా ఆదాయ వనరులను సృష్టించుకుంది. కాటన్ ఫ్యాబ్రిక్‌పైన బ్లాక్ ప్రింట్స్ వేసి, ఆ మెటీరియల్‌తో ఎకోఫ్రెండ్లీ జ్యూయలరీని తయారు చేస్తూ, ప్రదర్శనలు నిర్వహిస్తుంది. 'కేతకి' పేరుతో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతోంది. అభిరుచి నుంచి ఆదాయా నికి మార్గం వేసుకున్న రచన ఆర్య ఫ్యాబ్రిక్ ఆభరణాల తయారీ గురించి ఎన్నో విషయాలను పంచుకుంది.



అభిరుచే ఆభరణమైంది

* ఫ్యాబ్రిక్ స్క్రాప్‌తో ఫ్యాషన్


రచన ఆర్య



''చిన్నప్పుడు గృహాలం కరణ వస్తువులను తయారు చేయడంలో ఇష్టం చూపేదాన్ని. ఎంఫిల్ చేసినా ఆ అభి రుచి అలాగే కొనసాగింది. ఫైన్ ఆర్ట్స్ చదువుతున్న ప్పుడు నా డిజైన్ పనిని మరింత మెరుగుపరిచాయి. ఆ తర్వాత ఐదేళ్లుగా ఫ్యాబ్రిక్ బీడ్స్‌తో నగలను తయారు చేస్తూ ఉపాధిని పొందుతు న్నాను.

మా నాన్న ఆయుర్వేద వైద్యుడు, అమ్మ గృహిణి. సరైన సంపాదన లేకపోవడంతో చాలా ఇబ్బందులను ఎదు ర్కొన్నారు. తర్వాత సొంత బిజినెస్ ఏర్పాటు చేశారు. అది నిలదొక్కుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఎన్ని కష్టాలు వచ్చినా నన్నూ, అన్నయ్యను బాగా చదివించాలనుకున్నారు. వారి ఇష్టం మేరకు చదువుకుంటూనే నా అభిరుచిని మెరుగుపరుచుకుంటూ ఉండేదాన్ని. నెక్లెస్‌లు, ఇయర్ హ్యాంగింగ్స్, ఫ్యాబ్రిక్ బీడ్స్, ట్రైబల్స్ జ్యువెలరీ, దుస్తుల మీద ప్రింట్లు ఇలా అనేక రకాల డిజైన్స్‌పై దృష్టి పెట్టేదాన్ని. ఓ రోజు నేను జ్యువెలరీ పనుల్లో ఉన్నప్పు డు– తేలికగా ఉండే క్లాత్‌తో ఆభరణాలను ఎందుకు తయారు చేయకూడదు– అని ఆర్ట్ డిజైనర్ అయిన మా అన్నయ్య అన్నాడు.

ఎకో ఫ్రెండ్లీ థీమ్

అన్నయ్య ఇచ్చిన పర్యావరణ హిత ఆభరణాల తయారీ ఆలోచన నాకు బాగా నచ్చింది. ఫ్యాషన్ ప్రపంచం లో ఎప్పుడూ కొత్త ప్రయోగాలు జరుగుతూనే ఉంటాయి. హాలీవుడ్ నటి ఏంజెలినా జోలీ కూడా పాత బ్రాండెడ్ దుస్తులను సేకరించి, కొత్తగా మార్చేసి మార్కెట్ చేసే బిజినెస్‌ను ప్రారంభిం చారు. దీనివల్ల ఒకసారి వాడిన వస్తువులను మరోవిధంగా మళ్లీ వాడచ్చు. పర్యావరణానికీ మేలు కలుగుతుంది. దీంతో నేనూ కాటన్ ఫ్యాబ్రిక్ పైన బ్లాక్ ప్రింట్స్ వేసి, ఆ మెటీరియ ల్‌తో జ్యువెలరీ తయారు చేయడం మొదలు పెట్టాను.

స్క్రాప్ .. స్పెషల్

మొదటి నుంచి స్క్రాప్ నుంచి ఆభరణాలను తయారు చేయడం నా ప్రత్యేకత. వీటి ద్వారా రూ.50 నుంచి రూ.1000 వరకు విలువ చేసేవి వివిధ రూపాలలో నా వద్ద డిజైన్లు ఉన్నాయి. ఆరేళ్ల క్రిందట 'కేతకి' పేరుతో ఏర్పాటు చేసిన నా ఈ వ్యాపారంలో పెద్దగా ఒడిదొడు కులు ఎదురు కాలేదు. వేడుక ల్లోనూ, వేదికల్లోనూ ధరించడానికి సందర్భానికి తగిన ఆభరణాలను మహిళలు మెచ్చేలా తయారు చేస్తూ వచ్చాను. మార్కెట్‌లో లభించే మెటల్ ఆభరణాలకు ఇవి పూర్తి భిన్నం. అయితే, ఈ ఫ్యాబ్రిక్ జ్యువె లరీలో మెటల్, పూసలు, ముత్యా లను ఉపయోగిస్తాను. దీనితోపాటు మా ప్రాంతానికి ప్రత్యేకమైన బ్లాక్ ప్రింట్‌ను వాడతాను. ఇది చర్మానికి, పర్యావరణానికి అనుకూలమైనది.



ఎంబ్రాయిడరీ, జరీ జర్దోసీ హస్తకళను ఉపయోగించే ఫ్యాబ్రిక్ జ్యువెలరీని కూడా తయారుచేస్తాను.

వర్క్‌షాప్స్

తయారు చేసిన ఆభరణాలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటాను. నా స్టార్టప్ ద్వారా మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. రిజిస్టర్డ్ ఆర్టిస్ట్‌గా మారాక ప్రభుత్వరంగంలోనూ ఎగ్జిబి షన్లు ఏర్పాటు చేశాను. ఇప్పటివరకు ఢిల్లీ, హైదరాబాద్, రాయ్‌పూర్, కోల్‌కతా ఇండోర్ వంటి పెద్ద నగరాల్లో చేసిన ప్రదర్శనలు, వర్క్‌షాప్స్ మంచి పేరు, ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. ఆభరణాల తయారీలో సహాయకుల సంఖ్య పెరిగింది. ఆన్‌లైన్ ద్వారా, షాప్స్ ద్వారా వీటి అమ్మకాలు జరుపు తుంటాను. చిన్న అభిరుచి ఆదాయ వనరుగా మారింది. ఎంతోమందికి చేరువయ్యేలా చేసింది. పర్యావరణ హిత ప్రయోగాలు చేయడం వల్ల ప్రకృ తికి దగ్గరయ్యాను అనే అనుభూతిని పొందుతున్నాను' అని వివరిస్తుంది రచన ఆర్య.

● 3డి ఆర్టిస్ట్

రోడ్డుపై కనికట్టు

పశ్చిమ బెంగాల్‌లోని భద్రేశ్వర్ అనే ఊళ్లో
రోడ్ల మీద హఠాత్తుగా డాల్ఫిన్ దుముకుతుంటుంది.
గోడ నిలబడుతుంది.
గుంత ఉందనే భ్రాంతి కలుగుతుంది.
పూనమ్ అనే గృహిణి ఇలా 3డి ఆర్ట్‌తో కనికట్టు చేస్తోంది.
ఆమె వీడియోలు యూట్యూబ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి.

కోల్‌కతా నుంచి భద్రేశ్వర్ గంటన్నర దూరం. ఒకప్పుడు అది వేరే ఊరుగాని ఇప్పుడు దాదాపుగా సిటీలో కలిసిపో యింది. ఆ ఊరు ఒకప్పుడు జూట్ మిల్లుకు ప్రసిద్ధి. ఇప్పుడు పూనమ్ వేస్తున్న త్రీడీ బొమ్మలకే ప్రసిద్ధి చెందు తోంది. భద్రేశ్వర్‌లోని ఇరుకు వీధుల్లో పూనమ్ హఠా త్తుగా ప్రత్యక్షమై బొగ్గు, చాక్‌పీస్‌లతో ఒక కాలువను సృష్టించినా, బావిని తవ్వినా త్రీ డైమన్షనల్ ఇల్యూజన్ వల్ల నిజంగా అనిపిస్తాయి. థ్రిల్ పుట్టిస్తాయి. వీటిని పూనమ్ రీల్స్‌గా, షార్ట్ వీడియోస్‌గా విడుదల చేయడం వల్ల వైరల్‌గా మారుతున్నాయి. బోలెడంత మంది అభి మానులను సంపాదించుకుంటున్నాయి.

పూనమ్ ఉత్సాహంగా తన విశేషాలు చెప్పింది. కేవలం చూడటం ద్వారానే ఈ కళను నేర్చుకున్నానని చెప్పింది.

ఎంఏ బిఈడి చదివి

పూనమ్ భద్రేశ్వర్‌లోనే పుట్టి పెరిగింది. ఎం.ఏ, బీఈడి చేసింది. అదే ఊళ్లో కమర్షియల్ ఆర్టిస్ట్‌గా, త్రీడీ ఆర్టిస్ట్‌గా ఉన్న చందన్‌ను వివాహం చేసుకుంది. చందన్ కూడా తన బొమ్మలతో సోషల్ మీడియాలో ఫేమస్. కాని పెళ్లయ్యాక 2002 నుంచి పూనమ్ కూడా వీడియోలు రిలీజ్ చేయడం మొదలుపెట్టి గుర్తింపు పొందింది. 'చిన్న ప్పటి నుంచి నాకు బొమ్మలంటే ఆసక్తి. మా స్కూలు మాస్టారు ఒకాయన నాలో బొమ్మల గురించి ఆసక్తి పెంచారు. నా భర్త చందన్ కూడా ఆర్టిస్ట్ కావడంతో పెళ్లయ్యాక నేను బొమ్మలు ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టాను. అయితే నా భర్త త్రీడీ బొమ్మలు వేయడంలో ఎక్స్‌పర్ట్. నేను అతన్ని నేర్పించమని అడగలేదు. కేవలం చూస్తూ నాకు నేనుగా నేర్చుకున్నాను. త్రీడి బొమ్మ గీయాలంటే కొలతల్లోనే ఉంది అంతా. అలాగే షేడ్ ఎక్కడ ఇవ్వాలో తెలియాలి. అది నేను నేర్చుకున్నాను. ముఖ్యంగా నేనూ నా భర్తా, పిల్లలూ సులభంగా బొమ్మలు గీసేలా టెక్నిక్స్ కనిపెట్టాం. అవి వీడియోల ద్వారా చెబు తున్నాం... అలాగే నేరుగా కూడా క్లాసులు చెప్పి నేర్పి స్తున్నాం. మా కృషి ఆదరణ పొందడం ఆనందంగా ఉంది' అని తెలిపింది పూనమ్.


పూనమ్ – 3డి ఆర్ట్

ప్రత్యేక ఆహార్యం

పూనమ్ తన అన్ని వీడి యోల్లో చీరకట్టుతో, తల మీద కొంగు కప్పుకుని కనిపి స్తుంది. పూర్తిగా గృహిణి ఆహా ర్యంలో ఉండటం వల్ల, అలాంటి ఆహార్యంలో త్రీడీ బొమ్మలు వేసే స్త్రీలు ఎవరూ లేరు కనుక ఆమె వీడియోలు కుతూహలం రేపుతున్నాయి. 'మా వాడలోని పిల్లలంతా నా వీడియోలకు సహకరిస్తుంటారు. బావి గీసి దానిలో దూకమంటే దూకుతున్నట్టుగా యాక్ట్ చేస్తారు. లేని మెట్ల మీద నుంచి గెంతుతారు. వారు లేకపోతే నా వీడియోలు లేవు' అంది పూనమ్. ఆమె ప్రతి ఆల్ఫాబెట్‌తో బొమ్మలు ఎలా గీయాలో వీడియోలు చేసింది. అలాగే అంకెలతో కూడా. ప్రతి గీతను బొమ్మగా మార్చే ఆమె ప్రతిభ నెటిజన్స్‌ను ఆకట్టుకుం టోంది. ఉదాహరణకు ఒక ఇంటి ముందు మెట్లు లేకపో యినా మెట్లు గీయడంతో ఆ ఇంటి గడప లుక్కే మారి ఆశ్చర్యం కలుగుతుంది.

పూనమ్ వీడియోలు ఆమెకు ఆదాయం తెచ్చి పెడుతున్నాయి. ప్రతిభ ఉంటే ఉన్న చోట నుంచే ఉనికి పొందవచ్చంటోంది పూనమ్.

'సాక్షి' పలకరింపు

3 లక్షల సబ్‌స్క్రయిబర్లతో 'పూనమ్ ఆర్ట్ అకాడెమీ' యూ ట్యూబ్ చానల్ పూనమ్ వేస్తున్న త్రీడీ బొమ్మల వీడి యోలతో ట్రెడింగ్‌లో ఉంటోంది. ఇప్పటికి ఆమె వీడియో లకు దాదాపు 14 కోట్ల వ్యూస్ వచ్చాయంటే ఎంత మంది ఎక్కడెక్కడ చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఫేస్‌బుక్ పేజీలో ఫోన్ నంబర్ ఆధారంగా 'సాక్షి' పలకరించితే పూనమ్ ఉత్సాహంగా తన విశేషాలు చెప్పింది.

'రానున్నది రాక మానదు. కానున్నది కాక మానదు' అని నిర్లిప్తంగా ఉండడం లేదు యువతరం. 'ఏం రానున్నది? ఏం కానున్నది?' అనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. క్వాంటమ్ సాంకేతిక విషయంలో మన దేశం అగ్రదేశాలతో పోటీ పడుతోంది. మరోవైపు మన దేశంలోని యువతరం గేమ్‌ఛేంజర్‌గా చెప్పుకునే క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. ఆ కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీలోని ప్రతి కదలికను ఆసక్తిగా గమనిస్తోంది...



క్వాంటమ్ కలల యువతరం

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సంస్థలు, ప్రభుత్వాలు క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధి, పరిశోధనపై వందల కోట్లు వెచ్చిస్తున్నాయి. ఇప్పటికైతే క్వాంటమ్ టెక్నాల జీలో అమెరికా నెంబర్‌వన్‌గా ఉంది. 'నేనేమైనా తక్కువ తిన్నానా!' అంటూ సొంతంగా క్వాంటమ్ కంప్యూటర్‌ను రూపొందించి క్వాంటమ్ టెక్నాలజీపై పట్టు సాధించే దిశగా దూసుకుపోతోంది చైనా. మరోవైపు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇన్‌టెల్.. లాంటి సాంకేతిక దిగ్గజాలు 'క్వాంటమ్ సుప్రిమసీ' కప్పును గెలుచుకోవ డానికి బరిలో ఉన్నాయి. క్వాంటమ్ సాంకేతిక జ్ఞానంపై పట్టు ఉన్న దేశం ప్రగతిప థంలో దూసు కుపోతుందనేది భవిష్యత్ చెప్పే తిరుగు లేని నిజం. అందుకే మన దేశం కూడా క్వాంటమ్‌పై దృష్టి పెట్టింది. ఆరువేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించింది.

ఇంతకీ క్వాంటమ్ టెక్నాలజీ ప్రత్యేకత ఏమిటి?

'ఐబీఎం' (అమెరికన్ మల్టీనేషనల్ టెక్నాలజీ కార్పొరేష న్) మాటల్లో చెప్పాలంటే... 'శాస్త్రవేత్తలు, ఇంజనీర్‌లు క్లిష్టమైన సమస్యల పరి ష్కారానికి సూపర్ కంప్యూట ర్‌లను ఆశ్రయిస్తారు. కొన్ని సమస్యలకు సూపర్ కంప్యూటర్‌లు అంత సూపర్ కావు. సంప్రదాయ కంప్యూటర్‌ల సహాయంతోనే క్లిష్టంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి క్వాంటమ్ మెకానిక్స్ నియమాలను ఉపయోగించుకొని వేగంగా అభివృద్ధి చెందు తున్న సాంకేతికతే... క్వాంటమ్ టెక్నాలజీ'

మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ మూలసూత్రాల ఆధా రంగా పనిచేసే క్వాంటమ్ టెక్నాలజీతో సమాచార భద్రతకు ఢోకా ఉండదు. సంప్రదాయ కంప్యూటర్‌లతో పోల్చితే ఫుల్–స్కేల్ క్వాంటమ్ కంప్యూటర్‌లతో అంతరిక్షం నుంచి ఫైనాన్స్ వరకు ఎన్నో రంగాలలో విప్లవాత్మకమై మార్పులు రాను న్నాయి. 'ఇది అసాధ్యం' అనుకున్నవి 'సాధ్యం' కానున్నాయి. కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. డ్రగ్ అంట్ మెటీరియల్ డెవలప్‌మెంట్‌లో క్వాంటమ్ టెక్నాలజీ కీలకం కానున్నది.

సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ద్వారా యంగ్ టెకీలకు సరికొత్త అవకాశాలు చేరువకానున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా కొన్ని యూనివర్శిటీలలో మాత్రమే క్వాంటమ్ సైన్స్‌ను బోధిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ టెక్నాలజీలో పట్టా అందుకున్న వారు తక్కువగా ఉన్నారట. ఈ కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీపై ప్రాథమిక అవగాహన ఏర్పాటు చేసుకోవడానికి, దాని లోతుపాతులు తెలుసుకోవడా నికి 'ది బెస్ట్ బుక్స్ ఆన్ క్వాంటమ్ కంప్యూటింగ్' వేట మొదలు పెట్టింది యువతరం.

'క్వాంటమ్ కంప్యూటింగ్ ఫర్ ఎవ్రీ వన్' 'క్వాంటమ్ కంప్యూటింగ్: యాన్ అప్లైడ్ అప్రోచ్'; 'క్వాంటమ్ కంప్యూటైజే షన్ అండ్ క్వాంటమ్ ఇన్ఫర్‌మేషన్' 'క్వాంటమ్ కంప్యూటింగ్: ఏ జెంటిల్ ఇంట్రడక్షన్'... ఇలా ఎన్నో పుస్తకాలు యువతరం హస్తభూషణం అయ్యాయి.

'స్ట్రాంగ్ సాఫ్ట్‌వేర్ ట్రెనింగ్ తీసుకున్న స్టూడెంట్స్‌కు క్వాంటమ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లాంగ్వేజ్ పట్టుబడడం కష్టమేమీ కాదు' అంటున్నారు 'ఐబీఎం' రిసెర్చ్ ఇండియా క్వాంటమ్ అంబాసిడర్ ఎల్వీ సుబ్రమణియన్.

ఐఐటీ–మద్రాస్ గత సంవత్సరం ప్రవర్తక్ టెక్నాలజీ ఫౌండేషన్‌తో కలిసి 'అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ కంప్యూటింగ్' పై రెండు వారాల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కోర్స్ లక్ష్యం క్వాంటమ్ కంప్యూటింగ్ మూలసూత్రాలను విద్యార్థులకు పరి చయం చేయడం. గూగుల్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్‌లాంటివి క్వాంటమ్ అప్లికేషన్ లను రూపొందించాయి.

క్వాంటమ్‌కు సంబంధించి కనిపించీ, కనిపించని దారి ఇప్పుడు రాచమార్గమై యువతరాన్ని ఆహ్వానిస్తోంది. ఇక స్పీడ్‌గా ప్రయాణించడమే తరువాయి.

సాధనతో అన్నీ సాధ్యమే

క్వాంటమ్ టెక్నాలజీలో యువతరానికి స్ఫూర్తి ఇస్తున్న మహిళలు అదితిసేన్, కవితా దొరై, కస్తూరి సహా, టీనా సెబాస్టియన్... మొదలైనవారు. ఒక చర్చావేదికలో పాల్గొన్న వీరు క్వాంటమ్ టెక్నాలజీలో మహి ళల ప్రాతినిధ్యం గురించి మాట్లాడారు. సంప్రదాయ ఆలోచన లకు భిన్నంగా ఆలోచించాలని చెప్పారు. తమ ప్రయాణంలో తాము ఎదుర్కొన్న అవ రోధాలను గురించి చెప్పారు. అదితిసేన్ 2000 సంవత్సరంలో తొలిసారిగా స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు 'క్వాంటమ్' గురించి విన్నది. ఆసక్తితో ఈ టెక్నాలజీ గురించి పరిచయ పుస్తకాలు చదివింది. ఆ తరువాత యూనివర్శిటీ ఆఫ్ గడాన్స్క్(పోలాండ్)లో ప్రాజెక్ట్ స్టూడెంట్‌గా చేరి పీహెచ్‌డీ చేసింది. క్వాంటమ్ టెక్నాలజీలోని రిసెర్చ్ ఏరియాలు ఆమెకు ఉత్సా హాన్ని ఇచ్చాయి.




> కెరీర్‌కు సంబంధించి పరిమితులు విధించుకోకూడదు. మరోవైపు చూస్తే ఎన్నో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఆసక్తి, సాధన మిళితమైతే అసాధ్యమైనది లేదు.
>
> – టీనా సెబాస్టియన్, కో–ఫౌండర్, 'క్వాకూన్' (క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ)



హారిక ఖాతాలో మరో 'డ్రా'

మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మరో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. సైప్రస్‌లో 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఈ టోర్నీ జరుగుతోంది. రష్యాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ పొలీనా షువలోవాతో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను హారిక 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. రెండు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక ఏడో రౌండ్‌తర్వాత 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.



అంకిత రైనా శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్ వన్ అంకిత రైనా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పారిస్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అంకిత 7–5, 5–7, 6–2తో ఎమిలైన్ డార్ట్రన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించింది. 2 గంటల 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 51 సార్లు దూసుకొచ్చి 29 సార్లు పాయింట్లు సాధించింది.

చెన్నై 'విజిల్ పోడు'

ఐపీఎల్‌లో నేడు (ఎలిమినేటర్)
ముంబై x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

- ఫైనల్లోకి సూపర్ కింగ్స్
- క్వాలిఫయర్–1లో గుజరాత్‌పై విజయం
- 15 పరుగులతో ఓడిన టైటాన్స్

చెన్నై వేదిక, ధోని కెప్టెన్సీ అంటే ఎంత చిన్న లక్ష్యమైనా ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యమే! నెమ్మదైన చెపాక్ మైదానంలో ఇది మరోసారి కనిపించింది. రెండు రోజుల క్రితం బెంగళూరులో చెలరేగిన జట్టును ధోని తన వ్యూహాలతో కట్టిపడేశాడు. కీలక సమరంలో తన జట్టును గెలిపించి పదోసారి ఫైనల్లోకి చేర్చి అభిమానులతో ఈల (విజిల్‌పోడు) కొట్టించాడు. 173 పరుగులను అందుకోలేక లీగ్ టాపర్, డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ బోల్తా పడింది. అద్భుత ఫామ్‌లో ఉన్న టీమ్ సమష్టి వైఫల్యంతో తమ రెండు సీజన్ల చరిత్రలో తొలిసారి ఆలౌట్ అయింది. నాలుగుసార్లు విజేతగా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే) ఐదో టైటిల్ వేటకు సిద్ధం కాగా... గుజరాత్‌కు రెండో క్వాలిఫయర్ రూపంలో మరో అవకాశం మిగిలి ఉంది. ముంబై, లక్నో జట్ల మధ్య నేడు జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో శుక్రవారం జరిగే రెండో క్వాలిఫయర్‌లో టైటాన్స్ తలపడుతుంది.

చెన్నై: ఐపీఎల్‌లో సొంత ప్రేక్షకుల మధ్య చివరి మ్యాచ్‌గా భావిస్తున్న పోరును ధోని చక్కటి విజయంతో ముగించాడు. మంగళవారం జరిగిన క్వాలిఫయర్–1 మ్యాచ్‌లో సమష్టి ప్రదర్శనతో సూపర్ కింగ్స్ విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే 15 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రుతురాజ్ గైక్వాడ్ (44 బంతుల్లో 60; 7 ఫోర్లు, 1 సిక్స్) డెవాన్ కాన్వే (34 బంతుల్లో 40; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు.



రుతురాజ్ గైక్వాడ్

ఓపెనర్లు మినహా...

ఓపెనర్లు రుతురాజ్, కాన్వే తమ ఫామ్‌ను కొనసాగిస్తూ మరోసారి చెన్నైకి శుభారంభం అందించారు. ఈ క్రమంలో 2 పరుగుల వద్ద రుతురాజ్‌కు కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. తాజా సీజన్‌లో తొలిసారి బరిలోకి దిగిన యువ పేసర్ దర్శన్ నల్కండే తన మూడో బంతికే రుతురాజ్‌ను అవుట్ చేసి సంబరం చేసుకున్నాడు. అయితే అది 'నోబాల్' కావడంతో బతికిపోయిన రుతురాజ్ వరుస బంతుల్లో 6, 4 బాది జోరును ప్రదర్శించగా, కాన్వే కాస్త జాగ్రత్తగా ఆడాడు. పవర్‌ప్లే ముగిసే సరికి చెన్నై 6 ఫోర్లు, సిక్స్‌తో 49 పరుగులు చేయగలిగింది. 36 బంతుల్లో రుతురాజ్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు 87 పరుగుల (64 బంతుల్లో) తొలి వికెట్ భాగస్వామ్యం తర్వాత 11వ ఓవర్లో మొదటి వికెట్ తీయడంలో గుజరాత్ సఫలమైంది. రుతురాజ్‌ను షమీ అవుట్ చేయగా, తర్వాతి ఓవర్లోనే దూబే (2)ను నూర్ వెనక్కి పంపాడు. మూడు బంతుల వ్యవధిలో రహానే (17), కాన్వే పెవిలియన్ చేరగా, అంబటి రాయుడు (17) కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. చివర్లో జడేజా (16 బంతుల్లో 22; 2 ఫోర్లు) కాస్త ధాటిగా ఆడాడు.

సమష్టి వైఫల్యం...

ఛేదన దిశగా ఏ దశలోనూ గుజరాత్ అడుగులు సరిగా పడలేదు. గిల్ కొద్దిగా ప్రతిఘటించినా, మిగతావారంతా పూర్తిగా విఫలమయ్యారు. సాహా (12) ఆరంభంలోనే వెనుదిరగ్గా, కెప్టెన్ హార్దిక్ (8) తన వైఫల్యాలను కొనసాగించాడు. చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగులు రావడం గగనంగా మారింది. 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 72 పరుగులు కాగా... విజయం కోసం చివరి పది ఓవర్లలో 101 పరుగులు చేయాల్సిన స్థితిలో టైటాన్స్ నిలిచింది. దాంతో గిల్, మిల్లర్ (4)లపైనే జట్టు ఆశలు పెట్టుకుంది. అయితే వీరిద్దరు ఒకే స్కోరు వద్ద అవుట్ కావడంతో మ్యాచ్ చెన్నై చేతుల్లోకి వెళ్లిపోయింది.

'సున్నా'కు 500 మొక్కలు చొప్పున...

ఈ మ్యాచ్‌లో బౌలర్ పరుగు ఇవ్వకుండా 'డాట్ బాల్' వేసిన సమయంలో టీవీ స్కోరు బోర్డులో సున్నాకు బదులుగా ఒక పచ్చని మొక్క చూపిస్తూ వచ్చారు. దీనికి ప్రత్యేక కారణం ఉంది. బీసీసీఐ, ఐపీఎల్ ప్రధాన స్పాన్సర్ టాటా కలిసి 'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌ల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాయి. ప్రతీ డాట్ బాల్‌కు బీసీసీఐ 500 చొప్పున మొక్కలు నాటాలని ఒట్టు వేసుకున్నాయి! ఇది నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకూ వర్తిస్తుంది. తొలి క్వాలిఫయర్ చెన్నై ఇన్నింగ్స్‌లో 34 డాట్ బాల్స్, గుజరాత్ ఇన్నింగ్స్‌లో 50 డాట్ బాల్స్ ఉన్నాయి. అంటే ఈ మ్యాచ్‌కు సంబంధించి మొత్తం 42,000 మొక్కలు నాటబోతున్నారు.



స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ శర్మ 60; కాన్వే (సి) రషీద్ (బి) షమీ 40; దూబే (బి) నూర్ 1; రహానే (సి) గిల్ (బి) నల్కండే 17; రాయుడు (సి) షనక (బి) రషీద్ 17; జడేజా (బి) షమీ 22; ధోని (సి) పాండ్యా (బి) మోహిత్ శర్మ 1; మొయిన్ అలీ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1–87, 2–90, 3–121, 4–125, 5–148, 6–155, 7–172. **బౌలింగ్:** షమీ 4–0–28–2, దర్శన్ నల్కండే 4–0–44–1, రషీద్ ఖాన్ 4–0–37–1, నూర్ అహ్మద్ 4–0–29–1, మోహిత్ శర్మ 4–0–31–2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) పతిరణ (బి) చహర్ 12; గిల్ (సి) కాన్వే (బి) చహర్ 42; పాండ్యా (సి) జడేజా (బి) తీక్షణ 8; షనక (సి) తీక్షణ (బి) జడేజా 17; మిల్లర్ (బి) జడేజా 4; విజయ్‌శంకర్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 14; తెవాటియా (బి) తీక్షణ 3; రషీద్ (సి) కాన్వే (బి) తుషార్ 30; నల్కండే (రనౌట్) 0; నూర్ (నాటౌట్) 7; షమీ (సి) చహర్ (బి) పతిరణ 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 157. వికెట్ల పతనం:** 1–22, 2–41, 3–72, 4–88, 5–88, 6–98, 7–136, 8–136, 9–142, 10–157. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–29–2, తుషార్ దేశ్‌పాండే 4–0–43–1, తీక్షణ 4–0–28–2, జడేజా 4–0–18–2, పతిరణ 4–0–37–2.

10 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పదోసారి ఫైనల్ చేరింది. నాలుగుసార్లు విజేతగా, ఐదుసార్లు రన్నరప్‌గా నిలిచింది.

1 గత ఏడాది కొత్త జట్టుగా ఐపీఎల్‌లోకి వచ్చి విజేతగా నిలిచిన గుజరాత్ టైటాన్స్ ఈ టోర్నీ మొత్తంలో తొలిసారి ఓ మ్యాచ్‌లో ఆలౌట్ కావడం గమనార్హం.

4 ఇప్పటి వరకు చెన్నై, గుజరాత్ జట్ల మధ్య నాలుగు ఐపీఎల్ మ్యాచ్‌లు జరగ్గా... నాలుగు మ్యాచ్‌ల్లోనూ రుతురాజ్ గైక్వాడ్ ఒక్కడే అర్ధ సెంచరీ సాధించడం విశేషం.

1 ఐపీఎల్ టోర్నీలో గతంలో గుజరాత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన చెన్నై తొలిసారి గెలిచింది. మూడు మ్యాచ్‌ల్లోనూ ఛేజింగ్‌లో నెగ్గిన గుజరాత్ నాలుగోసారి చేతులెత్తేసింది.

తొలిసారి రజత, కాంస్య పతకాలు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో మెరిసిన గనీమత్, దర్శన రాథోడ్

అల్మాటీ (కజకిస్తాన్): ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీ మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత్‌కు తొలిసారి రజత, కాంస్య పతకాలు లభించాయి. ఆరుగురు షూటర్ల మధ్య మంగళవారం జరిగిన స్కీట్ ఈవెంట్ ఫైనల్లో గనీమత్ 'షూట్ ఆఫ్'లో గురితప్పి రజత పతకం సాధించగా... దర్శన కాంస్య పతకాన్ని సంపాదించింది. 60 షాట్‌ల ఫైనల్లో అసెమ్ ఒరిన్‌బే (కజకిస్తాన్), గనీమత్ 50 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచారు. స్వర్ణ, రజత పతకాల కోసం రెండు షాట్‌ల 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు. ఒరిన్‌బే రెండు పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని ఖరారు చేసుకోగా... గనీమత్ ఒక పాయింట్ సాధించి రజతం దక్కించుకుంది. దర్శన 39 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో దర్శన 120 పాయింట్లు సాధించి రెండో ర్యాంక్‌లో, గనీమత్ 117 పాయింట్లు స్కోరు చేసి నాలుగో ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందారు. పురుషుల స్కీట్ ఈవెంట్‌లో భారత్ నుంచి ముగ్గురు షూటర్లు మేరాజ్ అహ్మద్ ఖాన్, గుర్జోత్ ఖాంగురా, అనంత్‌జీత్ సింగ్ వరుసగా 17వ, 19వ, 23వ స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరలేకపోయారు.



దర్శన రాథోడ్ , గనీమత్ సెఖో

వేర్వేరు గ్రూపుల్లో శ్రీలంక, వెస్టిండీస్

దుబాయ్: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ర్యాంకింగ్స్‌లో పడిపోయిన మాజీ చాంపియన్లు శ్రీలంక, వెస్టిండీస్ జట్లు ఈసారి క్వాలిఫయర్స్ ద్వారా ప్రధాన టోర్నీకి ముందడుగు వేయాల్సి ఉంటుంది. వచ్చేనెల 18 నుంచి జూలై 9 వరకు జింబాబ్వేలో క్వాలిఫయింగ్ టోర్నీ జరుగుతుంది. ప్రధాన టోర్నీకి కేవలం రెండు బెర్త్‌లే ఖాళీ ఉన్నాయి. మొత్తం 10 జట్లు అర్హత టోర్నీలో పాల్గొంటాయి. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, జింబాబ్వే, నెదర్లాండ్స్, నేపాల్, అమెరికా... గ్రూప్ 'బి'లో శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్, ఒమన్, యూఏఈ లీగ్ మ్యాచ్‌లు ఆడతాయి. ఫైనల్స్‌కు చేరే రెండు జట్లు అక్టోబర్–నవంబర్‌లలో భారత్ ఆతిథ్యమిచ్చే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

మెయిన్ 'డ్రా'కు అష్మిత, మాళవిక

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత యువతారలు అష్మిత చాలిహా, మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో అష్మిత 10–21, 21–19, 21–17తో వెన్ యు జాంగ్ (కెనడా)పై... మాళవిక 21–12, 21–19తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ)పై గెలుపొందారు

మనిక ముందంజ



దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ మనిక బత్రా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 11–9, 14–12, 11–4, 11–8తో ప్రపంచ 171వ ర్యాంకర్ వోంగ్ జిన్ రూ (సింగపూర్)పై గెలిచింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. ప్రపంచ 56వ ర్యాంకర్ సత్యన్ జ్ఞానశేఖరన్ 6–11, 6–11, 5–11, 7–11తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ డాంగ్ కియు (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు.

అర్జున్‌కు మూడో విజయం

షార్జా: షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం సాధించాడు. సెర్గీ అజరోవ్ (రష్యా)తో మంగళవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 54 ఎత్తుల్లో గెలుపొందాడు. ఏడో రౌండ్ తర్వాత అర్జున్ 4.5 పాయింట్లతో 14వ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నాలుగో 'డ్రా' నమోదు చేశాడు. ఏడో రౌండ్ తర్వాత గుకేశ్ ఐదు పాయింట్లతో మరో ఐదుగురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు.

సినిమా

ఆహ్లాదంగా ఆటా పాటా...



● చిరంజీవి, తమన్నా

స్విట్జర్లాండ్‌లో అందమైన లొకేషన్స్‌లో ఆడిపాడారు చిరంజీవి, తమన్నా. ఈ పాట ఆడియన్స్‌కి ఏ లెవల్లో కిక్ ఇవ్వనుందనేది ఆగస్టు 11న థియేటర్స్‌లో తెలుస్తుంది. చిరంజీవి హీరోగా మెహర్ రమేశ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా హీరోయిన్‌గా, చెల్లెలిగా కీర్తీ సురేష్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ స్విట్జర్లాండ్‌లో జరుగుతోంది. ''స్విట్జర్లాండ్‌లో కళ్లు చెదిరే అందాలతో, మైమరిపించే లొకేషన్స్‌లో 'భోళాశంకర్' కోసం తమన్నాతో ఆటా పాటా ఎంతో ఆహ్లాదకరంగా జరిగింది'' అని పేర్కొన్నారు చిరంజీవి. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్.

ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నాను!



● శ్రుతీహాసన్

''ఓ సినిమాకు సంబంధించి హీరో, హీరోయిన్ సమానమైన పారితోషికాన్ని అందుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నాను'' అన్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఫ్రాన్స్‌లో ప్రస్తుతం 76వ కాన్స్ చలన చిత్రోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు శ్రుతీహాసన్. ఈ సందర్భంగా 'హీరోతో సమానమైన పారితోషికాన్ని అందుకోవడానికి నాకు రెండు దశాబ్దాలు పట్టింది'' అన్న ప్రియాంకా చోప్రా మాటలపై మీ స్పందన ఏంటి? అన్న ప్రశ్న శ్రుతీకి ఎదురైంది. ఈ విషయంపై శ్రుతీహాసన్ స్పందిస్తూ– ''ప్రియాంకా చోప్రా అద్భుతం సాధించారు (హాలీవుడ్‌లో హీరోకి సమానంగా పారితోషికం అందుకున్న విషయాన్ని ఉద్దేశించి). మేమంతా ఇంకా కష్టపడుతున్నాం. మన దగ్గర సమాన వేతనం అనే అంశం గురించి కనీసం చర్చ కూడా లేదు. కానీ హీరోలతో పాటుగా హీరోయిన్లకి కూడా సమాన వేతనం లభించే రోజు రావాలని ఎదురు చూస్తున్నా'' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ– ''గతంలో నేను కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్నాను. ఈసారి నేను నటించిన ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ 'ది ఐ' కోసం కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నాను. విభిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలు ప్రతిబింబిస్తున్న కాన్స్ వేడుకల్లో దేశం తరపున నేను ఓ ప్రతినిధిగా ఉండటం చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు శ్రుతీహాసన్.

శివమెత్తుతాడు!



● సాయిరామ్ శంకర్

సాయిరామ్ శంకర్ హీరోగా కొత్త సినిమా ప్రారంభమైంది. ఈ చిత్రం ద్వారా ప్రకాశ్ జూరెడ్డి దర్శకునిగా పరిచయం చేస్తూ వీఎస్ఆర్ క్రియేషన్స్‌పై రమణి జూరెడ్డి నిర్మిస్తున్నారు. పోలవరం బంగారమ్మ అమ్మవారి గుడిలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. 'గంగ తలపై ఉన్నంతవరకే శివుడు చల్లగా ఉంటాడు. కంట్లోంచి గానీ జారిందా శివమెత్తుతాడు' అంటూ సాయిరామ్ శంకర్ చెప్పిన డైలాగ్‌తో ముహూర్తపు సన్నివేశాన్ని చిత్రీకరించారు. ''1990లో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా విలేజ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది. ఇళయరాజాగారు ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం హైలైట్. అలాగే డైరెక్టర్ వంశీగారు లిరిక్స్ అందించడం మరో విశేషం'' అన్నారు ప్రకాశ్ జూరెడ్డి, రమణి జూరెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: మోహన్ చారి.


జీవితం విలువ తెలుస్తుంది

– నిర్మాత 'బన్నీ' వాసు



''2018' సినిమా తెలుగు కాపీ చూశాను.. నచ్చింది. సెకండాఫ్‌లో మనకు తెలియకుండానే మనం కన్నీళ్లు పెట్టుకునే సన్నివేశాలు ఉన్నాయి. ముఖ్యంగా చివరి 45 నిమిషాల్లో మనిషి జీవితం తాలూకు విలువ ఏంటో తెలుస్తుంది. 2018లో కేరళలో వరదల సమయంలో అక్కడి ప్రజలు వారి జీవితాలను ఏ విధంగా త్యాగం చేశారు? అనేది దర్శకుడు చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ఇలాంటి రియలిస్టిక్ ఘటనలను కూడా కమర్షియల్ అంశాలతో దర్శకుడు చక్కగా చెప్పారు. ఈ సినిమా ఆడియన్స్‌ను థియేటర్స్‌లో టెన్షన్ పెడుతుంది.. క్లాప్స్ కొట్టిస్తుంది'' అన్నారు 'బన్నీ' వాసు. టొవినో థామస్ ప్రధాన పాత్రధారిగా, అపర్ణా బాలమురళి, కుంచక్కో బోబన్ కీలక పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం '2018'. జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మే 5న విడుదలై ఇప్పటికే రూ. 130 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, ఇంకా ప్రదర్శితమవుతోంది. ఈ సినిమా తెలుగులో ఈ నెల 26న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లోని నైజాంలో గీతా డిస్ట్రిబ్యూషన్, వైజాగ్‌లో 'దిల్' రాజు, మిగతా ఏరియాల్లో 'బన్నీ' వాసు రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు విలేకరులతో మాట్లాడుతూ– ''2018' అందర్నీ మెప్పించే విధంగా ఉంటుంది. ఇక అల్లు అర్జున్‌గారి 'పుష్ప: ది రూల్'ని డిసెంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. షారుక్ ఖాన్ 'జవాన్'లో అల్లు అర్జున్‌గారు నటించారన్నది అవాస్తవం. బాలీవుడ్ మూవీ 'అశ్వత్థామ ఇమ్మోర్టల్' ప్రపోజల్ అల్లు అర్జున్‌గారికి వచ్చింది కానీ ఇంకా ఆయన నిర్ణయం తీసుకోలేదు'' అన్నారు.

నటుడు రే స్టీవెన్సన్ ఇక లేరు



● రే స్టీవెన్సన్



● 'ఆర్ఆర్ఆర్' సెట్‌లో రాజమౌళితో...

'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాలో స్కాట్ దొరగా విలన్ పాత్రలో నటించి, తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఐరిష్ నటుడు రే స్టీవెన్సన్ (58) ఇక లేరు. ఓ ఇటాలియన్ ఫిల్మ్ షూటింగ్‌లో పాల్గొంటున్న స్టీవెన్సన్ హఠాత్తుగా అస్వస్థతకు గురి కావడం, వెంటనే ఆయన్ను హాస్పిటల్‌కు తరలించడం, అప్పటికే స్టీవెన్సన్ మృతి చెందినట్లుగా అక్కడి వైద్యులు చెప్పడం జరిగిందని హాలీవుడ్ కథనం. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'తో భారతీయ ప్రేక్షకులకు సుపరిచితులయ్యారు స్టీవెన్సన్. ఆయన మృతి పట్ల 'ఆర్ఆర్ఆర్' చిత్ర యూనిట్ సభ్యులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

''రే స్టీవెన్సన్ మరణం నాకు షాకింగ్‌గా ఉంది. ఈ వార్తను మేం నమ్మలేకపోతున్నాం. ఆయన సెట్స్‌లో ఉంటే ఆ ప్రదేశం ఎంతో ఎనర్జీతో నిండిపోయేది. రే స్టీవెన్సన్ ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను'' అని ట్వీట్ చేశారు రాజమౌళి.

'రే స్టీవెన్సన్ మరణం నన్ను షాక్‌కు గురి చేసింది' అని ట్వీట్ చేశారు ఎన్టీఆర్.

'రే స్టీవెన్సన్ మరణం నాకు బాధ కలిగించింది'' అని ట్వీట్ చేశారు రామ్‌చరణ్.

ఫేమస్ కావాలనుకునే యువకుల కథ

– సుమంత్ ప్రభాస్



''తప్పు, ఒప్పు.. ఇలా ఏం చేసినా ఊర్లో ఫోకస్, ఫేమస్ కావాలనే ఆలోచన ఉన్న యువకుల కథే 'మేమ్ ఫేమస్'. ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది'' అని సుమంత్ ప్రభాస్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''నా పేరు సుమంత్ రెడ్డి. ప్రభాస్‌గారికి ఫ్యాన్‌ని. అందుకే సుమంత్ ప్రభాస్ అని పెట్టుకున్నాను. డిగ్రీ పాసయ్యాక ఎస్ఐ ఉద్యోగానికి ప్రిపేర్ కావాలనుకున్నాను. డిగ్రీ చదువుతున్నప్పుడు కాలేజీలో అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఒక షార్ట్ ఫిల్మ్ తీశాం.. అది నచ్చడంతో ఒక ఫిల్మ్ స్కూల్ వాళ్లు మాకు కంటెంట్ క్రియేట్ చేయమని కెమెరాలు స్పాన్సర్ చేయడంతో 'పిల్ల పిల్లగాడు' అనే వెబ్ సిరీస్ చేశాం. అది నచ్చడంతో అనురాగ్, శరత్ అన్న పిలిచి, వెబ్ సిరీస్ చేద్దామన్నారు. నేను సినిమా చేద్దామన్నాను. కథ రెడీ చేయమన్నారు. ఆ తర్వాత 'మేమ్ ఫేమస్' కథని వారికి చెప్పాను.. నచ్చడంతో నన్నే డైరెక్షన్ చేయమన్నారు. లీడ్ రోల్‌కి తగ్గ యువకుడు కుదరకపోవడంతో నేనే నటించాను. నా తర్వాతి సినిమా కూడా చాయ్ బిస్కెట్ బ్యానర్‌లోనే ఉంటుంది'' అన్నారు.



● సూర్య, శివశక్తి దత్త

ఈ ప్రయోగం ట్రెండ్‌సెట్టర్ కావాలి

– శివశక్తి దత్త

''వారణాసి సూర్య జీరో బడ్జెట్‌లో తీసిన 'గండ' చిత్రం గురించి విని ఆశ్చర్యపోయాను.. అభినందించాను. డబ్బు లేకున్నా సినిమా చేయాలన్న ఉత్సాహం, తపన ఉంటే చాలని ఈ సినిమాతో నిరూపిస్తున్నారు. ఈజీ సినిమా సంస్థ ప్రయోగం ఎంతో మంది ఔత్సాహికులకు ఆదర్శంగా నిలవాలి.. ఈ సినిమా ట్రెండ్ సెట్టర్ కావాలి'' అని ప్రముఖ రచయిత శివశక్తి దత్త అన్నారు. నూతన నటీనటులతో వారణాసి సూర్య స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'గండ'. ఈ సినిమా టీజర్‌ని శివశక్తి దత్త విడుదల చేశారు. వారణాసి సూర్య మాట్లాడుతూ– ''జీరో బడ్జెట్ మూవీస్ చేయొచ్చని పన్నెండేళ్ల క్రితమే రామ్‌గోపాల్ వర్మగారు చెప్పారు. తెలుగులో మొదటి జీరో బడ్జెట్ మూవీ 'గండ'. ఈ సినిమాపై మా టీమ్ అంతా ఐదేళ్లు వర్క్ చేశాం. మా టీమ్ అంతా కొత్తవారే. కంటెంట్ నమ్ముకుని ఈ సినిమా తీశాం. ఇకపైన కూడా మా ఈజీ సినిమా సంస్థ నుండి జీరో బడ్జెట్ చిత్రాలు వస్తాయి'' అన్నారు.

ఒక్క నిమిషం



● అభిషేక్

అభిషేక్ పచ్చిపాల, నాజియా ఖాన్, వినీషా, ఇషిత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో రెడ్ స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ధర్మపురి ప్రకాష్ నిర్మించారు. ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ''చక్కని ప్రేమకథతో సాగే వినోదాత్మక చిత్రం ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

కెరీర్‌పై బ్లాక్ మార్క్ పెట్టాలని చూశారు

– పవిత్రా లోకేష్



''వినోదం, భావోద్వేగాలు, అద్భుతమైన సంగీతంతో రూపొందిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ చిత్రకథ సమాజానికి అద్దం పడుతుంది'' అని నటి పవిత్రా లోకేష్ అన్నారు. వీకే నరేశ్, పవిత్రా లోకేష్ జంటగా ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా పవిత్రా లోకేష్ మాట్లాడుతూ– ''ఎమ్మెస్ రాజుగారు 'మళ్ళీ పెళ్లి'లో నరేశ్‌గారు, నేను నటిస్తేనే బాగుంటుందనడంతో చేశాం. మళ్ళీ పెళ్లి అంటే సమాజం ఇప్పటికీ తక్కువగానే చూస్తుంది. ఇదొక్కటే కాదు.. సమాజంలో చాలా నిబంధనలు ఉంటాయి. మా విషయంలో (నరేశ్–పవిత్ర) కొన్ని సంఘటనలు జరిగాయి. కొందరు నా వ్యక్తిత్వ హననం చేసి, నా కెరీర్‌పై బ్లాక్ మార్క్ పెట్టాలని చూశారు. ఆ సమయంలో నేను ఒంటరిగా ఉంటే ఆత్మహత్య చేసుకోవాలి? లేదా ఇంట్లో కూర్చోవాలి? ఇప్పుడు నేను బయటికి వచ్చానంటే కారణం నరేశ్‌గారు.. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉన్నారు. విజయ నిర్మల, కృష్ణగార్లతో పాటు మహేశ్‌బాబుగారిని కూడా కలిశాను. ఆ ఫ్యామిలీ మమ్మల్ని (నరేశ్–పవిత్ర) యాక్సెప్ట్ చేసింది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
18	34
61,982	18,348

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,631	▽	90
డోజోన్స్	33,245	▽	42
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,763	▽	8
డాక్స్	16,153	▽	71
షాంఘై	3,246	▽	50
నికాయ్	30,958	▽	129

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	
60,342	▽ 487
బంగారం (22 క్యారెట్)	
60,100	▽ 485
వెండి (కిలో)	
70,718	▽ 1,803

అశోక్ లేలాండ్ లాభం జూమ్

షేరుకి రూ. 2.6 డివిడెండ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం అశోక్ లేలాండ్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు దూసుకెళ్లి రూ. 803 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 158 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,927 కోట్ల నుంచి రూ. 13,203 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 9,430 కోట్ల నుంచి రూ. 12,086 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ప్రస్తుత ఏడాది (2023–24) రూ. 600–750 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో షేను అగర్వాల్ పేర్కొన్నారు. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కంపెనీ టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 1,362 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2021–22లో రూ. 285 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 26,237 కోట్ల నుంచి రూ. 41,673 కోట్లకు జంప్ చేసింది. ఫలితాల నేపథ్యంలో అశోక్ లేలాండ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5 శాతం నీరసించి రూ. 152 వద్ద ముగిసింది.

2,000 నోటు.. సవాలక్ష ప్రశ్నలు!

- ఒక్కో బ్యాంకులో ఒక్కో రకంగా...
- మార్పిడి, డిపాజిట్ నిబంధనల విషయంలో గందరగోళం
- రూ. 2 వేల నోట్ల మార్పిడి ప్రక్రియ ప్రారంభం



న్యూఢిల్లీ: డీమానిటైజేషన్ నాటితో పోలిస్తే చిన్న లైన్లు, కొన్ని బ్యాంకుల్లో నిబంధనలపరమైన గందరగోళం మధ్య రూ. 2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ల ప్రక్రియ మంగళవారం నాడు ప్రారంభమైంది. పాన్ లేదా ఆధార్ వంటి అధికారిక ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా ఫారంలు తప్పనిసరని ఆర్‌బీఐ సూచించకపోయినా కొన్ని బ్యాంకుల్లో సిబ్బంది అవి కావాల్సిందే అనడంతో ఖాతాదారులు అయోమయ పరిస్థితి ఎదుర్కొన్నారు. కొన్ని బ్యాంకులు ఎలక్ట్రానిక్ ఎంట్రీలు చేసుకుని నోట్లను మార్చగా, మరికొన్ని మాత్రం ఎటువంటి ధ్రువీకరణ పత్రాలేమీ అడగకుండా రిజిస్టరులో పేరు, మొబైల్ నంబరు రాయాలంటూ కస్టమర్లకు సూచించాయి. అయితే, కొన్ని బ్యాంకులు మాత్రం పాన్ లేదా ఆధార్ కార్డులను చూపించాలని అడిగినట్లు కొందరు కస్టమర్లు తెలిపారు. అలాగే, మరికొన్ని బ్యాంకులు నోట్లను మార్చలేదని, దానికి బదులుగా తమ తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవాల్సిందిగా సూచించాయని వివరించారు. అయితే, 2016లో పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు (డీమానిటైజేషన్) కనిపించినంతగా చాంతాడంత లైన్లు ఈసారి కనిపించలేదు. పెద్ద ఎత్తున ప్రజలు రావొచ్చనే అంచనాలతో కూర్చునేందుకు, తాగు నీటికి ఢిల్లీలోని రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కువ మంది రాలేదు. నోట్లను మార్చుకునేందుకు దాదాపు 130 రోజుల పైగా వ్యవధి ఉండటం ఇందుకు కారణమని పరిశీలకులు తెలిపారు. నోట్ల మార్పిడి, డిపాజిట్లకు నాలుగు నెలల సమయం ఉండటంతో డీమానిటైజేషన్‌తో పోలిస్తే అంత హడావుడి ఏమీ లేదని ఓ ప్రభుత్వ రంగ బ్యాంక్ సీనియర్ అధికారి తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా డిపాజిట్లు స్వీకరిస్తున్నట్లు వివరించారు. రూ. 2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ కోసం ఎటువంటి ఫారం లేదా పత్రం అవసరం లేదంటూ ఎస్‌బీఐ తమ శాఖలకు అధికారికంగా మెమో పంపించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటువంటి ఫారం నిర్దేశించకపోయినా, తమ ఖాతాదారులు కాకపోతే మాత్రం ఐడీ ప్రూఫ్ మాత్రం అడుగుతోంది. ఇక కోటక్, హెచ్‌ఎస్‌బీసీ వంటి ప్రైవేట్ బ్యాంకులు తమ ఖాతాదారులు కాని వారి దగ్గర్నించి ఫారం/ఐడీ ప్రూఫ్ అడుగుతున్నట్లు తెలిపాయి. కానీ యాక్సిస్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్, యస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటివి మాత్రం తాము ఎటువంటి ఫారం లేదా ఐడీ ప్రూఫ్‌ను తప్పనిసరి చేయడం లేదని పేర్కొన్నాయి. రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇవి చెల్లుబాటవడం కొనసాగుతుంది. సెప్టెంబర్ 30 వరకు వీటిని మార్చుకోవచ్చు లేదా ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చు.

సమర్థించుకున్న ఆర్‌బీఐ..

రూ. 2,000 నోట్ల ఉపసంహరణను ఢిల్లీ హైకోర్టులో ఆర్‌బీఐ సమర్థించుకుంది. ఇది డీమానిటైజేషన్ కాదని చట్టబద్ధమైన ప్రక్రియ మాత్రమేనని తెలిపింది., నిర్వహణ సౌలభ్యం కోసమే నోట్ల మార్పిడిని అనుమతించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఎటువంటి ఆధారాలు చూపకుండా నోట్లను మార్చుకోవచ్చన్న ఆర్‌బీఐ, ఎస్‌బీఐ నోటిఫికేషన్లను సవాలు చేస్తూ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ అనే లాయరు వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఆర్‌బీఐ ఈ మేరకు వాదనలు వినిపించింది. ధ్రువీకరణ పత్రాల ప్రసక్తి లేకపోతే మాఫియా, నక్సల్స్ మొదలైన వారి వల్ల ఇది దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని పిటిషనరు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న మీదట హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

ఆన్‌లైన్‌లో అందుబాటులోకి ఐటీఆర్ 1, 4 ఫారమ్‌లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై ఆదాయపన్ను రిటర్నుల పత్రాలు (ఐటీఆర్) 1, 4లను పన్ను శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యక్తులు, చిన్న వ్యాపారులు, వృత్తి నిపుణులు వీటిని దాఖలు చేస్తుంటారు. ఇతర ఐటీఆర్ పత్రాలను సైతం త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. 2022–23 సంవత్సరానికి ఐటీఆర్‌ల దాఖలు గడువు జూలై 31గా ఉంది. ఐటీఆర్ 1ను వ్యక్తులు, వేతన జీవులు, వృద్ధులు దాఖలు చేస్తుంటారు. ఐటీఆర్4ను వ్యాపారులు, వృత్తి నిపుణులు దాఖలు చేస్తుంటారు.

ఎన్‌ఎండీసీ తుది డివిడెండ్ రూ.2.85



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను ఒక్కో షేరుకు తుది డివిడెండ్ రూ.2.85 ప్రకటించింది. తొలి మధ్యంతర డివిడెండ్‌తో కలుపుకుని ఇది రూ.6.60లకు చేరింది. మార్చి త్రైమాసికంలో నికరలాభం 22 శాతం ఎగసి రూ.2,277 కోట్లకు చేరింది. టర్నోవర్ 13.76 శాతం క్షీణించి రూ.5,851 కోట్లు సాధించింది. 2022–23లో సంస్థ రూ.17,667 కోట్ల టర్నోవర్‌పై రూ.5,529 కోట్ల నికరలాభం ఆర్జించింది.

మూడో రోజూ ముందుకే

- సెన్సెక్స్ 18 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ 34 పాయింట్లు అప్



ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. తొలి నుంచీ లాభాల బాటలో సాగి స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 18 పాయింట్లు పుంజుకుని 61,982 వద్ద నిలిచింది. ఒక దశలో 282 పాయింట్లు జంప్‌చేసి 62,245ను తాకింది. ఇంట్రాడేలో 18,420కు చేరిన నిఫ్టీ చివరికి 34 పాయింట్లు లాభపడింది. 18,348 వద్ద స్థిరపడింది. రోజంతా ఉత్సాహంగా కదిలిన మార్కెట్లు చివరి గంటలో వెనకడుగు వేశాయి.

మెటల్ మెరుపులు..: ఎన్‌ఎస్‌ఈలో వరుసగా రెండో రోజు మెటల్ ఇండెక్స్ 2.6% ఎగసింది. మీడియా, ఆయిల్, ఆటో, ఫార్మా 1.2–0.6% మధ్య వృద్ధి చూపగా.. ఐటీ 0.5% నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ మరోసారి 14% దూసుకెళ్లగా.. దివీస్ 4% ఎగసింది. బజాజ్ ఫిన్, ఐషర్, యూపీఎల్, ఎస్‌బీఐ లైఫ్, బీపీసీఎల్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్, టాటా మోటార్స్ 2–1% మధ్య బలపడ్డాయి.

అదానీ గ్రూప్ విలువ అప్...
షేర్ల ధరల కృత్రిమ పెంపు ఆధారాల్లేవంటూ సుప్రీం కోర్టు నియమిత నిపుణుల కమిటీ పేర్కొనడంతో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలన్నీ వరుసగా మూడో రోజు బలపడ్డాయి. అదానీ విల్మర్ 10 శాతం దూసుకెళ్లగా.. అదానీ పవర్, ట్రాన్స్‌మిషన్, గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ 5 శాతం చొప్పున జంప్ చేశాయి. అంబుజా సిమెంట్స్, అదానీ పోర్ట్స్, ఏసీసీ 1–0.2 శాతం మధ్య లాభపడ్డాయి. దీంతో మూడు రోజుల్లో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ. 1,77,927 కోట్లమేర ఎగసింది. దీంతో 10 కంపెనీలతో కూడిన మొత్తం గ్రూప్ విలువ రూ. 10,79,498 కోట్లకు చేరింది.

రియల్టీ కింగ్.. డీఎల్‌ఎఫ్ సింగ్

- రూ. 59,030 కోట్ల సంపద
- గ్రోహె–హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం
- టాప్ 100లో తెలుగు రాష్ట్రాల వారు 10 మంది

న్యూఢిల్లీ: దేశీ రియల్ ఎస్టేట్ రంగంలో రియల్టీ దిగ్గజం డీఎల్‌ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. రూ. 59,030 కోట్ల సంపదతో మరోసారి నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. 2023కి గాను దేశీ రియల్టీ కుబేరులతో కిచెన్, బాత్రూమ్ ఫిట్టింగ్స్ సంస్థ గ్రోహె, రీసెర్చ్ సంస్థ హురున్ ఇండియా సంయుక్తంగా ఈ లిస్టును రూపొందించింది. 16 నగరాలకు చెందిన 67 కంపెనీలకు సంబంధించి 100 మంది సంపన్నులకు ర్యాంకింగ్ ఇచ్చింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 10 మంది చోటు దక్కించుకున్నారు. జీఏఆర్ కార్పొరేషన్ వ్యవస్థాపక చైర్మన్ జీ అమరేందర్ రెడ్డి కుటుంబం (రూ. 15,000 కోట్లు) పదో స్థానంలో నిల్చింది. మంగళవారం విడుదల చేసిన సంపన్నుల జాబితా ప్రకారం.. రూ. 42,270 కోట్ల సంపదతో మంగళ్ ప్రభాత్ లోధా కుటుంబం (మాక్రోటెక్ డెవలపర్స్ – లోధా గ్రూప్) రెండో స్థానంలో, రూ. 37,000 కోట్ల సంపదతో ఆర్‌ఎంజెడ్ కార్ప్ అర్జున్ మెండా కుటుంబం మూడో స్థానంలో ఉన్నాయి. ఈసారి లిస్టులో 25 మందికి కొత్తగా చోటు దక్కగా, 36 మంది సంపద తగ్గింది.

ఇతర వివరాలు..

- రాష్ట్రాల వారీగా చూస్తే మహారాష్ట్రలో అత్యధికంగా 37 మంది రియల్టీ కుబేరులు ఉన్నారు. ఢిల్లీ (23), కర్ణాటక (18) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణలో 9 మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు ఉన్నారు.
- నగరాలవారీగా చూస్తే ముంబై (29 మంది), న్యూఢిల్లీ (23), బెంగళూరు (18) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- టాప్ 10లో చోటు దక్కించుకునేందుకు కనీస సంపద 2017లో రూ. 3,350 కోట్లుగా ఉండగా ప్రస్తుతం రూ. 15,000 కోట్లకు ఎగిసింది. అలాగే టాప్ 50లో చోటు దక్కించుకునేందుకు కనీస సంపద రూ. 660 కోట్ల నుంచి రూ. 1,330 కోట్లకు చేరింది.
- టాప్ 100 మంది ఔత్సాహిక వ్యాపారవేత్తల మొత్తం సంపద గతేడాదితో పోలిస్తే 4% పెరిగి రూ. 4,72,330 కోట్లుగా (57 బిలియన్ డాలర్లు) ఉంది. ఇందులో టాప్ 10 కుబేరుల వాటా 60%గా ఉంది.
- డీఎల్‌ఎఫ్‌కు చెందిన పియా సింగ్, రేణుకా తల్వార్ అత్యంత సంపన్న మహిళలుగా ఉన్నారు.



HURUN INDIA

తెలుగు రియల్టీ కుబేరులు..

పేరు	కంపెనీ	సంపద (రూ. కోట్లలో)	ర్యాంకు
గవ్వా అమరేందర్ రెడ్డి కుటుంబం	జీఏఆర్	15,000	10
జూపల్లి రామేశ్వర రావు కుటుంబం	మైహోమ్ కన్‌స్ట్రక్షన్స్	9,490	13
సి. వెంకటేశ్వర రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	5,940	16
ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	5,880	17
మనోజ్ నంబూరు	అలయన్స్ ఇన్‌ఫ్రా	3,900	29
అయోధ్య రామిరెడ్డి	రామ్‌కీ ఎస్టేట్స్	1,420	46
సునీల్ బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
సురేంద్ర బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
సురేశ్ బొమ్మిరెడ్డి	అలయన్స్ ఇన్‌ఫ్రా	1,300	49
జీవీకే రెడ్డి, కుటుంబం	తాజ్ జీవీకే హోటల్స్	700	78

జాబ్ పాయింట్

తపాలా శాఖలో 12,828 గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగాలు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలోని బ్రాంచి పోస్ట్ ఆఫీసుల్లో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగాల భర్తీకి స్పెషల్ సైకిల్ మే–2023 ప్రకటన వెలువడింది. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఈ నియామకాలు చేపడతారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12,828(తెలంగాణ–96, ఆంధ్రప్రదేశ్–118)
» **పోస్టుల వివరాలు:** గ్రామీణ డాక్ సేవక్స్–బ్రాంచ్ పోస్టు మాస్టర్/అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా చదివుండాలి. అదేవిధంగా కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు సైకిల్ తొక్కటం వచ్చి ఉండాలి.
» **వయసు:** 11.06.2023 నాటికి 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయసులో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.06.2023.
» **దరఖాస్తు సవరణలకు అవకాశం:** 12.06.2023 నుంచి 14.06.2023 వరకు.
» **వెబ్‌సైట్:** www.indiapostgdsonline.gov.in

భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 100 పోస్టులు

ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్(కాంట్రాక్ట్)ప్రాతిపదికన హైదరాబాద్, బెంగళూరు, భానూర్, విశాఖపట్నం, కొచ్చి, ముంబైలో ఉన్న బీడీఎల్ కార్యాలయాలు/యూనిట్లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** హెచ్‌ఆర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ , కంప్యూటర్ సైన్స్, సివిల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ,పీజీ డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 10.05.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు. » **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.39,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 24.05.2023.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 23.06.2023.
» **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 05.07.2023.
» **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై రెండో వారం.
» **వెబ్‌సైట్:** www.bdl-india.in

ఎన్‌టీపీసీలో 300 పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 300
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్/మెయింటెనెన్స్)
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్
» **అర్హత:** బీఈ, బీటెక్ (ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్)లలో 60 శాతం మార్కుల ఉత్తీర్ణతతోపాటు కనీసం ఏడేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** రూ.60,000 – 1,80,000
» **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేది:** 02.06.2023
» **వెబ్‌సైట్:** www.ntpc.co.in

సశస్త్ర సీమాబల్‌లో 543 కానిస్టేబుల్ పోస్టులు

న్యూఢిల్లీలోని కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన సశస్త్ర సీమాబల్(ఎస్‌ఎస్‌బీ) ..కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 543
» **కేటగిరీలు:** వాషర్‌మ్యాన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్, డ్రైవర్, వెటర్నరీ, కార్పెంటర్, బ్లాక్‌స్మిత్, వాటర్ క్యారియర్, పెయింటర్.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** డ్రైవర్ పోస్టులకు 21 నుంచి 27 ఏళ్లు, వాషర్‌మన్, బార్బర్, సఫాయివాలా, టైలర్, గార్డెనర్, కోబ్లర్, కుక్, వాటర్ క్యారియర్ పోస్టులకు 18 నుంచి 27 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, డాక్యుమెంటేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన. ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.ssbrectt.gov.in

టీచింగ్ కెరీర్‌కు తొలి మెట్టు.. సీటెట్

కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో.. టీచర్ కొలువులకు పోటీపడాలంటే.. సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)లో అర్హత తప్పనిసరి! సీటెట్.. బీఈడీ, డీఈడీ విద్యార్థులకు సుపరిచితమైన పరీక్షే!! ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే..ఆ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు లభిస్తుంది. ఈ ఏడాది జూలై సెషన్‌కు సంబంధించి సీటెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సీటెట్‌కు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

» సీటెట్–2023 జూలై నోటిఫికేషన్ విడుదల
» ఈ స్కోర్‌తోనే ఉపాధ్యాయ నియామకాలకు అర్హత
» స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచింగ్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం–ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే అభ్యర్థులకు బీఈడీ, డీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు.. సీటెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. దీంతో.. సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో టీచర్ కొలువు సొంతం చేసుకోవాలంటే.. సీటెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

రెండు పేపర్లుగా సీటెట్

- బోధించే తరగతులను అనుసరించి సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు పేపర్–1లో అర్హత సాధించాలి.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్‌కు పేపర్–2లో ఉత్తీర్ణత పొందాలి.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరుకావచ్చు.

అర్హతలు

- **పేపర్–1కు అర్హత:** ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత ఉండాలి. లేదా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు బీఈడీ/బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పాస్ అవ్వాలి.
- ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం–బీఈడీ అభ్యర్థులను కూడా ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పేర్కొన్నారు. దీంతో..సీటెట్ టెట్–పేపర్–1కు బీఈడీ ఉత్తీర్ణులు కూడా పోటీ పడొచ్చు.

పేపర్–2కు అర్హత

- బీఏ/బీఎస్సీ/బీకామ్‌ల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత ఉండాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో పాస్ అవ్వాలి(లేదా) బీఈ/బీటెక్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ/బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న వారు కూడా అర్హులే(లేదా) 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ–ఎంఈడీ ఉత్తీర్ణత ఉండాలి.

150 మార్కులకు పేపర్ 1

- పేపర్–1 అయిదు విభాగాల్లో మొత్తం 150 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్–1, 30 ప్రశ్నలు–30 మార్కులకు;లాంగ్వేజ్–2, 30ప్రశ్నలు–30 మార్కులకు;మ్యాథమెటిక్స్ 30ప్రశ్నలు–30 మార్కులకు; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు నిర్వహిస్తారు.పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.
- లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 తప్పనిసరి పేపర్లు. లాంగ్వేజ్–1 విభాగంలో అభ్యర్థులు ఎంచుకున్న బోధన మాధ్యమానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు.
- లాంగ్వేజ్–2 విభాగంలో.. 20 లాంగ్వేజ్‌లలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవచ్చు. ఈ విభాగంలో ఎంచుకునే లాంగ్వేజ్‌ను లాంగ్వేజ్–1 విభాగంలో ఎంచుకోకూడదు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు లాంగ్వేజ్–2లో తెలుగు, ఉర్దూ భాషల్లో హాజరయ్యే అవకాశముంది.

పేపర్–2 కూడా 150 మార్కులకే

- పేపర్–2ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్ 2, 30 ప్రశ్నలు–30 మార్కులకు; మ్యాథమెటిక్స్, సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు; సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు నిర్వహిస్తారు.
- లాంగ్వేజ్–1 విభాగంలో.. అభ్యర్థులు తాము బోధించాలనుకుంటున్న మాధ్యమంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- లాంగ్వేజ్–2 విభాగంలో.. లాంగ్వేజ్–1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌ను ఎంచుకోవాలి. మొత్తం 20 భాషలు అందుబాటులో ఉన్నాయి.



- మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు పేపర్–2లో నాలుగో విభాగాన్ని, సోషల్ టీచర్లు అయిదో విభాగాన్ని ఎంచుకుని పరీక్షకు హాజరు కావాలి.
- ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

సీటెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు..జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో(90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో(75 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో(60 మార్కులు) ఉత్తీర్ణత పొందాలి.

ప్రిపరేషన్ పక్కాగా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో ఎడ్యుకేషనల్ సైకాలజీ నుంచి ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక,ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం,అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు,సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాల గురించి తెలుసుకోవాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే.. ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్ పేపర్లకు ఇలా

లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2 పేపర్లలో రాణించేందుకు సంబంధిత భాషా విభాగాలపై స్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్–2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

ఇందులో రాణించేందుకు పేపర్–1లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పుస్తకాలను చదవాలి. ఈ సబ్జెక్టులో ప్రాథమిక అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. పేపర్–2లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ఎక్కువగా ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్స్‌తో పాటు, పర్యావరణ అంశాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు పొందాలంటే.. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో అడిగిన ప్రశ్నలు కొంత క్లిష్టంగానే ఉన్నాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 26.05.2023
- **సీటెట్ పరీక్ష తేదీ:** జూలై/ఆగస్ట్ నెలల్లో
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

క్లుప్తంగా...

ట్విట్టర్‌లో 'వైఎస్సార్‌సీపీ ఎగైన్ 2024' ట్రెండింగ్

పది నిమిషాల్లోనే జాతీయ స్థాయిలో మొదటి స్థానానికి..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు 'వైఎస్సార్‌సీపీ ఎగైన్ 2024' హ్యాష్‌ట్యాగ్‌తో ట్విట్టర్‌లో ట్రెండింగ్ చేశారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు.. సీఎం జగన్ రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన అంశాలను ట్వీట్లలో వివరించారు. సామాన్యులు కూడా తమకు ప్రభుత్వం వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ పెద్ద ఎత్తున ట్వీట్లు చేశారు. దీంతో ప్రారంభమైన పది నిమిషాల్లోనే ఈ ట్రెండింగ్ జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది.

ఆన్‌లైన్‌లో 'పది' సప్లిమెంటరీ హాల్‌టికెట్లు

2 నుంచి 10 వరకు పరీక్షలు

సాక్షి, అమరావతి: పదో తరగతి అడ్వాన్స్‌డ్‌సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. అన్ని పాఠశాలల నామినల్ రోల్స్, హాల్‌టికెట్లను తమ పాఠశాల కోడ్, పాస్‌వర్డ్‌తో www.bse.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్లపై ఏమైనా తప్పులు ఉంటే వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సరిచేయాలని ఆదేశించారు. కాగా, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 2 నుంచి 10 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల దాకా నిర్వహించనున్నారు.

మైనార్టీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ ఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల మచిలీపట్నంలో 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో రెగ్యులర్ సీట్లు 80, 6వ తరగతిలో 29 సీట్లు, 7వ తరగతిలో 14 సీట్లు, 8వ తరగతిలో 17 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ (ముస్లిం, బీసీ–సీ) విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను చిలకలపూడి ఏపీ ఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల జూన్ 30వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. ప్రథమ భాషగా ఉర్దూ బోధిస్తారని, వివరాలకు 900 0900473 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీలకు షెడ్యూల్ విడుదల

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల విభాగాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)ల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. నేటి (బుధవారం) నుంచి జూన్ 11 వరకు మొత్తం 19 రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. గురువారం నుంచి 27 వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. 28, 29 తేదీల్లో సీనియారిటీ లిస్టును ప్రకటిస్తారు. 30న అభ్యంతరాలను స్వీకరిస్తారు. 31 నుంచి రెండు రోజులపాటు వాటిని పరిశీలిస్తారు. జూన్ 2, 3 తేదీల్లో అర్హత పాయింట్లతో కలిపి తుది సీనియారిటీ లిస్టును ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. అనంతరం జూన్ 4న పాఠశాలల్లోని ఖాళీలను వెల్లడిస్తారు. 5 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చే అవకాశం కల్పించారు. జూన్ 9 నుంచి 11 వరకు బదిలీ అయిన వారి జాబితాను విడుదల చేస్తారు.

ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాల్సిందేనని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలోని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన కార్యాలయంలో కమిషన్ సభ్యులు, సిబ్బందితో కలిసి ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సమస్యలు, చేపట్టవలసిన చర్యలపైన ఆయన పలు ఆదేశాలిచ్చారు. అప్పారావు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు, సెలవుల్లో తరగతుల నిర్వహణ, సమయ పాలన లేకపోవడం, విద్యార్థుల ఆత్మహత్యలు, వేధింపులు వంటి అనేక ఘటనలు బాలల కమిషన్ దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించాలన్నారు. కమిషన్ సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గోండు సీతారాం, త్రిపర్ణ ఆదిలక్ష్మి,, బత్తుల పద్మావతి, ఎం.లక్ష్మీదేవి, మెంబర్ సెక్రెటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆందోళనకరంగానే!

ఎంపీ అవినాశ్ తల్లి శ్రీలక్ష్మికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స

- క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యం అందిస్తున్న విశ్వభారతి వైద్య బృందం
- తల్లి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాశ్
- సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వచ్చారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు
- దుష్ప్రచారాలను ఖండిస్తూ శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నిరసన


కర్నూలులోని విశ్వభారతి హాస్పిటల్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం విషమంగానే ఉంది. కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రి వైద్యుల బృందం క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఎంపీ అవినాశ్ నిరంతరం అక్కడే ఉంటూ తల్లి బాగోగులు ఎప్పటికప్పుడు స్వయంగా చూసుకుంటున్నారు. వారిని పరామర్శించేందుకు రాయలసీమ జిల్లాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఎంపీ అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేస్తోందంటూ తప్పుడు వార్తలకు తెర తీసిన ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని కొనసాగిస్తోంది. శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని వైద్యులు బులెటిన్ విడుదల చేయడం, ఓ వర్గం మీడియా తప్పుడు వార్తల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆస్పత్రి ఎదుట రోడ్డుపైనే సోమవారం రాత్రంతా గడిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీగా బలగాలను తరలించారు.

సీబీఐ అధికారులు ఆస్పత్రిలోకి వెళ్లారంటూ..

పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఉంటున్న సీబీఐ అధికారులు అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి మాత్రమే వెళ్లారు. అయితే ఎల్లో మీడియా మాత్రం సీబీఐ అధికారులు విశ్వభారతి ఆస్పత్రిలోకి వెళ్లారని, అక్కడ పరిస్థితి, శ్రీలక్ష్మి ఆరోగ్యం గురించి వాకబు చేశారని దుష్ప్రచారం చేస్తూ డిబేట్లు నిర్వహించింది. విశ్వభారతి ప్రాంగణం, గాయత్రి ఎస్టేట్‌లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని చెదరగొట్టి ఉద్రిక్తతకు దారితీసేలా కథనాలు ప్రసారం చేసింది. రోప్ పార్టీ పోలీసులు భోజనం చేసేందుకు వెళుతుంటే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిపై ఆందోళనకు దిగినట్లు ఎల్లో మీడియా తప్పుడు వార్తలకు తెగబడింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం మంగళవారం సాయంత్రం వరకూ అంతా ప్రశాంతంగా ఉండటంతో ఇక రాత్రికి అవినాశ్‌ను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మళ్లీ ప్రచారానికి తెరతీసింది.

శాంతియుతంగా నిరసన..

శ్రీలక్ష్మి, అవినాశ్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేశ్, మేయర్లు సురేశ్‌బాబు, బీవై రామయ్య కడప, కర్నూలు కార్పొరేషన్ల కార్పొరేటర్లు ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, ఆర్థర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నాలుగు రోజులుగా రాత్రింబవళ్లు ఆస్పత్రి వద్దే ఉంటున్నారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాలను నిరసిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మంగళవారం రాత్రి 7 గంటలకు ఆస్పత్రి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. తన తల్లి ఆరోగ్యం కుదుట పడగానే 27 తర్వాత తానే స్వయంగా వస్తానని ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రకటించారని, మానవత్వంతో వ్యవహరించాలని సీబీఐ అధికారులకు సూచించారు.

అవినాశ్ ముందస్తు బెయిలుపై

నిర్ణయానికి ఇన్ని రోజులా!

- ఆదేశాలిచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడమేమిటి?
- 25న అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై నిర్ణయం తీసుకోండి
- తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన
- బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉంది
- సునీత తరపు న్యాయవాదితో జస్టిస్ నరసింహ



సాక్షి, న్యూఢిల్లీ: ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిలుపై నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని రోజులా అని తెలంగాణ హైకోర్టుపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తంచేసింది. సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా ఉత్తర్వులు జారీ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అవినాశ్ పిటిషన్‌పై ఈ నెల 25న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపి తగిన ఆదేశాలివ్వాలని ఆదేశించింది. గతంలో మరో బెంచ్ విచారించినప్పటికీ వెకేషన్ బెంచ్ విచారణకు అడ్డంకి కాదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో ముందస్తు బెయిలు పిటిషన్ విచారణకు (జూన్ 5) వచ్చే వరకు సీబీఐ నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని లేదా తన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించేలా ఆదేశాలివ్వాలంటూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన అప్లికేషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత హైకోర్టు విచారించలేదా అని జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. హైకోర్టు రెండుసార్లు విచారించిందని, ఉత్తర్వులు ఇవ్వలేదని, జూన్ 5కు వాయిదా వేసిందని, మే 15న సీబీఐ నుంచి నోటీసులు వచ్చాయని అవినాశ్ తరఫున సీనియర్ న్యాయవాది వి.గిరి తెలిపారు. ఆ తర్వాత ఏం జరిగిందని ధర్మాసనం ప్రశ్నించగా.. సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. 'హైకోర్టులో విచారణ ఉండగా సీబీఐ నోటీసులు ఇవ్వడం గమనార్హం' అని అభిప్రాయపడిన ధర్మాసనం.. సీబీఐ విచారణకు హాజరు కాలేదు కదా అని అనగా.. ఏడుసార్లు పిటిషనర్ హాజరయ్యారని గిరి తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలో రావాలని నోటీసులు ఇవ్వడంతో మూడు రోజులు సమయం కోరామన్నారు. సీబీఐ తరఫున ఎవరైనా హాజరయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ఎవరూ హాజరు కాలేదని వైఎస్ వివేకా కుమార్తె సునీత తరపు న్యాయవాది లూథ్రా తెలిపారు. హైకోర్టులో ఏప్రిల్ 27న ఇద్దరి పిటిషన్లు విచారణకు వచ్చాయని, సీజే వద్దకు వెళ్లినా ఎలాంటి ఆర్డర్ రాలేదని, జూన్ 5న మేటర్ జాబితా అయిందని లూథ్రా వివరించారు. జస్టిస్ నరసింహ జోక్యం చేసుకొని.. ఏమైనా అరెస్టు భయం ఉందా అని ప్రశ్నించారు. తాను మొదటి నుంచి అదే చెబుతున్నానని, ఇప్పటికే అవినాశ్ తండ్రి అరెస్టయ్యారని, తల్లి ఆసుపత్రిలో ఉన్నారని గిరి చెప్పారు. ఈ సమయంలో లూథ్రా జోక్యం చేసుకోవడంతో గిరి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. గిరిని ధర్మాసనం మందలించడంతో ఆయన ధర్మాసనానికి క్షమాపణలు తెలిపారు. బెయిలు కోరే హక్కు పిటిషనర్‌కు ఉందని ధర్మాసనం లూథ్రానుద్దేశించి వ్యాఖ్యానించింది. హైకోర్టు వెకేషన్ బెంచ్ గురించి ఆరా తీసింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు వెకేషన్ బెంచ్ వినాలని సూచిస్తామని తెలిపింది. హైకోర్టుకు వెళ్లాలని ఇరువర్గాలకు తెలిపింది. అవినాశ్ వద్దకు వెళ్లాలని సీబీఐ ప్రయత్నించగా వందలాది మంది అనుచరులు అడ్డుకున్నారని లూథ్రా అనగా.. అవన్నీ సీబీఐ న్యాయవాది చెబుతారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం జస్టిస్ నరసింహ ఉత్తర్వులు వెలువరించారు.

రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతోంది

- పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం
- సీఎం జగన్ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని చూరగొంది
- వైఎస్సార్‌సీపీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న జనరంజక పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా తెలుగునాట నాలుగేళ్లకే ఏ పాలక పక్షంపైనైనా ప్రజల్లో వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కన్పిస్తుందని, అలాంటిది సంక్షోభ సమయాల్లో కూడా సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకుంటూ వారి ఆశలకు, అంచనాలకు అనుగుణంగా నడుస్తూ సీఎం జగన్ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని చూరగొందని అన్నారు. 2024లో జరిగే శాసనసభ ఎన్నికల్లో మరో చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేయడానికి వైఎస్సార్‌సీపీ ఉరకలు పెడుతోందని చెప్పారు. ఏపీ చరిత్రలో జనంలో ఇంతటి ప్రభుత్వ అనుకూల స్థితి ఉండటం ఇదే మొదటిసారి అని తెలిపారు.

దేశానికే దిక్సూచిలా రాష్ట్రం

రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిలా నిలిపిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీ పెట్టిన 8 ఏళ్లలోనే రీసౌండింగ్ విక్టరీతో 151 స్థానాల్లో విజయం సాధించారని తెలిపారు. ముందుగానే తయారు చేసుకున్న బ్లూ ప్రింట్ ప్రకారం సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీతోపాటు మేనిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు చేసి చూపించారని ప్రశంసించారు. ఈ నాలుగేళ్లలో 98.5 శాతంపైగా హామీలను పూర్తిగా అమలు చేశారన్నారు. పారదర్శకంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం వల్ల పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు 93.38 శాతం హాజరు

- ప్రశాంతంగా ముగిసిన ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు
- వెబ్‌సైట్‌లో ఇంజినీరింగ్ ప్రైమరీ కీ
- నేడు అగ్రి, ఫార్మా ప్రాథమిక కీ విడుదల
- 26లోగా అభ్యంతరాలకు గడువు
- సెట్ చైర్మన్ రంగ జనార్దన వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 93.38 శాతం హాజరయ్యారని సెట్ చైర్మన్ ప్రొఫెసర్ జింకా రంగ జనార్దన తెలిపారు. ఈనెల 15 నుంచి 19 వరకు ఎంపీసీ స్ట్రీమ్, 22, 23 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం ముగిసిన ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు రెండింటికీ కలిపి మొత్తం 3,38,739 మంది రిజిస్టర్ అయ్యారు. వీరిలో 3,15,297 మంది పరీక్షలకు హాజరయ్యారు. జేఎన్టీయూ అనంతపురం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఈ పరీక్షలు నిర్వహించాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పరీక్షలు నిర్వహించామని సెట్ చైర్మన్ ఆచార్య జి.రంగ జనార్దన, కన్వీనర్ ఆచార్య సి.శోభా బిందు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మొత్తం దరఖాస్తుల్లో ఇంజినీరింగ్ విభాగానికి 2,38,180 అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు 1,00,559 దరఖాస్తులు వచ్చాయి. 9 సెషన్లలో నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగం పరీక్షలకు 2,24,724 (94.35 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. 4 సెషన్లలో జరిగిన అగ్రికల్చర్ ఫార్మసీ (బైపీసీ) విభాగాల పరీక్షలకు 90,573 (90.07 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక 'కీ' మంగళవారం రాత్రి నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. అగ్రికల్చర్, ఫార్మసీ ప్రాథమిక 'కీ' 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది. 'కీ'లోని అంశాలపై అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు ఈనెల 26వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఆధారాలతో తెలపవచ్చునని చైర్మన్ వివరించారు.

నగరి అబ్బాయి.. చైనా అమ్మాయి

హిందూ సంప్రదాయం ప్రకారం ఒక్కటైన ప్రేమజంట


వివాహ రిసెప్షన్‌లో నగరి అబ్బాయి, చైనా అమ్మాయి

నగరి: చిత్తూరు జిల్లా నగరి అబ్బాయికి చైనా దేశానికి చెందిన అమ్మాయితో ప్రేమ వివాహం జరిగింది. నగరి మున్సిపాలిటీ పరిధి కొత్తపేటకు చెందిన వీఎస్ కృష్ణన్, లత దంపతుల కుమారుడు వీకే పురుషోత్తమన్ బీఈ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి చైనాలోని బెల్జింగ్‌లోని బీఎండబ్ల్యూ గ్రూప్ ఆసియా లిమిటెడ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. బెజ్జింగ్‌కు చెందిన వాంగ్ డిసెంగ్, యాంగ్ కనియింగ్ దంపతుల కుమార్తె డబ్ల్యూ.మింగ్ మింగ్ అదే కంపెనీలో ఫైనాన్షియల్ సర్వీస్‌లో ఉద్యోగం చేస్తోంది. ఈ యువతితో కృష్ణన్‌కు పరిచయం ఏర్పడి..అది కాస్తా ప్రేమగా మారింది. తల్లిదండ్రుల సమ్మతితో పెళ్లి చేసుకోవాలని ఇరువురు నిర్ణయించుకుని తమ ప్రేమ వ్యవహారాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. సంప్రదాయ వ్యవహారాల అడ్డు తొలగించుకునే విషయంలో ఇరువురు విజయం సాధించారు. కృష్ణన్ తల్లి, బంధువుల కోరిక మేరకు నగరిలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరపడానికి వధువు కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. దీంతో చైనా నుంచి నగరికి వచ్చిన అమ్మాయికి వరుని తరపు వారు హిందూ సంప్రదాయం ప్రకారం నలుగు పెట్టి, చీరకట్టి పెళ్లికూతురిలా ముస్తాబు చేసి స్థానిక ఏజేఎస్ కల్యాణ మండపంలో వివాహం జరిపించారు.

తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ

- సైబర్ దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు
- తిరుమల భద్రతపై ప్రత్యేక కమిటీ
- హోం శాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్‌గుప్త


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్‌గుప్త

తిరుమల: తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ ఏర్పాటు చేయనున్నట్టు ఏపీ హోం శాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్‌గుప్త తెలిపారు. మంగళవారం అన్నమయ్య భవన్‌లో ఐఎస్‌డబ్ల్యూ ఐజీ శశిధర్‌రెడ్డి, అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిశోర్, ప్రభుత్వ ఇంటెలిజెన్స్, ఐబీ అధికారులతో తిరుమల భద్రతపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్‌గుప్త మాట్లాడుతూ.. టీటీడీపై సైబర్ దాడులు జరగకుండా అత్యున్నత సైబర్ సెక్యూరిటీ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీవారి ఆలయ ప్రాంతాల్లో పూర్తి ఆయుధాలతో కూడిన క్విక్ రియాక్షన్ టీమ్‌లను నిరంతరం గస్తీ తిరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఏరియా డామినేషన్, ఇంటెలిజెన్స్ అధికారులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు హరీష్ కుమార్‌గుప్త చెప్పారు. కమిటీ సభ్యులు పది రోజుల్లోపు నివేదిక ఇస్తుందని, అందులోని సిఫారసులపై ప్రభుత్వ అనుమతితో అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ సుమిత్, బ్యూరో ఎస్పీ శ్రావణి, జిల్లా అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, టీటీడీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రిడ్‌కు సగం విద్యుత్ సరఫరా మాదే

- ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర గ్రిడ్‌కు ఏపీజెన్‌కో రోజువారీగా 102–105 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తోందని ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం ఎండీ కలిశారు. జెన్‌కో ప్రాజెక్టులు, రాష్ట్రంలో విద్యుత్ సరఫరా స్థితిపై చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నడూ లేని విధంగా అత్యధిక విద్యుత్ డిమాండ్ ఏపీలో ఉందని, మొత్తం వినియోగంలో 40–45% ఏపీ జెన్‌కో సమకూర్చుతోందని చైర్మన్‌కు చక్రధర్‌బాబు వివరించారు. థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలను మెరుగుపరచడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) నిర్వహణలో జాతీయ స్థాయిలో ఉత్తమంగా ఏపీజెన్‌కో ఉందని చెప్పారు. వేసవిలో, నమోదవుతున్న అత్యధిక లోడ్‌కు సరిపడా విద్యుత్‌ను సరఫరా చేస్తోన్న ఏపీ జెన్‌కో పనితీరును నాగార్జునరెడ్డి ప్రశంసించారు.

ఆన్‌లైన్‌లోనే అంతర్ జిల్లాల బదిలీలు

- ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ
- నేటిలోగా ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు సమర్పించాలి
- ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉద్యోగుల అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శుల మొదలు ఎంపీడీవో, డీఎల్‌పీవో స్థాయి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ పూర్తిగా పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పరిధిలోనే ఉంటుంది. ఉద్యోగిని ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాలకు కేటాయించడం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ స్థాయిలో జరుగుతుంది. ఆ తర్వాత జిల్లాకు కేటాయించిన ఉద్యోగికి సంబంధిత జిల్లా పరిధిలో ఏ ప్రాంతం కేటాయించాలన్నది ఆ జిల్లా స్థాయిలో నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలపై తాత్కాలికంగా నిషేధం ఎత్తివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగుల అంతర్ జిల్లాల బదిలీ విధివిధానాలపై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సోమవారం అర్ధరాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు తమ బదిలీ ప్రతిపాదన వివరాలను బుధవారం (నేటి)లోగా ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో జెడ్పీ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులు తమ పరిధిలో ఖాళీల వివరాలను ఈ నెల 23 సాయంత్రంలోగా గుర్తించాలని సూచించారు. ఉద్యోగులు తమ బదిలీ ప్రతిపాదనల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేశాక 26, 27 తేదీల్లో జిల్లాల కేటాయింపులపై కమిషనర్ నిర్ణయం తీసుకుంటారని ఆదేశాల్లో వెల్లడించారు. జిల్లాలకు కేటాయించిన ఉద్యోగులకు 31వ తేదీలోగా ఆయా జిల్లాల స్థాయిలో బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

అనారోగ్యంపై విష కథనాలా?

- ఎల్లో మీడియాపై మాజీ మంత్రి పేర్ని నాని ఆగ్రహం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి,అమరావతి: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి విచారణపై ఎల్లో మీడియా అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. గుండె జబ్బుతో విషమ పరిస్థితుల్లో ఆస్పత్రిలో ఉన్న తల్లిని జాగ్రత్తగా చూసుకునేందుకు ఆయన వెళ్లడం పారిపోవడమా? అని నిలదీశారు. పదేపదే అసత్యాలు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అవినాష్ అరెస్టుకు రాష్ట్ర పోలీసులు సహకరించడం లేదని, కేంద్ర బలగాలను తరలిస్తున్నారని, హెలికాప్టర్లు కూడా రప్పిస్తున్నారంటూ పిచ్చి ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు రాష్ట్రంలోకి సీబీఐని అడుగు పెట్టనివ్వబోనని చంద్రబాబు జీవో తీసుకొస్తే వంత పాడిన ఎల్లో మీడియా ఇప్పుడు అవినాష్‌ను సీబీఐ అరెస్టు చేసి అర్జంటుగా విచారించాలంటూ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పేర్ని నాని మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

జీవో 176లో ఏముందంటే..

చంద్రబాబు అధికారంలో ఉండగా రాధాకృష్ణ, రామోజీ సలహా మేరకు ప్రధాని మోదీతో గొడవ పెట్టుకున్నారు. దీంతో తమ పాపాలన్నీ వెలికి తీసి పాత కేసులను తిరగ తోడతారన్న భయంతో రాష్ట్రంలో సీబీఐని నిషేధిస్తూ 2018 నవంబరు 8న ఏకంగా జీవో 176 జారీ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ రాష్ట్రంలో కూడా పని చేయవచ్చంటూ అంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ చంద్రబాబు ఆ జీవో ఇచ్చారు. రాష్ట్రంలో ఏ కేసునూ సీబీఐ దర్యాప్తు చేయకూడదని, ఏ కేసులోనూ ఎవరినీ విచారించవద్దని, అదుపులోకి తీసుకోవద్దని, అరెస్టు చేయకూడదంటూ ఆ జీవోలో పేర్కొన్నారు. దీనికి ఎల్లో మీడియా ప్రజలకు ఏం సమాధానం చెబుతుంది?

బాబు బతుకంతా స్టేలే కదా?

చంద్రబాబుపై నమోదైన కేసుల్లో ఒక్కదానిపై అయినా విచారణ జరిగిందా? ప్రతి కేసులోనూ ఆయన స్టే లేదా బెయిల్ పొందుతూ రాజకీయాలు చేస్తున్నారు కదా? గతి తప్పిన ఎల్లో మీడియా సీఎం జగన్‌పై విషం చిమ్ముతూ తమకు అనుకూలమైన వారితో చర్చలు పెట్టడం నిత్యకృత్యంగా మారింది. టీడీపీ, ఎల్లో మీడియా వికృత విన్యాసాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. నిజంగా ఏ తప్పూ చేయకుంటే చంద్రబాబు, రామోజీరావు కోర్టులకు వెళ్లి స్టేలు, బెయిళ్లు ఎందుకు తెచ్చుకున్నారు? అభియోగాలు నమోదైన ప్రతిసారీ వారు కోర్టులను ఆశ్రయించడం, స్టే లేదా బెయిల్ బెయిల్ తెచ్చుకోవడం అందరికీ తెలిసిన విషయమే కదా? వారికే ఆ హక్కులుంటాయా? ఏనాడైనా నిజాల్ని నిరూపించుకునేందుకు సిద్ధం, విచారణకు వస్తానని చంద్రబాబు చెప్పారా?

రామోజీ డ్రామాలు

సీఐడీ విచారణ కోసం వెళ్తే నడుముకు బెల్టుతో, పక్కన వెంటిలేటర్ పెట్టుకుని బెడ్‌పై పడుకున్న రామోజీరావు ఎంత డ్రామా చేశారో అందరూ చూశారు. కోర్టులకు వెళ్లడం, స్టేలు, బెయిళ్లు తెచ్చుకునే హక్కులు చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణకు మాత్రమే ఉంటాయా? ఎల్లో మీడియాకి కనీసం మానవత్వం అనేది ఉందా?

నిధులు తెచ్చినా ఏడుపేనా?

రాష్ట్ర విభజన సమయంలో 2014 –15 రెవెన్యూ లోటు గ్రాంటు కింద చంద్రబాబు తేవాల్సిన డబ్బును తీసుకురాలేక విఫలమైతే ఇప్పుడు సీఎం జగన్ కేంద్రంతో మాట్లాడి రూ.10,461 కోట్లు సాధించారు. దాన్ని జీర్ణించుకోలేక నిధుల వరద అంటూ కథనాలు ప్రచురించారు. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి ఎల్లో మీడియా, చంద్రబాబు అభాండాలు వేశారు. ఇప్పుడు నిధులు సాధించినా ఏడుపేనా? పాజిటివ్‌గా ఎందుకు రాయడం లేదు? మచిలీపట్నంలో సీఎం జగన్ సభ బ్రహ్మాండంగా జరిగితే దానిపైనా తప్పుడు రాతలు రాశారు.

నాడు వ్యతిరేకించి నేడు స్వాగతం

చంద్రబాబు ఆస్థాన సలహాదారులైన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, రాజకీయ ఆక్టోపస్ రామోజీరావు అంతా కలిసి గూడుపుఠాణి చేసి నాడు సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వకుండా చేశారు. సీబీఐకి ఎర్రజెండా అంటూ ఈనాడులో వార్తలు ప్రచురించగా, రాష్ట్రంలో సీబీఐకి ప్రవేశం లేదంటూ రాధాకృష్ణ రాసుకొచ్చారు. సీబీఐకి అవకాశం కల్పిస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై కూడా ఏసీబీతో సోదాలు చేసే అవకాశం ఉందని, అందుకే చంద్రబాబు సర్కారు సంచలన నిర్ణయం తీసుకుందంటూ సమర్థించారు. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వివేకా హత్యకు సంబంధించి ఎంపీ అవినాష్‌పై విషపురాతలు రాస్తూ, అసత్యాలు ప్రచారం చేస్తూ సీబీఐని స్వాగతిస్తూ బ్రహ్మరథం పడుతూ అత్యవసరంగా విచారించాలంటున్నారు.

చెన్నైలో ముగిసిన శరత్‌బాబు అంత్యక్రియలు


శరత్‌బాబు భౌతికకాయాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

తమిళ సినిమా: సినీ నటుడు శరత్‌బాబు భౌతిక కాయానికి మంగళవారం చెన్నైలోని గిండిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఆయన పార్థీవదేహాన్ని ఉదయం చెన్నైకి తరలించారు. నటులు రజనీకాంత్, సూర్య, కార్తీ, భానుచందర్, రాజేశ్, భాగ్యరాజ్, పూర్ణిమా భాగ్యరాజ్, శరత్‌కుమార్, రాధిక దంపతులు, నటి సుహాసిని, దర్శకుడు సురేశ్‌కృష్ణ, నిర్మాత పుష్పా కందసామి దంపతులు మొదలగు ప్రముఖులు భౌతికకాయానికి నివాళులర్పించారు. మెగాస్టార్ చిరంజీవి షూటింగ్ కారణంగా విదేశాల్లో ఉండటంతో అంత్యక్రియల్లో పాల్గొనలేకపోతున్నట్లు ఫోన్ ద్వారా తెలియజేశారని, నటుడు కమల్‌హాసన్ షూటింగ్ కారణంగా రాలేకపోతున్నట్లు బుధవారం వచ్చి శరత్‌బాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని చెప్పినట్లు సుహాసిని మీడియాకు చెప్పారు. శరత్‌బాబు పార్థీవ దేహానికి ఆయన కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)